# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 131 | హైదరాబాద్ | మంగళవారం 11-11-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

మళ్లీ పరుగులు పెడుతున్న బంగారం, వెండి ధరలు..
రూ.1.22 లక్షలు దాటిన 10 గ్రాముల పసిడి

## నేటి భారతం

- తెలంగాణ రాష్ట్ర గీతం చేష్టలుడిగి కన్నీరు కారుస్తోంది..
- తండ్రిని కోల్పోయిన తనయాలా కంపించిపోతోంది..
- మానవత్వం మూతీభావించిన కలం ఆగిపోయింది..
- కుళ్ళు రాజకీయాలపై ఎలుగెత్తిన గళం మూగబోయింది..
- ఉవ్వెత్తున లేచిన జన గర్జన నిశ్శబ్దమైంది..
- తెలంగాణ రాష్ట్ర గీతం తన తండ్రిని కోల్పోయింది..
- తెలంగాణ కవి వంశానికి ఆశనిపాతం..
- ఎప్పుడూ చిరునవ్వుతో కనిపించే.. తెలంగాణ కవిపుంగవుడు అందెశ్రీ ఇకలేరు..
- ఈ నిజాన్ని భరించే శక్తి కోల్పోతున్నాను..
- మాయమై పోయాడమ్మా మనసున్న కవి..
- వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఓం శాంతి శాంతి శాంతిః

– జస్టిస్ చంద్రకుమార్

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్‌కు
# సర్వం సిద్ధం




11లో

- రేపు ఉదయం ప్రారంభం కానున్న పోలింగ్
- పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్
- డ్రోన్ల ద్వారా సెక్యూరిటీ మానిటరింగ్ చేస్తామన్న కర్ణన్



11లో

## అందెశ్రీ మృతిపై ప్రధాని మోదీ స్పందన

- ప్రముఖ కవి అందె శ్రీ మృతిపై ప్రధాని మోదీ సంతాపం
- ఆయన మరణం సాంస్కృతిక, మేధో ప్రపంచానికి తీరని లోటు అని వెల్లడి
- అందె శ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబించాయన్న ప్రధాని



11లో

## కేసీఆర్ బాధతో
# కుమిలిపోతున్నారు..

ఆయనను చూస్తుంటే సానుభూతి కలుగుతోంది: రేవంత్ రెడ్డి

- బీఆర్ఎస్ కాలగర్భంలో కలిసిపోతున్న పార్టీ అన్న రేవంత్ రెడ్డి
- ఆ పార్టీ వ్యాలిడిటీ పీరియడ్ ముగిసిపోయిందని వ్యాఖ్య
- కేసీఆర్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదన్న సీఎం

## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన
# అజారుద్దీన్

- మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల బాధ్యతల స్వీకరణ
- కుటుంబ సభ్యులతో కలిసి సచివాలయానికి రాక
- ముస్లిం మత పెద్దల ప్రార్థనల అనంతరం ఛాంబర్‌లో బాధ్యతల స్వీకారం



11లో





11లో

# భారీ పేలుడు..

- పలు నగరాల్లో హై అలర్ట్ ప్రకటించిన కేంద్ర హోంశాఖ
- ఈ ఘటనలో 8 మంది మృతి, 24 మందికి గాయాలు
- చాందినీ చౌక్ మెట్రో స్టేషన్ వద్ద జరిగిన దుర్ఘటన
- ఉగ్రవాద నిరోధక దళం, స్పెషల్ సెల్ దర్యాప్తు ప్రారంభం
- కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసిన పోలీసులు

## రేవంత్ ప్రభుత్వంపై
# వ్యతిరేకత ఉందా..?







- ఎవరూ చేయనటువంటి అభివృద్ధి చేశాడంటున్న కాంగ్రెస్ నాయకులు..
- అనుభవా రాహిత్యంతో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తున్నాడంటున్న విపక్షాలు..
- డివైడ్ టాక్ సొంతం చేసుకున్న రేవంత్ పరిపాలన..
- ఒకవైపు దూసుకుపోతూనే అవినీతికి కొమ్ముకాస్తున్నాడంటూ విమర్శలు..
- స్వపక్షంలోనే విపరీతమైన వ్యతిరేకత ఉందంటున్న విశ్లేషకులు..
- ఏది ఏమైనా స్వర్గీయ వై.ఎస్. తరువాత కాంగ్రెస్ ను ని... రేవంతే..
- అదే అభిప్రాయం అధిష్టానంలో స్థిరస్థాయిగా నిలిచిపోయిందా..?
- సోనియా అల్లుడు రాబర్ట్ వధేరా కోసం రేవంత్ ఓ ప్రాజెక్టు చేస్తున్నాడా..?
- విపక్షాల విమర్శల్లో వాస్తవం ఎంత..? ఇది కేవలం ఊహాగానాలేనా..?
- మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో రేవంత్ దోపిడీకి తెరలేపాడా..?
- నేడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరుగుతున్న సందర్భంగా “ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ“ అందిస్తున్న స్పెషల్ స్టోరీ..

12లో

## పుట్టపర్తికి ప్రధాని మోదీ రాక నేపథ్యంలో
# పటిష్ట ఏర్పాట్లు..



11లో

- పుట్టపర్తి సత్యసాయి శత జయంతి వేడుకలకు ప్రధాని, రాష్ట్రపతి
- ఈ నెల 19న నరేంద్ర మోదీ, 22న ద్రౌపది ముర్ము పర్యటన
- ఏర్పాట్లపై మంత్రులు, అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- భక్తులకు సౌకర్యాలు, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశం
- పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలపై నిర్లక్ష్యం వద్దని స్పష్టం చేసిన సీఎం

# జనంలోనే జగన్

విజయవాడ,నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

వైసీపీ అధినేత వైఎస్ జగన్ పర్యటనలకు మంచి స్పందన లభిస్తుండటంతో ఇక ప్రజల్లో ఉండాలని జగన్ ను నేతలు కోరుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నికలు జరిగి రెండేళ్లు కావస్తుండటంతో వైసీపీకి హనీమూన్ పీరియడ్ ముగిసిందంటున్నారు. ఇప్పుడు కూడా అడపా దడపా వచ్చి ప్రజలను కలుసుకోవడం బాగా లేదని కొందరు వైసీపీ సీనియర్ నేతలే అభిప్రాయపడుతున్నారు. బెంగళూరు నుంచి మకాం మార్చేసి జగన్ తాడేపల్లిలోనే ఉంటూ నిత్యం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచిస్తున్నారు. అప్పుడే క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ప్రస్తుతం పాజిటివ్ వేవ్ ఉన్న కారణంగా జగన్ దానిని చెడగొట్టుకునే ప్రయత్నం చేయవద్దని కూడా సూచిస్తున్నారు.మరొకవైపు త్వరలోనే ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు దూరంగా వైసీపీ ఉంటుందన్న ప్రచారాన్ని పార్టీ నేతలు ఖండిస్తున్నారు. గెలిచినా, ఓటమి పాలయినా స్థానిక సంస్థల ఎన్నికల బరిలో ఉంటామని చెబుతున్నారు. పోటీ లేకుండా చేసి ఎన్నికలను ఏకగ్రీవం చేయడం వల్ల టీడీపీకి అదనపు బలం తమకు తామే సమకూర్చినట్లవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. జగన్ కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపి తాడోపేడో తేల్చుకోవాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. లేకుంటే ద్వితీయ శ్రేణి నేతలు నీరుగారిపోతారని, క్యాడర్ కూడా పార్టీకి దూరమవుతుందన్న భావనలో జగన్ ఉన్నారు. అందుకోసమే ఇక జనంలోనే ఉండాలని జగన్ కూడా భావిస్తున్నారు.. సమస్యల వారీగా జిల్లాల పర్యటన చేయాలని ఆయన భావిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఏదో ఒక సమస్య మీద ప్రతి జిల్లాలో నెలకు రెండు రోజుల పాటు టూర్ చేయాలన్న ప్లాన్ లో జగన్ ఉన్నారని తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలు జనవరి నెలలో జరిగే అవకాశముండటంతో అందుకు రెండు, మూడు నెలల కూడా సమయం లేకపోవడంతో ఇక జిల్లాల పర్యటనకు జగన్ రెడీ అవుతున్నారని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. ఈ పర్యటనలతో పార్టీలో హైప్



రావడమే కాకుండా జనంలో కూడా జగన్ ఉన్నారన్న సంకేతాలు వెళతాయని, అధికార పార్టీ అక్రమ అరెస్ట్ లు కూడా ఎండగట్టే అవకాశముంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. టూర్ షెడ్యూల్ ను సిద్ధం చేయాలని పార్టీ నేతలను జగన్ కోరినట్లు తెలిసింది. ఇక 2027లో రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయడానికి కూడా సిద్ధమయ్యారు. ఇందుకోసం ఆయన ముందుగా జిల్లాలు తిరిగి క్యాడర్ ను, లీడర్లను మోటివేట్ చేయనున్నారని తెలిసింది.

==============================

# 48 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు

విజయవాడ, నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

టీడీపీ ఎమ్మెల్యేల్లో 48 మంది పూర్తిగా దారి తప్పారని చంద్రబాబునాయుడు గుర్తించారు. ఎన్నిసార్లు చెప్పిన వికపోవడంతో నోటీసులు జారీ చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం, ప్రవర్తనలో లోపాలు ఉన్న 48 మంది ఎమ్మెల్యేలకు వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. తీరు మారకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమైన సీఎం, పెన్షన్ల పంపిణీ, సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత వంటి కార్యక్రమాలపై సమీక్షించారు. ప్రజల సమస్యలను పరిష్కారానికి ఎమ్మెల్యేలు ఎంత మంది అందుబాటులో ఉంటున్నారో తెలుసుకున్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు కాల పరిమితి తీరిపోయే వరకూ పంపిణీ చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెన్షన్ల పంపిణీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసే కార్యక్రమాల్లో 48 మంది ఎమ్మెల్యేలు పాల్గొనకపోవడం సీఎం దృష్టికి వచ్చింది. బ్యాక్ ఆఫీసు, ప్రోగ్రాం కమిటీకి ఆదేశాలు జారీ చేస్తూ, ఆ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని సూచించారు. వివరణ సంతృప్తికరంగా లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పేదల సేవలో భాగంగా పెన్షన్ల పంపిణీలో మంత్రులు, ఎమ్మెల్యేలు తప్పకుండా పాల్గొనాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని, కార్యకర్తలు, ప్రజలతో మాట్లాడాలని సూచించారు. టీడీపీ కార్యకర్తలకు ఇన్సురెన్స్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో కూడా ఎమ్మెల్యేలు తప్పకుండా పాల్గొనాలి. పనిచేసిన వారందర్నీ కలుపుకుని వెళ్లాలన్నారు. ప్రతి శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయాల్లో జరిగే ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాల్గొనాలి. పాల్గొనకపోతే పార్టీ కేంద్ర కార్యాలయం వివరణ తీసుకోవాలి ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు గతంలో కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పేదలకు ఎన్నోకష్టాల్లో ఉంటే సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకుంటారు. వారికి మంజూరు అయిన డబ్బులు కూడా ఇవ్వడానికి ఎమ్మెల్యేలకు తీరిక లేకపోతే ఇక వారికి ప్రజా సేవ చేయడానికి అర్హత ఏముంటుందన్న ప్రశ్నలు వస్తున్నాయి. సీఎం ఆర్ఎఫ్ చెక్కులకు మూడు నెలల పరిమితి ఉంటుంది. ఇష్యూ చేసిన తేదీ నుంచి మూడు నెలల పాటు చెక్కులు పంపిణీ చేయకపోవడం వల్ల అవి తిరిగి వస్తున్నాయి . కొత్తగా చెక్కులు జారీ చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఇది సీఎంను అసహనానికి గురి చేసింది. ఇప్పటి వరకూ చూశామని ఇక పనితీరు మార్చుకోకపోతే పక్కన పెట్టాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది.

కొలిక్కా తిరువూరు వివాదం...

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు, ఎంపీ కేశినేని చిన్ని మధ్య వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు. ఓపెన్ గానే విమర్శలు గుప్పించుకున్నారు. ఇరువురు నేతలు మీడియాకు ఎక్కి రచ్చ రచ్చ చేశారు. వీరి మధ్య వివాదం టీడీపీలో పెను దుమారమే రేపింది. దీంతో సీఎం చంద్రబాబు ఫుల్ సీరియస్ అయ్యారు. వీరి వ్యవహారంపై ఆరా తీశారు. అసలేం జరిగిందో తెలుసుకోవాలని , దీనిపై తనకు పూర్తి నివేదిక సమర్పించాలని టీడీపీ క్రమశిక్షణ కమిటీని ఆదేశించారు చంద్రబాబు.ఆయన ఆదేశాలతో రంగంలోకి దిగింది టీడీపీ క్రమశిక్షణ కమిటీ. వర్ల రామయ్య, కొనకొళ్ల నారాయణ, పంచుమర్తి అనురాధ నేతృత్వంలోని ఈ కమిటీ.. నేతల మధ్య వివాదంపై ఆరా తీసింది. ఇరువురి నుంచి వివరణ తీసుకుంది. తిరువూరులో స్థానిక పరిస్థితులపైనా ఆరా తీశారు. ఈ అంశంపై నివేదిక రూపొందించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. ఆ నివేదికలో ఏముంది? అనేది ఉత్కంఠగా మారింది. నివేదిక పరిశీలించిన తర్వాత సీఎం చంద్రబాబు నిర్ణయం ఏ విధంగా ఉండనుంది, ఎవరిపైన చర్యలు ఉంటాయి అనేది పార్టీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.కాగా, తిరువూరు ఎమ్మెల్యే టికెట్ కోసం ఎంపీ కేశినేని చిన్ని 5 కోట్లు తీసుకున్నారని ఎమ్మెల్యే కొలికపూడి తీవ్ర ఆరోపణలు చేశారు. దీనికి ఘాటుగానే బదులిచ్చారు కేశినేని శివనాథ్. వైసీపీ కోవర్ట్ అంటూ కొలికపూడిపై ఎదురుదాడికి దిగారాయన.

## జనసేన సోషల్ మీడియా ఖాతాలు హ్యాక్

గుంటూరు, నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

రాజకీయ పార్టీలకు, ప్రముఖులకు సంబంధించిన ట్విట్టర్ ఖాతాలు, ఫేస్‌బుక్ అకౌంట్లు పలు సందర్భాల్లో హ్యాకింగ్‌కు గురవుతున్న విషయం తెలిసిందే. బాధితుల్లో అనేక మంది సెలబ్రిటీలు కూడా ఉన్నారు. అయితే, తాజాగా.. జనసేన పార్టీ ట్విట్టర్ అకౌంట్ హ్యాకర్ల బారినపడింది. ఎప్పుడూ జనసేన పార్టీకి సంబంధించిన, పవన్ కల్యాణ్ ప్రోగ్రాంలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు కనిపించే ఈ ట్విటర్ ఖాతాలో.. ఇన్వెస్ట్‌మెంట్స్, ట్రేడింగ్స్‌కు సంబంధించిన రీ ట్వీట్స్ కనిపించడంతో ఫాలోవర్లు అవాక్కయ్యారు.జనసేన పార్టీ అధికారిక ఎక్స్ (గతంలో ట్విటర్) హ్యాండిల్ హ్యాకింగ్‌కు గురైంది. ఈ ఘటన వెలుగులోకి రాగానే పార్టీ నాయకత్వం అప్రమత్తమైంది. సైబర్ క్రైం అధికారులను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఖాతా పునరుద్ధరణ కోసం సాంకేతిక బృందం చర్యలు చేపట్టినట్లు సమాచారం. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జనసేన పార్టీ ట్విట్టర్ ఖాతా సైబర్ నేరగాళ్ల ఆధీనంలోనే ఉంది.నిత్యం పొలిటికల్ పోస్టులు కనిపించే జనసేన హ్యాండిల్లో హ్యాకింగ్‌కు గురైన తర్వాత ఇన్వెస్ట్ మెంట్స్, ట్రేడింగ్స్ సంబంధించిన రీ ట్వీట్ చేసిన పోస్టులు దర్శనమిస్తున్నాయి. ఇది చూసిన పార్టీ అభిమానులు, శ్రేణులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఈ హ్యాకింగ్ ఘటనపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇదిలాఉంటే.. గత ఏడాది ఎన్నికల సమయంలోనూ జనసేన పార్టీకి సంబంధించిన అధికారిక యూట్యూబ్ ఛానల్ హ్యాకయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పార్టీకి సంబంధించిన వీడియోలు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సభలు, సమావేశాలు ఉండటంతో పార్టీ యూట్యూబ్ ఛానల్ ఫుల్ యాక్టివ్ గా ఉన్న సమయంలో ఈ సంఘటన జరిగింది. ఆ సమయంలో ఆ యూట్యూబ్ ఛానల్ లో జనసేన పార్టీకి చెందిన వీడియోలను తొలగించిన హ్యాకర్లు.. బిట్ కాయిన్ వీడియోలు అప్లోడ్ చేశారు. జనసేన యూట్యూబ్ ఛానల్ పేరు తొలగించి.. మైక్రో స్ట్రాటజీ అని పేరు మార్చేశారు. తాజాగా.. ఇప్పుడు జనసేన ట్విట్టర్ ఖాతా హాక్ కావడం చర్చనీయాంశంగా మారింది.

# ఎన్ హెచ్ 65 గేమ్ ఛేంజర్ కాబోతోందా

విజయవాడ, నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

ఏపీలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ఆసక్తి చూపించటం, మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణం వంటి కారణాలతో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటోంది. మరోవైపు



విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీంతో విజయవాడ శివారు ప్రాంతమైన ఉయ్యూరు వంటి చోట్ల భూములకు డిమాండ్ పెరుగుతోందని.. రియల్ ఎస్టేట్ వర్గాలు చెప్తున్నాయి. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగానికి జాతీయ రహదారి విస్తరణ గేమ్ ఛేంజర్ అవుతుందని అంచనా వేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏపీలో అనేక మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణంలో వేగం పెరిగింది. కేంద్రంలోని ఎన్డీఏ సర్కారులో టీడీపీ, జనసేన పార్టీలు కీలక భాగస్వామ్యులుగా ఉండటంతో రాష్ట్రంలోని జాతీయ రహదారులు, రైల్వే లైన్ల నిర్మాణంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి తగిన మద్దతు లభిస్తోంది. మరోవైపు మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణంతో ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటూ ఉండటంతో .. ఆయా ప్రాంతాల్లో భూములకు మంచి డిమాండ్ వస్తోంది. తాజాగా విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి (ఔఊ -65) విస్తరణపై అధికారులు దృష్టి సారించారు. విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలని ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే కన్సల్టెన్సీ సంస్థ సమగ్ర ప్రాజెక్టు నివేదిక కూడా రూపొందించింది.అయితే విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ పనులు పట్టాలెక్కితే విజయవాడ శివారు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ పుంజుకుంటుందని రియల్ ఎస్టేట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ఉయ్యూరు లాంటి ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ పుంజుకోవడానికి ఈ ప్రాజెక్టు గేమ్ ఛేంజర్ అవుతుందని చెప్తున్నాయి. పరిశ్రమలు విస్తరించడం, మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో ఈ ప్రాంతంలో ఆస్తి విలువలు పెరుగుతాయని, ఇళ్లకు డిమాండ్ ఏర్పడుతుందని.. అలాగే ఈ ప్రాంత జీవనశైలిలోనూ మార్పులు వచ్చే అవకాశాలు ఉందటున్నారు.ప్రస్తుతం విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి -65 ముఖ్యమైన మార్గంగా ఉంది. విజయవాడను పోర్టు సిటీ అయిన మచిలీపట్నంతో కలిపే రహదారి ఇదే. అయితే పరిశ్రమలు, లాజిస్టిక్స్, వాణిజ్యం పెరిగే కొద్దీ, ఈ రహదారిపై వాహనాల రాకపోకలు పెరిగాయి. దీంతో ఈ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించారని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలు ఇబ్బందులు ఉండవని, ప్రయాణం మరింత వేగంగా, సౌకర్యవంతంగా మారుతుందని అభిప్రాయపడుతున్నారు.ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే ఈ కారిడార్ వెంబడి ఖరీదైన విల్లాలు, కమర్షియల్ హబ్స్, నివాస ప్రాంతాలు ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి.దీంతో విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ కారణంగా ఉయ్యూరు వంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ బూమ్ వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో మౌలిక వసతుల నిర్మాణం, పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని.. ఈ నేపథ్యంలో భూములకు మంచి డిమాండ్ ఏర్పడుతుందని చెప్తున్నారు.

---

భారత శక్తి

# చావొక్కటే.. అన్నింటికీ పరిష్కారం కాదు

జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా ఎదుర్కోవాలి! ఎవరి జీవితం కూడా పూల పాన్పు కాదు. ఈ డైలాగ్‌ని.. మన జీవితంలో ఎప్పుడో ఒకసారి వినే ఉంటాం. ఎక్కడో ఓ చోట చదివే ఉంటాం. లైఫ్ అంటే.. ఎప్పుడూ సుఖంగా, అన్ని రోజులూ సంతోషంగా ఉండదని తెలుసు. కష్టాలు, సుఖాలు, సవాళ్లు, సమస్యలు.. అందరికీ ఉంటాయ్. ఇవన్నీ.. ఏదో ఒక ఫేజ్‌లో ఎదుర్కోక తప్పదు. అయినా సరే.. జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా.. ఎదుర్కోవాలి. వాటన్నింటిని ధైర్యంగా దాటుకొని.. ముందుకు సాగాలి. కానీ.. ఈరోజులు అలా లేవు. కాలం మారేకొద్దీ.. పబ్లిక్ మరింత వీక్‌గా తయారవుతున్నారు. చిన్న చిన్న విషయాలకే.. చాలా పెద్ద నిర్ణయాలు తీసుకుంటున్నారు. తనువు చాలిస్తున్నారు. సమస్య వస్తే చాలు.. దాన్ని ఎదుర్కోలేక చచ్చిపోతున్నారు. ఇటీవలి కాలంలో చిన్నా, పెద్ద, యువత, ముసలి, ముతకా అనే తేడా లేదు. అందరిదీ అదే దారి. ఎంతో అందమైన జీవితాన్ని గెలవలేక.. అర్ధాంతరంగా చనిపోతున్నారు. అసలు.. ఓ చిన్న సమస్యని కూడా ఎదుర్కొనే ధైర్యం లేకుండా ఎలా ఉంటున్నారు? దేనినైనా తట్టుకోగలిగే, ఎదుర్కోగలిగే ఆత్మవిశ్వాసం ఏమైపోయిందనే ప్రశ్నలే.. ఇప్పుడు అందరిలోనూ తలెత్తుతున్నాయ్. సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో విశాఖలో యువకుడు ఆత్మహత్య సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో.. తల్లిదండ్రులను మోసం చేశాననే మనస్తాపంతో విశాఖలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొబ్బరితోట ఏరియాలో ఓ గదిని అద్దెకు తీసుకొని.. హీలియం గ్యాస్‌తో ముఖానికి కవర్ తగిలించుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు..మళ్లీ పాస్ అయ్యే చాన్స్ ఉంటుంది హైదరాబాద్‌లో రెండేళ్ల కూతురితో తల్లి ఆత్మహత్య హైదరాబాద్‌లో కుటుంబ కలహాలతో.. హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది కీర్తిక అగర్వాల్. తనతో పాటు రెండేళ్ల చిన్నారి ప్రాణాన్ని కూడా తీసుకెళ్లిపోయింది. ఫ్యామిలీలో గొడవలున్నంత మాత్రాన, భర్తతో మనస్పర్థలు వచ్చినంత మాత్రాన.. చావే పరిష్కారమా? అంతగా ఇబ్బంది ఉంటే.. పెద్దవాళ్లను కూర్చోబెట్టి మాట్లాడటమో, కౌన్సిలింగ్ తీసుకోవడమో చేయాలి గానీ.. ఇలా ప్రాణాలు తీసుకోవడమేంటి? చిన్న చిన్న సమస్యలకే ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఎందుకొస్తోంది? అనేదే.. ఎవ్వరికీ అంతుబట్టడం లేదు. తిరుపతిలో ఇంజనీరింగ్ చదువుతున్న 20 ఏళ్ల చందు అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తూర్పుగోదావరి జిల్లాలో.. తొర్రేడు తిరుమల కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఎల్ల సత్యదేవకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్‌లో తండ్రి దించి వెళ్లిన కొన్ని గంటల్లోనే.. సూసైడ్ చేసుకున్నాడు. హాస్టల్‌లో ఉండనని, ఇంటి దగ్గరే ఉండి చదువుకుంటానని మారాం చేశాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో.. ఆత్మహత్యే శరణ్యం అనుకున్నాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోతే.. వారిని ఒప్పించే ప్రయత్నం చేయాలి. కూర్చోబెట్టి నచ్చజెప్పాలి. ఒకసారి కాకపోయినా.. మరోసారి వింటారు. కానీ.. హాస్టల్లోనే ఉండమన్నారనే బాధతో ప్రాణాలు తీసుకోవడమేంటి? చిత్తూరు జిల్లా సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ సూసైడ్ చిత్తూరు జిల్లాలో సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడో అంతస్తు నుంచి దూకి చనిపోయాడు. కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిలిస్తున్నారు. ప్రతి ప్రశ్నకు సమాధానం ఉన్నట్లే.. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. ప్రతి చీకటి వెనుక.. ఓ వెలుగు రేఖ దాగి ఉంటుంది. సమస్య ఎలాంటిదైనా.. పరిష్కారం ఓపిగ్గా ఆలోచించి వెతుక్కోవాల్సింది మనమే. సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొని.. జీవితాన్ని గెలవాల్సిందే! కానీ.. దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న ఆత్మహత్యల పరంపర చూస్తుంటే.. సమాజం ఎటు వైపు పోతుందోనన్న భయం కలుగుతోంది. ప్రతి ఒక్కరూ.. చావే పరిష్కారమనే మూర్ఖపు ఆలోచనల నుంచి బయటకు రాకపోవడమే.. గుండెల్ని పిండేస్తోంది. ఇప్పటికే ఉన్న ఆత్మహత్యల ఆందోళనల్ని మరింత పెంచుతోంది. మరి.. దీనికేంటి పరిష్కారం? చాలా మందిలో సన్నగిల్లుతున్న ఆత్మవిశ్వాసం కారణాలు ఏవైనా కావొచ్చు.. సమస్య ఎలాంటిదైనా ఉండొచ్చు.. కానీ.. తీరిగ్గా ఆలోచిస్తే ప్రతి ప్రాబ్లమ్‌కి.. కచ్చితంగా సొల్యూషన్ దొరుకుతుంది. కానీ.. ఏదైనా సమస్య వస్తే.. దాన్ని తట్టుకునేంత ఆత్మవిశ్వాసం చాలా మందిలో సన్నగిల్లుతోంది. వరుస ఆత్మహత్యల్ని చూశాక.. అర్థమవుతున్నది ఇదే. మార్కులు తక్కువొచ్చాయని, ఎగ్జామ్‌లో ఫెయిలయ్యామని, ప్రేమలో విఫలమయ్యామని, ఆర్థికంగా నష్టపోయామని, సోషల్ మీడియాలో ట్రోల్స్, కుటుంబ కలహాలు, వేధింపులు.. ఇలా చెప్పుకుంటూ పోతే.. అనేక కారణాలున్నాయ్. జీవితంలో భాగంగా ఎదురయ్యే చిన్న ఫెయిల్యూర్‌కి కూడా.. జీవితమే అంతమైపోయినట్లు భావిస్తున్నారు. ప్రతి సమస్యకు.. ఇన్‌స్టంట్ రిలీఫ్ కావాలి. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా.. వెంటనే పరిష్కారం దొరికేయాలనుకుంటారు. సొల్యూషన్ కాస్త లేటైనా.. లైఫ్ ఎండింగ్ డెసిషన్ తీసేసుకుంటున్నారు. ఇతరుల జీవితాలతో పోల్చుకుంటూ.. తాము ఎందుకూ పనికిరామని నిరాశ చెందుతున్నారు. మిగతా వాళ్లలా.. తమ లైఫ్ ఎందుకు లేదని బాధపడుతుంటారే తప్ప.. వారి స్థాయికి ఎదగాలని అనుకోవడం లేదు. ఈ సోషల్ కంపారిజన్స్ కూడా.. సూసైడ్స్‌కి ఓ రీజన్‌గా కనిపిస్తోంది. చాలా మంది తమ సమస్యలకు పరిష్కారంపై దృష్టి పెట్టకుండా.. ఇతరులతో పంచుకోకుండా.. వాళ్లకు వాళ్లే కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎంతోమందిపై.. వారు పెరిగిన కుటుంబ, సామాజిక వాతావరణం కూడా ప్రభావం చూపుతోంది. పిల్లల మార్కుల కోసం, ర్యాంకుల కోసం పేరెంట్స్ చేసే ప్రెజర్‌ని తట్టుకోలేని వాళ్లు చాలా మంది ఉంటున్నారు. వారు.. తమ తల్లిదండ్రుల ఆశల్ని అందుకోలేకపోయినప్పుడు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇక.. కుటుంబంలో ఉండే వాతావరణం కూడా వారి జీవితాలపై ప్రభావం చూపుతోంది. తమ సమస్యలు పంచుకునే వాతావరణం లేకపోవడం, ఒంటరితనం పెరగడం లాంటివి.. తనువు చాలించాలనే నిర్ణయాలకు దారి చూపుతున్నాయ్. ఆత్మహత్య.. ఎప్పటికీ సమస్యకు పరిష్కారం కాదు. పైగా.. అది ఎవరూ పరిష్కరించలేని మరో సమస్యని సృష్టిస్తుంది. తమనే నమ్ముకున్న వారి జీవితాలను ప్రశ్నార్థకం చేస్తుంది. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి బాధ అక్కడితో అంతమవుతుంది. కానీ.. ఆ బాధ మొత్తం కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, శ్రేయోభిలాషులకు వారసత్వంగా మిగులుతుంది. ఇది.. మిగతా వారి జీవితాలపై ప్రభావం చూపుతుంది. జీవితమనేది.. ఆ భగవంతుడు ఇచ్చిన బహుమతి. జీవితమనేది.. లైఫ్ జర్నీలో ఎదురయ్యే సంఘటనలతో అనుభవాలని నేర్చుకునేందుకు, అప్పుడప్పుడు వచ్చే సమస్యలను అధిగమించేందుకు.. ఓ చక్కని అవకాశం. ప్రతి సమస్య ఓ పాఠాన్ని నేర్పుతుంది. చచ్చేంత ధైర్యం.. బతకడానికి ఎందుకు లేదనే ప్రశ్న కూడా ఇప్పుడు ఉత్పన్నమవుతోంది. ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తిలో అపారమైన ధైర్యం, కఠినమైన నిర్ణయం తీసుకునే శక్తి ఉంటుంది. ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తిలో అపారమైన ధైర్యం, కఠినమైన నిర్ణయం తీసుకునే శక్తి ఉంటుంది. అదే ధైర్యాన్ని.. జీవితంలో ఎదురయ్యే సవాళ్లని ఎదుర్కొనేందుకు, పోరాడేందుకు ఉపయోగిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోతాయ్. జీవితంలో ఎదురయ్యే కష్టాలకు ముగింపు ఆత్మహత్య కాదు.. సమస్యలున్నోళ్లు ఎవరైనా ఆలోచించాల్సింది.. అత్మహత్యలు ఎలా చేసుకోవాలని కాదు. సమస్య నుంచి పారిపోవడం కాదు.. పోరాడటం నేర్చుకోవాలి. ఓటమే.. అంతం అనుకోవద్దు. అదొక పాఠంగా భావించాలి.

# రాళ్లవాగులో వజ్రాల వేట



కర్నూలు, నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

వర్షాకాలం ప్రారంభం అయితే చాలు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాల్లో వజ్రాల వేట మొదలవుతుంది. తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఎక్కడెక్కడి నుంచో జనాలు తరలి వస్తుంటారు. రోజుల తరబడి పొలాల్లో కూర్చుని వజ్రాల కోసం గాలిస్తుంటారు. ప్రతి సంవత్సరం కొందరికైనా వజ్రాలు దక్కుతాయి. దక్కని వారు.. వచ్చే సంవత్సరం చూసుకుందాం అని వెళ్లిపోతారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో ప్రాంతం చేరింది. అక్కడ వజ్రాలు దొరుకుతున్నాయంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతుండటంతో.. జనాలు తండోపతండాలుగా అక్కడకు తరలి వస్తున్నారు. మరి నిజంగానే అక్కడ వజ్రాలు దొరుకుతున్నాయా అంటే..ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల అడవిలో పారే రాళ్లవాగు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఇక్కడ వజ్రాలు దొరుకుతున్నాయంటూ ప్రచారం సాగుతుండటంతో.. రాళ్ల వాగు కాస్త వజ్రాల వాగుగా మారింది. మరి నిజంగానే ఇక్కడ వజ్రాలు దొరుకుతున్నాయా అంటే.. ఇప్పటి వరకు డైమండ్స్ దొరికిన వాళ్లు ఒక్కరు కూడా లేదు. కానీ సోషల్ మీడియాలో ప్రచారం చూసి స్థానిక ప్రాంత ప్రజలు, పేదలు, కూలీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడం కోసం రాళ్ల వాగు వద్దకు తరలి వస్తున్నారు. ఈ వాగులో వజ్రాల కోసం వేట కొనసాగుతుండటంతో రాళ్లవాగు ఇప్పుడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ రాళ్ల వాగు.. మహానంది మండలంలోని గాజులపల్లె గ్రామ సమీపంలో.. నల్లమల అడవిలో ఉన్న పురాతన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం కింది భాగంలో ప్రవహిస్తూ ఉంటుంది. అయితే ఈస్వామి వారి కళ్యాణం సందర్భంగా వజ్రాలతో తలంబ్రాలు పోశారని స్థానికులు నమ్ముతారు. ఈ వజ్రాలు కాస్త.. ఆలయం క్రింద భాగంలో ప్రవహించే రాళ్లవాగులో కలిశాని.. అందుకే ఇక్కడ వజ్రాలు దొరికేందుకు అవకాశం ఉంది అంటున్నారు. అలానే ఈ రాళ్ల వాగును వజ్రాల వాగుగా పిలుస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈ వాగులో వజ్రాలు లభ్యమవుతున్నాయనే ప్రచారం ఉండేది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వజ్రాల మీద ఆశతో.. వాగు వెతుకుతున్నారు. అయితే ఎవరికి ఏ వజ్రం దొరకలేదని చెబుతున్నారు. కేవలం సుద్దరాళ్లు మాత్రమే లభిస్తున్నాయని తెలుస్తోంది. ఈ ప్రాంతం.. గాజులపల్లె రైల్వే స్టేషన్‌కు సమీపంలోనే ఉండటం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉండటంతో మహిళలు కూడా ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. ఎవరికైనా వజ్రం దొరికిందని అనుమానం కలిగితే.. దానిని పరీక్షించేందుకు అక్కడే కొందరు వ్యక్తులు పరికరాలతో పరీక్షిస్తున్నారు. అయితే గతంలో ఒక్క రాయి పరీక్షించేందుకు 10 రూపాయలు తీసుకుంటే, ఇప్పుడు రూ.30 తీసుకుంటున్నారు. ఇక్కడ వజ్రాలు అయితే దొరకడం లేదు కానీ.. హోటళ్లు, కూల్ డ్రింక్ షాపులు, ఐస్ క్రీములు అమ్మే బండ్లకు మాత్రం మంచి వ్యాపారం జరుగుతోంది.

# పర్యాటకం కోసం హోమ్ స్టే...

తిరుపతి,నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):



పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హోమ్‌స్టే విధానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీని ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు.. పర్యాటకులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వసతి కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా ఔత్సాహికులు హోమ్ స్టేలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ మేరకు హోమ్ స్టే ఏర్పాటు చేయడానికి సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా అనేక చర్యలు తీసుకుంటోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లో.. సామాన్య పర్యాటకులకూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన వసతి కల్పించేందుకు ప్రభుత్వం హోమ్‌స్టే విధానం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. స్థానికులతో కలిసి సొంతింట్లో ఉన్న అనుభూతిని పర్యాటకులకు కల్పించడమే లక్ష్యంగా ఈ విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని ద్వారా గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విధానం అమలులో భాగంగా ఔత్సాహికులు హోమ్ స్టేలను ఏర్పాటు చేసుకునేలా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసింది. పర్యాటక శాఖ మార్గదర్శకాల ప్రకారం.. హోమ్ స్టే ఏర్పాటు చేయాలనుకునే ఇంటి యజమానులు.. అక్కడే నివాసం ఉండాలి. వారు.. తమ ఇంట్లో కనీసం ఒకటి.. గరిష్ఠంగా ఆరు గదులను పర్యాటకులకు అద్దెకు ఇవ్వొచ్చు. ఇంట్లో కనీస వసతులు.. సురక్షిత మంచినీరు వంటివి అందుబాటులో ఉండాలి. శుభ్రమైన పరిసరాలు, టాయిలెట్లు ఉండాలి. ఏసీ, టీవీ, ఇంటర్నెట్, ఫర్నిచర్ వంటి వసతులతో పాటు పార్కింగ్ ప్రదేశం కూడా ఉండాలి. హోమ్ స్టేలకు వచ్చిన పర్యాటకుల వివరాలు (గుర్తింపు కార్డులు, పాస్‌పోర్ట్) నమోదు చేసుకోవాలి. అవసమైనప్పుడు అధికారులు తనిఖీలు చేసేందుకు వీలుగా అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించారు. ఈ నేపథ్యంలో హోమ్‌స్టే విధానానికి త్వరితగతిన అనుమతులు లభించే అవకాశం ఉంది. ఆసక్తిగల ఇంటి ఓనర్లు దరఖాస్తు చేసుకునే సమయంలో.. గుర్తింపు, చిరునామా, ఆస్తి యాజమాన్య పత్రాలు, స్థానిక సంస్థల నుంచి నిరభ్యంతర పత్రం తదితర వివరాలు సమర్పించాలి. ఈ మేరకు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. స్థానిక పర్యాటక శాఖ అధికారులను కలిసి వివరాలు తెలుసుకోవచ్చు. దరఖాస్తు తర్వాత ఆంధ్రప్రదేశ్ టూరిజం అధికారులు ఇంటిని తనిఖీ చేస్తారు. అనంతరం అప్రూవల్ సర్టిఫికెట్ ఇస్తారు. ఆ తర్వాత లైసెన్స్ మంజూరు చేస్తారు. లైసెన్స్ వచ్చిన తర్వాత.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం వసతులు కల్పించాలి. కాగా, అరకు, విశాఖపట్నం, కోనసీమ, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో.. గిరిజన, వారసత్వ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో హోం స్టేలను అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో ఇప్పటికే దాదాపు 30 పర్యాటక కేంద్రాలను అధికారులు గుర్తించారు. అందులో అమరావతి ఆలయం, బౌద్ధ స్తూపం, కొండవీడు, కోటప్పకొండ, నాగార్జునకొండ, సత్రశాల, దైద, ఎత్తిపోతల తదితర ప్రాంతాలు ఇన్నాయి.=

=====================

# ఆగని రజనీ రచ్చ



గుంటూరు, నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

పల్నాడు జిల్లాలో మాజీ మంత్రి విడదల రజిని పోలీసులపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత రెండు రోజులుగా తనను, తన అనుచరులను లక్ష్యంగా చేసుకొని పోలీసులు వ్యవహరిస్తున్న తీరు పూర్తిగా అన్యాయమని, ఇది చట్ట వ్యవస్థను అవమానించే పని అని ఆమె మండిపడ్డారు. చట్టానికి, వ్యవస్థలకు తమకు సంపూర్ణ గౌరవం ఉన్నప్పటికీ, పోలీసుల ప్రవర్తన మాత్రం రౌడీలు, గూండాలను తలపిస్తోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడుతున్న రజిని:. వైసీపీ మాజీ మంత్రి విడదల రజిని తనపై, తన అనుచరులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడుతున్నారు. తనపై నమోదవుతున్న కేసుల నేపథ్యాన్ని వివరించిన రజిని, శ్రీ గణేష్ చౌదరి పేరుతో జరుగుతున్న ఫిర్యాదులు పూర్తిగా రాజకీయ నాటకమని అన్నారు. గణేష్ చౌదరి గత ఎన్నికల్లో దర్శి టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ప్రచారంలో పాల్గొన్నాడని, ఈ విషయాన్ని ఫిర్యాదు చేసినవాళ్లే ముందే పేర్కొన్నారని ఆమె చెప్పారు. ఈ ఏడాది మార్చిలో దర్శిలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో కూడా గణేష్ టీడీపీ అనుచరుడని స్పష్టమైన పత్రాలలో ఉందని రజిని వెల్లడించారు. పదేళ్ల క్రితం తీసుకున్నట్లు చెప్పిన 35 లక్షల రూపాయల వ్యవహారాన్ని ఇప్పుడు తనపై తప్పుడు కేసులుగా మలచడానికి ప్రయత్నించడం ఎంతో విచారకరమని ఆమె అన్నారు. మాబు సుభాని టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడని ఆరోపణ:. మాబు సుభాని అనే వ్యక్తి పల్నాడు ఎస్పీ కార్యాలయంలో తమపై ఫిర్యాదు చేసిన విషయాన్ని ప్రస్తావించిన ఆమె, అతను టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడని, అంతకుముందు చిలకలూరిపేట టౌన్ స్టేషన్‌లో గణేష్‌తో రాజీకి వచ్చిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ అంశాలను పట్టించుకోకుండా, ఒకవైపు ఫిర్యాదు పెట్టేలా, మరోవైపు కేసులు నమోదు చేసేలా పోలీసులు పనిచేస్తున్నారని రాజినిలు విమర్శించారు. పల్నాడు జిల్లాలో ఒక ఉన్నతాధికారి ఓ ప్రత్యేక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితులు వస్తున్నాయంటూ ఆమె ఆరోపించారు. తప్పుడు ఫిర్యాదులు చేస్తే వెంటనే కేసులు పెట్టడం, యూనిఫామ్ వేసుకున్న పోలీసులు మూడు పార్టీలకీ అనుకూలంగా పని చేయడం వంటి వ్యవహారాలు చట్టపరమైన విధ్వంసానికే నిదర్శనమని ఆమె అన్నారు. ఎస్పీకి ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి రజిని:. తన వ్యక్తిత్వ హననానికి డీఎస్పీ నేరుగా పాల్పడ్డారని, దీనిపై పరువు నష్టం దావా వేయడమే కాక హ్యూమన్ రైట్స్ కమిషన్, మహిళా కమిషన్‌లను ఆశ్రయిస్తానని రజిని ప్రకటించారు. రాజకీయంగా ఒక మహిళ ఎదగడం కొందరికి నచ్చడం లేదని, అందుకే తమ మీద తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు.. టీడీపీ వాళ్లే ఫిర్యాదు చేసి, వాళ్ల ప్రభుత్వమే కేసులు పెట్టేలా చూస్తోందని ఆమె మండిపడ్డారు. తనపై ఎస్సీ, ఎస్టీతో సహా ఏడు కేసులు నమోదు చేసినా, వాటిని ఎదుర్కొనే ధైర్యం, న్యాయం తనవైపునే ఉందని ఆమె తెలిపారు. ఈ ఘటనలపై నిష్పక్షపాత విచారణ జరగాలని ఇప్పటికే ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు రజిని వెల్లడించారు.

# సీఐఐ సదస్సుకు 40 కోట్లు




విశాఖపట్టణం, నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

ఏపీ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే విశాఖలో ఈ నెల 13, 14 జరగనున్న ప్రపంచ స్థాయి భాగస్వామ్య సదస్సుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. సుమారు 40 దేశాల నుంచి 3 వేల మంది ప్రతినిధులు రానుండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సదస్సులో సుమారు 10 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకునేందుకు 40 కోట్ల రూపాయలతో విశాఖను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆంధ్ర యూనివర్సిటీలో ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు విశాఖ సిద్ధమవుతోంది. ప్రపంచ స్థాయి వసతులతో అతిథులకు ఆతిథ్యం ఇచ్చేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఏర్పాట్లలో ఎక్కడా రాజీ లేకుండా ఆంధ్ర యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక సెక్యూరిటీతో పాటు సదస్సుకి హాజరయ్యే పెట్టుబడిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నారు. మరింత సమాచారం మా ప్రతినిధి శివశంకర్ అందిస్తారు. పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకునేలా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు మరోవైపు విశాఖలోని ప్రధాన కూడళ్లను ప్రభుత్వం ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతోంది. కూడళ్లలో ఏర్పాటు చేస్తున్న అద్భుత కళాఖండాలు, వాటర్ ఫౌంటెన్లు అబ్బుర పరుస్తున్నాయి. పెట్టుబడులకు ముఖద్వారం విశాఖనే అనేలా ముస్తాబు చేస్తున్నారు. రోడ్ డివైడర్లకు సైతం రంగులు అద్దుతున్నారు. మరింత సమాచారం మా ప్రతినిధి శివశంకర్ అందిస్తారు. వాల్‌పెయింటింగ్స్‌తో పాటు డివైడర్లకు కొత్త రంగులు ఇదిలా ఉంటే అవసరమైన చోట కొత్త రోడ్లను కూడా ప్రభుత్వం నిర్మిస్తోంది. ఎక్కడికక్కడ వేస్తున్న వాల్ పెయింటింగ్స్ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. రోడ్లకు ఇరువైపులా ఉండే గోడలన్నీ కొత్త రంగలతో మెరిసిపోతున్నాయి. అలాగే పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునేలా చేస్తున్న ఏర్పాట్లలో పచ్చదనానికి కూడా అధికారులు పెద్ద పీట వేస్తున్నారు. అందం, ఆహ్లాదం కలగలిపి విశాఖను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు

# టచ్ స్క్రీన్ ద్వారా దర్శనం టిక్కెట్లు

కర్నూలు,నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):


ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ దేవాలయాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆలయాల్లో వంద కియోస్క్ లు ఏర్పాటు చేయనున్నారు. టచ్ స్క్రీన్ ఉండే వీటి ద్వారా భక్తులు దర్శనం, వివిధ సేవల టికెట్లు నేరుగా పొందొచ్చు. వీటిలో ఎన్ని టికెట్లు కావాలో నమోదు చేసి.. డిజిటల్ చెల్లింపు చేస్తే వెంటనే టికెట్లు జారీ చేస్తుంది. కరూర్ వైశ్యా బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఈ కియోస్క్ మెషిన్లను ఉచితంగా అందిస్తోంది. ఈ కొత్త కియోస్క్‌లు భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటాయి. ఇకపై క్యూలైన్లో నిలబడాల్సిన అవసరం లేకుండా, తమకు కావాల్సిన దర్శనం, సేవల టికెట్లను నేరుగా ఈ స్క్రీన్ కియోస్క్ మెషిన్‌ల ద్వారా కొనుగోలు చేయొచ్చు. ఉద్యోగులు అవసరం లేకుండానే నేరుగా టికెట్లు పొందేలా వీలు కల్పిస్తున్నారు. ఈ విధానం ద్వారా ఆలయాల నిర్వహణపై భారం తగ్గుతుంది. అయితే, వాటి ఇన్ స్టలేషన్, నిర్వహణ బాధ్యతలను కరూర్ వైశ్యా బ్యాంకు చూసుకోనుంది. ఏపీలోని ప్రధాన ఆలయాలైన విజయవాడ కనకదుర్గమ్మ, సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి దేవాలయాల్లో ఎనిమిది చొప్పున వీటిని ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా ముఖ్య ఆలయాలైన అరసవిల్లి, విశాఖ కనకమహాలక్ష్మి, తలుపులమ్మ, వాడపల్లి, పెనుగంచిప్రోలు, మోపిదేవి, పెదకాకాని, పెంచలకోన, తలకోన, ఈరన్నస్వామి, మహానంది, బేతంచెర్ల మద్దిలేటి నరసింహస్వామి, కసాపురం ఆంజనేయస్వామి, కదిరి లక్ష్మీనరసింహస్వామి, బోయకొండ గంగమ్మ ఆలయాల్లో మూడేసి కియోస్క్ మెషిన్లు ఏర్పాటు చేయనున్నారు. తిరుమలలో ఇప్పటికే కియోస్క్ మెషిన్లను ఉపయోగిస్తున్నారు. అన్నప్రసాద వితరణ కేంద్రంలో భక్తులు విరాళాలు అందజేసేందుకు ఈ కియోస్క్ మెషిన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. లడ్డూ విక్రయాల కోసం కూడా కియోస్క్ మెషిన్లను ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా.. రాష్ట్రంలోని ప్రధాన, ముఖ్యమైన ఆలయాల్లో వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

# ఇసుక లేక ఆగిన నిర్మాణాలు

నిజామాబాద్, నవంబర్ 10, ఇందిరమ్మ ఇళ్లకు జిల్లాలోఇసుక కటకట మొదలైంది. దీంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోతున్నాయి. ఇదే అదనుగా భావించిన కొందరు ఇసుక మాఫియా అదిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్నారు. మంజీరా నీరు ప్రవహిస్తుండడంతో ఇసుక తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి ఇసుకను తరలిస్తున్న మంటూ కొందరు అక్రమంగా పర్మిషన్లు తీసుకుని ఇసుకను తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పూర్తి చేయకుండా మధ్యలోనే నిలిపివేస్తున్నారు. మరోపక్క ఉన్నతాధికారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చురుకుగా చేపట్టాలని కోరుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక లభించక ఇండ్లను మధ్యలోనే నిలుపుదల చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని నస్రుల్లాబాదులో పలువురు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పనులు నిలుపుదల చేశారు. ఇసుక అధిక ధరలకు విక్రయిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారులకు తెలిపిన పట్టించుకోవడంలేదని లబ్ధిదారులు తెలిపారు. ఇసుక అక్రమంగా తరలించి ట్రిప్పుకు 5000 నుంచి 6000 రూపాయలకు విక్రయిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. స్థానికా అధికారులతో కుమ్మక్కై ఇసుక దందా నిర్వహించే నిర్వాహకులు అధిక ధరలకు విక్రయిస్తుండడంతో ఇందిరమ్మ లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం మధ్యలోనే నిలుపుదల చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమంగా అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకొని లబ్ధిదారులకు తక్కువ ధరకు తీసుకొని ఇప్పించాలని కోరుతున్నారు.

## భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్

# నేడు ఆయన జయంతి..జాతీయ విద్యా దినోత్సవం



( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్. ఆయన అసలుపేరు 'మొహియుద్దీన్ అహ్మద్', 'అబుల్ కలాం' అనేది బిరుదు, 'ఆజాద్' కలంపేరు. ఆలియా బేగమ్, ఖైరుద్దీన్ అహమ్మద్ లకు 1888 నవంబరు 11 న మక్కాలో జన్మించాడు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 10 సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాడు. భారత ప్రభుత్వంలో 11 సంవత్సరాలపాటు విద్యాశాఖామంత్రిగా పనిచేసాడు. ఆయన భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా పని చేశారు. నవంబర్ 11న ఆయన జన్మదినం సందర్భంగా మన దేశంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1947 ఆగస్టు 15 నుండి అంటే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 1958 ఫిబ్రవరి 2 వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రిగా సేవలు అందించారు. ఈయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఈయనకు భారతరత్న అవార్డు సైతం ఇచ్చింది.

అంతేకాదు ఈయన పేరిట పలు విద్యాసంస్థలు కూడా నెలకొల్పబడ్డాయి. అబుల్ కలాం మంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీలోని ప్రసిద్ధ జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం సహా భారతదేశం అంతటా వివిధ కళాశాలలు మరియు విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. ఈయన సేవలకు గుర్తుగా 2008లో భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్ణయించింది. మౌలానా అబుల్ కలాం ఆజాద్ మక్కానగరంలో 1888 నవంబరు 11 న జన్మించాడు. అతని వంశస్థులు బాబర్ రోజుల్లో హేరాత్ (ఆఫ్ఘనిస్తాన్లో ఒక నగరం) కు చెందిన వారు. ఆజాద్ ముస్లిం పండితులు, లేదా మౌలానాల వంశం నుండి వచ్చాడు. అతని తల్లి ఒక అరబ్, షేక్ మహ్మద్ జహీర్ వత్రి, అతని తండ్రి మౌలానా ఖైరుద్దీన్ ఆఫ్ఘన్ మూలాల ఉన్న ఒక బెంగాలీ ముస్లిం. ఖైరుద్దీన్ సిపాయి తిరుగుబాటు సమయంలో భారతదేశం నుండి మక్కా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. 1890 లో అయన తన కుటుంబంతో కలకత్తా వెళ్లాడు. ఆజాద్ సంప్రదాయ ఇస్లామిక్ విద్య అభ్యసించాడు. అతని విద్య ఇంట్లోనే సాగింది. మొదట తండ్రి, పిదప ఉపాధ్యాయులు ఇంట్లోనే బోధించారు. ఆజాద్ మొదట అరబిక్, పెర్షియన్ నేర్చుకున్నాడు. తరువాత తత్వశాస్త్రం, రేఖాగణితం, గణితం, బీజగణితం అభ్యసించాడు. స్వీయ అధ్యయనం ద్వారా ఇంగ్లీష్, ప్రపంచ చరిత్ర, రాజకీయాలు నేర్చుకున్నాడు. ఆజాద్ మౌలానా అగుటకు కావలసిన మత శిక్షణ పొందాడు. అతను దివ్య ఖురాన్ పై భాష్యం వ్రాసాడు.. అతను జమాలుద్దిన్ ఆఫ్ఘానీ పాన్-ఇస్లామిక్ సిద్ధాంతాలలో, అలిగర్ సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ఆలోచనలో ఆసక్తి చూపేవాడు. పాన్-ఇస్లామిక్ భావాలతో అతను ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, ఈజిప్ట్, సిరియా, టర్కీ సందర్శించాడు. ఇరాక్ లో అతను ఇరాన్ రాజ్యాంగ ప్రభుత్వ స్థాపనకు పోరాటం సల్పుతున్న నిర్వాసిత విప్లవ కారులను కలుసుకున్నాడు. ఈజిప్ట్ లో అతను షేక్ ముహమ్మద్ అబ్దుహ్, సయీద్ పాషా వంటి అరబ్ ప్రపంచంలోని ఇతర విప్లవకారులను కలుసుకున్నారు. అతను కాన్స్టాంటినోపుల్లో యంగ్ టర్క్స్ భావాలతో పరిచయం పెంచుకున్నాడు. ఈ పరిచయాలు అన్ని అతనిని ఒక జాతీయవాద విప్లవవాదిగా రూపాంతరం చెందించాయి. విదేశాల నుంచి తిరిగొచ్చిన అనంతరం ఆజాద్, బెంగాల్ కు చెందిన అరవింద ఘోష్, శ్రీ శ్యాం సుందర్ చక్రవర్తి వంటి ప్రముఖ విప్లవకారులను కలుసుకున్నారు, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమాన్ని చేపట్టారు. విప్లవాత్మక చర్యలు బెంగాల్, బీహార్ లకు పరిమితం అగుట ఆజాద్ కు తెలిసి రెండు సంవత్సరాల లోపల, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉత్తర భారతదేశం, బాంబే లాంటి ప్రాంతాలలో రహస్య విప్లవ కేంద్రాలు ఏర్పాటుచేసారు. ఆసమయంలో విప్లవ వాదులు ముస్లింల విప్లవ వ్యతిరేకులుగా భావించసాగారు ఎందుకంటే బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి వ్యతిరేకంగా ముస్లిం కమ్యూనిటీని ఉపయోగిస్తుందని భావించాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ తన సహచరులను ముస్లింల పట్ల వారి పగను పోగొట్టటానికి ప్రయత్నించాడు. 1912 లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూలో ' అల్ హిలాల్' వార పత్రిక ముస్లింల మధ్య విప్లవాత్మక భావాలను పెంచడానికి ప్రారంభించారు. అల్ హిలాల్ మోర్లే-మింటో సంస్కరణల ఫలితంగా రెండు వర్గాల మధ్య చెలరేగిన సంఘర్షణల తర్వాత హిందూ మతం-ముస్లిం వర్గాల మధ్య ఐక్యత కుదుర్చటంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషించింది. 'అల్ హిలాల్' అతివాద భావనల ఒక విప్లవాత్మక ధ్వనిగా మారింది. ప్రభుత్వం వేర్పాటువాద భావనల ప్రచారకునిగా "అల్- హిలాల్"ను భావిస్తింది. ప్రభుత్వం దానిని 1914 లో నిషేధించింది. ఆజాద్ భారతీయ జాతీయ వాదం, హిందూ -ముస్లిం ఐక్యత ఆధారంగా విప్లవాత్మక ఆలోచనలతో మరో పత్రికను "అల్ బలఘ్" ప్రారంభించారు. 1916 లో ప్రభుత్వం ఈ పత్రికను కూడా నిషేధించారు, రాంచిలో ఆజాద్ ను నిర్భందించారు. ఆతరువాత మొదటి ప్రపంచ యుద్ధం 1920 తర్వాత విడుదల చేసారు. విడుదల తరువాత ఆజాద్ ఖిలాఫత్ ఉద్యమం ద్వారా ముస్లిం కమ్యూనిటీలో బ్రిటిష్ వ్యతిరేక భావాలు పెంచారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ గాంధీజీ ప్రారంభించిన "సహాయ నిరాకరణ" ఉద్యమం ను సమర్ధించి 1920 లో భారత జాతీయ కాంగ్రెస్ లో చేరాడు. ఇతడు ఢిల్లీ కాంగ్రెస్ ప్రత్యేక సెషన్ అధ్యక్షుడు గా (1923) ఎన్నికయ్యాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1940 (రాంగడ్) లో కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు , 1946 వరకు ఆ పదవిలో ఉన్నాడు. అతను విభజనకు వ్యతిరేకి. విభజన అతని కలలను నాశనం చేసింది. హిందువులు , ముస్లింలు కలసి సహజీవనం చేస్తున్న ఒక ఏకీకృత దేశం బద్దలు అగుట అతని కలను నాశనం చేసి అతనిని విపరీతంగా బాధించింది. మౌలానా ఆజాద్ గాంధీజీ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 1930 లో అరెస్టు అయ్యాడు. అతనిని ఒక సంవత్సరంన్నర పాటు మీరట్ జైల్లో ఉంచారు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 10 సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాడు. 1958 ఫిబ్రవరి 22 న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ మరణించాడు. గాంధీజీ ఇతడిని భారత ప్లాటో అని, గాంధీ , నెహ్రూ ఇతడిని మౌలానా, మీర్-ఎ-కారవాన్ అని పిలిచేవాడు. భారత ప్రభుత్వం ఆయన మరణానంతరం 1992లో అతనికి భారతరత్న ఇచ్చి గౌరవించింది.

# జూబ్లీ ఎన్నికలకు అంతా సిద్ధం

### ఉల్లంఘనలపై ఉక్కుపాదం.. రూ.3.60 కోట్లు స్వాధీనం

హైదరాబాద్, నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. నియోజకవర్గంలోని సగానికి పైగా పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి, అసాధారణ భద్రతా ఏర్పా ట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి సమగ్రంగా వివరించారు. జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 2,08,561 మంది, మహిళలు 1,92,779 మంది, ఇతరులు 25 మంది ఉన్నారని కర్ణన్ తెలిపారు. వీరిలో 1,908 మంది దివ్యాంగ ఓటర్లు, 85 ఏళ్లు పైబడిన వారు 2,134 మంది, 18-19 ఏళ్ల మధ్య వయసున్న యువ ఓటర్లు 6,859 మంది ఉన్నారని వివరించారు. ఓటర్ల సౌకర్యార్థం 139 భవనాల్లో మొత్తం 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా, వీటిలో 226 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక క్రిటికల్ కేంద్రాలుగా గుర్తించి, అక్కడ కేంద్ర బలగాలతో సహా అదనపు భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పోలింగ్ ప్రక్రియను డ్రోన్ల ద్వారా కూడా పర్యవేక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ ఉపఎన్నిక బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు ఉండటంతో, సాంకేతికంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక కంట్రోల్ యూనిట్, ఒక వీవీప్యాట్తో పాటు నాలుగు బ్యాలెట్ యూనిట్లను ఉపయోగిస్తున్నట్లు డీఈఓ తెలిపారు. ఇది ఓటర్లు గమనించాల్సిన కీలకమైన అంశమన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 561 కంట్రోల్ యూనిట్లు, 2,394 బ్యాలెట్ యూనిట్లు, 595 వీవీప్యాట్లను సిద్ధంగా ఉం చామన్నారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా స్పందించేందుకు 40 మం ది ఈసీఐఎల్ ఇంజనీర్లను అందుబాటులో ఉంచా మన్నారు. మొత్తం 2,060 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారని చెప్పారు. ప్రశాంత పోలింగ్ కోసం నగర పోలీసులతో పాటు, ఐటీ, ఎక్సైజ్, నార్కోటిక్స్ వంటి వివిధ విభాగాలతో కూడిన జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ నిరంతరం పనిచేస్తోందన్నారు. అన్ని 407 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పాటు, ఎన్నికల సంఘం నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా పర్యవేక్షించేందుకు వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటర్ల సహాయార్థం ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద హెల్ప్ డెస్క్, క్యూలైన్లను పర్యవేక్షించేందుకు ఎన్సీసీ వాలంటీర్లు, పోలింగ్ కేంద్రం లోకి ప్రవేశించే ముందు ఓటర్లు తమ మొబై ల్ ఫోన్లను భద్రపరుచుకునేందుకు మొబైల్ డిపాజిట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు, వీల్ చైర్లు, రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

# బీహార్ లో పోటెత్తిన మహిళలు

హైదరాబాద్,నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

బిహార్ తొలి విడత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు అపూర్వ ఉత్సాహం కనబరిచారు. మొత్తం 18 జిల్లాల్లోని 121 స్థానాలకు జరిగిన పోలింగ్లో 64.69 శాతం ఓటింగ్ నమోదై రాష్ట్ర రాజకీయ చరిత్రలో కొత్త రికార్డు నెలకొంది. పోలింగ్ పూర్తిగా శాంతియుత వాతావరణంలో జరగడం గమనార్హం. గతంలో జరిగిన అల్లర్లు, బూత్ క్యాప్చరింగ్ సంఘటనలు లేకుండా ఈసారి ఎన్నికలు సాఫీగా జరగడం ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. బిహార్ తొలి విడత ఎన్నికల్లో ముజఫర్నగర్లో అత్యధికంగా 71 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా పాట్నాలో 58 శాంత నమోదైంది. ఈసారి పోలింగ్ బిహార్ జనసామాన్యంలో రాజకీయ చైతన్యం పెరిగిందని సూచిస్తోంది. పట్నా వంటి పట్టణాల్లో కూడా మంచి ప్రతిస్పందన రావడం ఈసారి సామాన్య ప్రజల పాలిట ఎన్నికలు ముఖ్యమయ్యాయని సూచిస్తుందిఎన్నికల ముందు ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై పెద్ద ఎత్తున చర్చ, రచ్చ జరిగింది. ఓట్లు తొలగించారని కాంగ్రెస్ పెద్ద ఆందోళన చేసింది. రాహుల్గాంధీ ఓట్చోరీ పేరిట యాత్ర చేశారు. కానీ వీటి ప్రభావం ఏదీ పోలింగ్పై పడలేదు. పోలింగ్ అనంతరం గణనీయమైన ఫిర్యాదులు లేకపోవటం ప్రజలు ఆ ప్రక్రియను అంగీకరించినట్లుగా అర్థం చేసుకోవచ్చు. ఇక బిహార్లో ఒక సుదీర్ఘ సెంటిమెంట్ ఉంది. పోలింగ్ శాతం 60 దాటితే లాలూ యాదవ్ విజయం సాధించారని, తక్కువైతే నితీశ్కుమార్ విజయం సాధించారని గత ఎన్నికల గణాంకాలు చెబుతున్నాయి. 1990, 1995, 2000 ఎన్నికల్లో 60 శాతం పైగా పోలింగ్ నమోదు కాగా, లాలూ గెలిచారు. 2005, 2010, 2017లో తక్కువ ఓటింగ్తో నితీశ్ విజయినయ్యారు. ఈసారి తిరిగి 64.69 శాతం పోలింగ్ నమోదవడంతో ఫలితాలపై ఉత్కంఠ పెరిగింది. గతంలో భద్రతా లోపాల కారణంగా బిహార్లో 5?6 విడతలుగా ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చేది. ఈసారి రెండు విడతల్లో ఎన్నికలు



నిర్వహిస్తున్నారు. మొదటి విడత ప్రశాంతంగా పూర్తవ్వడం ప్రజల్లోని విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. ఓటర్లకు భయంలేని వాతావరణం కల్పిస్తే ఎన్నికలలో పాల్గొనడం సహజమని ఈసారి బిహార్ నిరూపించింది. 2014 తర్వాత బిహార్ ఎన్నికల్లో మహిళల ఓటింగ్ క్రమంగా పెరుగుతోంది. 2015లో 60.48 శాతం మహిళలు ఓటేసి రికార్డు సృష్టించారు. 2020లో కూడా మహిళా పాల్గొనింపు పురుషుల కన్నా ఎక్కువ. నితీశ్ ప్రభుత్వం మహిళల సంక్షేమ కార్యక్రమాలు, భద్రతా చర్యలు, విద్యా ప్రోత్సాహ పథకాలు అమలు చేయడం ఈ పెరుగుదలకు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ఇది నితీశ్ కూటమికి రాజకీయంగా బలాన్నిస్తుంది. ఈసారి పెద్ద ఎత్తున యువ ఓటర్లు పోలింగ్లో పాల్గొన్నారు. యువకులు ప్రధానమంత్రి మోదీ ఆకర్షణతోనా, లేక తేజశ్వి యాదవ్ లాంటి యంగ్ లీడర్ ప్రతిఛాయతోనా ఓటు వేశారన్నది ఫలితాల్లో తేలుతుంది. ఈ ఎన్నికల్లో బీజేపీ ప్రచారంలో ఒక కొత్త శ్లోగన్ అందుకుంది.. "నమో" స్థానంలో "నిమో" (నితీశ్?మోదీ) నినాదం. ఈ వ్యూహం సీట్ల లెక్కలో ఎలా ఆడుతుందో, రెండో విడత ఓటింగ్ అనంతరం స్పష్టత రానుంది. నవంబర్ 11న రెండో విడత ఓటింగ్, 14న ఫలితాలు ప్రకటించనున్నారు. పెరిగిన ఓటింగ్ శాతం తుది ఫలితాల్లో ఎవరికి లాభించబోతుందో అనేది ఈసారి బిహార్ ఎన్నికలలో ప్రధాన ప్రశ్నగా మారింది.

# సైనిక విన్యాసాలతో వ్యూహాత్మక చర్యలు

న్యూఢిల్లీ నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

భారత దేశం సొంత భద్రత, శత్రువులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకుంటోంది. ఇదే సమయంలో దేశంలోకి చొరబాట్లను అడ్డుకునేందుకు వ్యూహాత్మకంగా చర్యలు చేపడుతోంది. స్వదేశీ ఆయుధాల తయారీకి ప్రాధాన్యం ఇస్తోంది.



ఈ క్రమంలో దేశం తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిశల్లో ఒకేసారి సైనిక విన్యాసాలు చేపడుతోంది. గగనతల సురక్షణ కోసం ప్రభుత్వమే ముందస్తు హెచ్చరికలతో నోటామ్ జారీ చేసింది. సరిహద్దుల్లో పెరుగుతున్న భద్రతా సవాళ్లను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్లు నిర్వహిస్తోందిఅరేబియా సముద్రతీరంలోని సర్క్రీక్(బాణగంగ) ప్రాంతంలో ఆపరేషన్ త్రిశూల్ విజయవంతంగా కొనసాగుతోంది. పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంగా ఉన్న ఈ ప్రాంతం వ్యూహాత్మకంగా అత్యంత ప్రాధాన్యత కలిగినది. సముద్ర మార్గ రక్షణకు నేవీ కీలక పాత్ర పోషిస్తూ రాడార్ నిఘా వ్యవస్థలు, అధునాతన మిసైల్ యూనిట్లు మోహరిస్తోంది. చైనా, బంగ్లాదేశ్, నేపాల్ సరిహద్దులకు సమీపంలోని సిరివిడి కారిడార్ ప్రాంతంలో పూర్వి ప్రచండ ప్రహార్ పేరుతో యుద్ధాభ్యాసం కొనసాగుతోంది. 15 నుంచి 22 కిలోమీటర్ల పొడవున ఈ వ్యూహాత్మక మార్గం ద్వారా శత్రు చొరబాట్లను నిరోధించడమే కాదు, త్రిశక్తి బలగాల సమన్వయం కూడా బలోపేతం అవుతోంది. అసోంలోని నదుల విస్తీర్ణం కారణంగా నేవీకి కీలక బాధ్యత వచ్చింది. రఫేల్స్, బ్రహ్మోస్, ఎస్?400 క్షిపణి వ్యవస్థలను సరిహద్దు ప్రాంతాల్లో మోహరించడం ద్వారా గగనతల రక్షణను మరింత ధ్రుఢపరుస్తున్నారు. మూడు విభిన్న రక్షణ శాఖలు కలిసి పనిచేసే "త్రిశక్తి కోర్" ద్వారా సర్వదిశా భద్రతా వ్యవస్థ బలోపేతమవుతోంది. సమయంలో దేశంలోని ఈశాన్య భారతంలో మూడు సరికొత్త సైనిక కారిడార్లు నిర్మిస్తోంది. అసోం, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కొత్త మిలిటరీ బేస్ల నిర్మాణం మొదలైంది. అసోంలోని దుగ్రి జిల్లా, బాముని గ్రామంలో లాచిట్ బర్ఫుకన్ పేరుతో ఆర్మీ బేస్ నిర్మాణం జరుగుతోంది. అసోం వీరయోధుడి స్ఫూర్తితో రూపొందిన ఈ స్థావరం మిసామారీ బేస్కు అనుబంధంగా సిరివిడి కారిడార్ భద్రతను చూసుకుంటుంది. ఇక రెండోది బిహార్లోని కిషన్గంజ్లో నిర్మిస్తోంది. తూర్పు సరిహద్దులో రక్షణ వలయం ఏర్పరచే కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. మూడోది పశ్చిమబెంగాల్లోని చోప్రా గ్రామంలో జినాబ్ ప్రాంతంలో తెతూలియా కారిడార్ సమీపంలో నిర్మిస్తోంది. ఈ స్థావరం వ్యూహాత్మకంగా అత్యంత ప్రాధాన్యం కలిగినది. దీనిని నిర్మాణం పూర్తయితే పశ్చిమబెంగాల్లోని చాలా ప్రాంతాలకు దూరం తగ్గుతుంది. అసోంలో గతంలో జరిగిన చొరబాట్లు, హింసాత్మక దాడులు ఇప్పుడు గణనీయంగా తగ్గాయి. ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నేతృత్వంలో సరిహద్దు భద్రతపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు సైన్యంతో సమన్వయం పెరగడం ఈ మార్పుకు కారణంగా ఉంది. తాజాగా బహుముఖ చర్యలతో భారతదేశం గగన, భూ, సముద్ర మార్గాల్లో త్రిముఖ సమన్వయంతో దేశ రక్షణను మరింత శత్రుదుర్భేధ్యంగా మార్చుతోంది.

# సిటీలో వీధికుక్కలపై గ్రేటర్ అధికారుల దృష్టి

హైదరాబాద్, నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

సుప్రీంకోర్టు తాజా ఆదేశాల మేరకు.. హైదరాబాద్లో వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు జీహెచ్ఎంసీ ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలతో నగరంలోని ఆసుపత్రుల పరిసరాల వద్ద ఈ కార్యక్రమం మొదలైంది. తొలి రోజునే 277 కుక్కలను పట్టుకున్నారు. వీటికి స్టెరిలైజేషన్, టీకాలను ఇచ్చి.. జీహెచ్ఎంసీ సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు. ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు వంటి జనాలు ఎక్కుకవగా ఉండే ప్రాంతాల్లో ఈ డ్రైవ్ను కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవల కుక్కల దాడులు పెరగడంతో.. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ చర్యలు సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండటం విశేషం. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాల మేరకు.. వెటర్నరీ విభాగం సిబ్బంది వీధి కుక్కలను పట్టుకునేందుకు ఒక ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించారు. ఈ డ్రైవ్ను ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించి అమలు చేస్తున్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రారంభమైన తొలి రోజునే, నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల చుట్టు పక్కల ఏరియాల్లో ఏకంగా 277 వీధి కుక్కలను విజయవంతంగా పట్టుకున్నారు. ఆసుపత్రులలో రోగులు, సందర్శకులు ఎక్కువగా ఉంటారు కాబట్టి.. ఈ ప్రాంతాలకు ముఖ్య ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు మాట్లాడుతూ.. ప్రజల భద్రతను, ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ డ్రైవ్ను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆసుపత్రుల వద్ద కుక్కలు తిరగడం వల్ల పరిశుభ్రత లోపించడంతో పాటు.. రోగులకు ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నారు. పట్టుకున్న ఈ వీధి కుక్కలను కేవలం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడం కాకుండా.. వాటి సంఖ్యను శాస్త్రీయ పద్ధతిలో నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పట్టుకున్న కుక్కలన్నింటికీ స్టెరిలైజేషన్ లేదా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహిస్తారు. ఈ పద్ధతిని యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం అని కూడా అంటారు. దీనివల్ల వాటి సంఖ్య పెరగకుండా నివారించవచ్చు. శస్త్రచికిత్స పూర్తయిన తర్వాత వాటిని జంతు సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు. తిరిగి.. వాటికి టీకాలు ఇచ్చి, కొద్ది రోజుల పర్యవేక్షణ తర్వాత మాత్రమే పట్టుకున్న ప్రాంతంలోనే సురక్షితంగా విడిచిపెడతారు. కమిషనర్ ఆర్వీ కర్ణన్ నగర ప్రజలకు భరోసా ఇస్తూ.. తొలి దశలో ఆసుపత్రులు, క్రీడా ప్రాంగణాలు, రవాణా కేంద్రాలపై దృష్టి సారించామని తెలిపారు. తదుపరి దశలో పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు వంటి ముఖ్యమైన పబ్లిక్ ప్రదేశాలు.. అలాగే పార్కులు, మార్కెట్ ప్రాంతాలలో కూడా ఈ డ్రైవ్ను కొనసాగిస్తామని ప్రకటించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా.. ఏబీసీ పద్ధతిని పకడ్బందీగా అమలు చేస్తూ.. హైదరాబాద్ను కుక్కల బెడద లేని నగరంగా మార్చేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# 3 పార్టీలకు టెన్షన్

## భారీగా రంగంలోకి బెట్టింగ్ రాయుళ్లు

హైదరాబాద్, నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నిక ఆసక్తిని కలిగిస్తోంది. తెలంగాణ మాత్రమే కాదు ఏపీ ప్రజలు కూడా ఈ ఎన్నికను ప్రత్యేకంగా చూస్తున్నారు. ఎందుకంటే ఈ నియోజకవర్గంలో ఏపీ నుంచి వచ్చిన వారు అధికంగా ఉన్నారు.. అందువల్లే ఎవరు గెలుస్తారు? ఎవరికి ఎక్కువ ఓట్లు పడతాయి? ఏ పార్టీ ఎలాంటి హామీలు ఇచ్చింది? క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉంది? అనే అంశాల మీద తెలంగాణ వారి కంటే, ఏపీ ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.ఏపీ నుంచి చాలామంది ఇప్పటికే జూబ్లీహిల్స్ ప్రాంతానికి వచ్చారు. అలాగని వారు సర్వే సంస్థలలో పనిచేస్తున్న వ్యక్తులు కాదు. వారంతా జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను అంచనా వేయడానికి ప్రధాన కారణం.. డబ్బు.. అలాగని వారికి ఇక్కడ ఓట్లు కూడా లేదు. ఇక్కడికి రావడానికి, క్షేత్రస్థాయిలో పర్యటించడానికి.. పార్టీల గురించి వాకబు చేయడానికి ప్రధానమైన కారణం ఒకటుంది.జూబ్లీహిల్స్ ప్రాంతంలో అనేక హోటల్స్.. లాడ్జిలలో చాలామంది దిగడానికి ప్రధాన కారణం బెట్టింగులు వేయడమే.. ఇక్కడ ఎవరు గెలుస్తారు? ఏ పార్టీ ఓడిపోతుంది? గెలిచే పార్టీ అభ్యర్థికి ఎంత మెజారిటీ వస్తుంది? అనే అంశాల మీద బెట్టింగులు జోరుగా సాగుతున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ మీద భారీగా బెట్టింగులు నడుస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే క్రమంలో గులాబీ పార్టీ అభ్యర్థి సునీత విజయం సాధించే అవకాశాలు లేకపోలేదని.. ఆమె గెలుపు మీద కూడా భారీగా బెట్టింగులు నడుస్తున్నట్టు సమాచారం. అందువల్లే వారంతా కూడా జూబ్లీహిల్స్ ప్రాంతంలో కొద్దిరోజులుగా తిష్ట వేసినట్టు తెలుస్తోంది.. ఓ అంచనా ప్రకారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికలపై దాదాపు 300 నుంచి 400 కోట్ల వరకు బెట్టింగులు నడుస్తున్నట్టు తెలుస్తోంది.. కొంతమంది ప్రత్యేక ముఠాగా ఏర్పడి ఏ వ్యవహారం సాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఈముఠా సభ్యులు ఎప్పటికప్పుడు సర్వే చేయించుకుని.. దాని ఆధారంగా బెట్టింగ్లు సాగిస్తున్నట్టు తెలుస్తోంది.జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో నేటితో ప్రచారం ముగుస్తుంది. మంగళవారం పోలింగ్ ప్రారంభమవుతుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం భారీగా ఏర్పాట్లు చేసింది.. నేటి సాయంత్రం నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే దాకా ఇక్కడ వైన్ షాపులను బంద్ చేస్తారు. బయట వ్యక్తులను స్థానికంగా ఉండకుండా బయటికి పంపించేస్తారు.

మాటల తూటాలు..

ఉప ఎన్నికలను అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. సిట్టింగ్ స్థానం నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్, అధికారంలో ఉన్నాం కాబట్టి గెలిచి తీరాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉన్నాయి. ఇక ఇక్కడ సత్తాచాటి తెలంగాణలో నెక్స్ట్ బీజేపీదే అని సంకేతం ఇవ్వాలని బీజేపీ ఉవ్విళ్లూరుతున్నాయి. మూడు పార్టీల నాయకుల ప్రచారం చివరి రోజు ప్రత్యర్థులపై మాటల తూటాలతో దండయాత్ర చేస్తున్నారు. అభ్యర్థుల విజయాన్ని పార్టీ ప్రతిష్టగా మార్చుకోవాలన్న ఉద్దేశ్యంతో ప్రచారం పీక్‌కు చేరింది.

పోలింగ్‌కు సమయం దగ్గరపడుతున్న కొద్దీ అభ్యర్థులు ప్రతి ఓటరిని వ్యక్తిగతంగా చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. స్వీయ అభివృద్ధి వాగ్దానాలు, స్థానిక సమస్యల పరిష్కార హామీలు, మత?జాతి ప్రాతిపదికన కాకుండా అభివృద్ధి రహదారిగా తామే నిలుస్తామన్న ప్రచారం తారస్థాయికి చేరింది. ప్రచార సమయం ముగిసిన వెంటనే హైదరాబాద్ పోలీసు బలగాలు ఎలక్షన్ కోడ్ అమలులోకి దిగి కఠిన పర్యవేక్షణ మొదలుపెట్టనున్నాయి. పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆదేశాల ప్రకారం ఆదివారం సాయంత్రం ఆరు గంటల నుంచి నవంబర్ 11న సాయంత్రం ఆరు గంటల వరకు వైన్స్ షాపులు, బార్లు మూసివేస్తారు.ప్రచారం ముగిసిన వెంటనే ప్రలోభాలకు తెరతీయనున్నారు. ప్రచారంలో చివరి రోజు ర్యాలీలు, పాదయాత్రలు చేశారు. రాత్రి నుంచే డబ్బుల పంపిణీకి సిద్ధమవుతున్నారు. దీనిని అడ్డుకునేందుకు పోలీసులూ వ్యూహం రూపొందిస్తున్నారు.

# బెంగళూరు జైల్లో ఖైదీలకు సర్వభోగాలు

బెంగళూరు,నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):



బెంగళూరు జైలులో సకలభోగాలు అనుభవిస్తున్న ఖైదీలకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. పలు తీవ్రమైన కేసుల్లో శిక్షలు పడిన ఖైదీలు, రేపిస్టులు, నేరస్తులు జైలులో తెగ ఎంజాయ్ చేయడం ఈ వీడియోలో కనిపిస్తుంది. కొందరు దర్జాగా మొబైల్ ఫోన్లలో మాట్లాడుతుంటే.. మరికొందరు ఎంచక్కా టీవీలు చూస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ జైలులోని ఖైదీలు శిక్ష అనుభవిస్తున్న తీరు చూసి ప్రతి ఒక్కరూ నోరెళ్లబెడుతున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులోని ఖైదీల లగ్జరీ లైఫ్‌కు సంబంధించిన దృశ్యాలు ఇవి.ఈ వీడియోలో కనిపించిన ఖైదీల్లో 1996 నుంచి 2022 మధ్య 20 మంది మహిళలపై అత్యాచారం చేయడంతోపాటు వారిలో 18 మందిని హత్య చేసిన కేసులో దోషిగా తేలిన ఉమేష్ రెడ్డి కూడ ఉన్నాడు. ఇతగాడికి కోర్టు తొలుత మరణశిక్ష విధించింది. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో అది 30 ఏళ్ల కఠిన కారాగార శిక్షగా మారింది. ప్రస్తుతం బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఉమేష్ రెడ్డి మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ, టీవీలో ఐటెం సాంగ్ చూస్తూ కనిపించాడు. అతని వద్ద 2 ఆండ్రాయిడ్ ఫోన్లు, మరో కీ ప్యాడ్ మొబైల్ ఫోన్‌లు ఉన్నాయి. ఉమేష్ రెడ్డిని ఉంచిన సెల్‌లో ఒఇఅ టీవీ సదుపాయం కూడా ఉంది. ప్రముఖ నటి రన్యా రావు గోల్డ్ స్మగ్లింగ్ కేసులో అరెస్టైన తరుణ్ రాజు కూడా ఇదే జైలులో సకల భోగాలు అనుభవిస్తున్నాడు. అతడున్న జైలు గదిలో స్వయంగా వంట చేసుకునే సదుపాయం కూడా ఉంది. వీరివద్దనే కాదు ఇతర ఖైదీల వద్ద కూడా మొబైల్ ఫోన్లు ఉండటం విశేషం.కన్నడ నటుడు దర్శన్‌కు జైలు అధికారులు ప్రాథమిక సౌకర్యాలు నిరాకరించగా, ఇక్కడి చాలా మంది కరడుగట్టిన క్రిమినల్స్, రేపిస్టులకు మాత్రం ఎటువంటి పరిమితులు లేకుండా కటకటాల వెనుక విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నట్లు ఈ వీడియో ద్వారా తెలుస్తుంది. వీరితో పాటు ఐసిస్ ఉగ్రవాది జుహాద్ హమీద్ షకీల్‌కు చెందిన మరో వీడియో కూడా ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. అతడు జైలు లోపల గాడ్జెట్‌లు, ఇతర సౌకర్యాలు యదేచ్ఛగా అనుభవిస్తున్నాడు. ఇలాంటి అతి ప్రమాదకరమైన ఖైదీలకు నిబంధనలకు విరుద్ధంగా లగ్జరీ గాడ్జెట్లు వినియోగించేందుకు అనుమతించడం జైలు అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట.పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు లోపల ఏర్పాటు చేసిన హైటెక్ సిగ్నల్ జామర్ల కారణంగా సదరు జైలు పరిసర ప్రాంతాల్లోని నివాసితుల మొబైల్ నెట్‌వర్క్ పని చేయడం లేదని నిత్యం కోకొల్లలుగా ఫిర్యాదులు వస్తున్నాయి. పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులోని ఖైదీలు, సీరియల్ రేపిస్టులు, హంతకులు, నేరగాళ్లు మొబైల్ ఫోన్లు వినియోగించడం, దర్జాగా మొబైల్ ఫోన్‌ల అంతరాయం లేని నెట్‌వర్క్‌లను ఉపయోగిస్తున్నట్లు, సెల్‌ల లోపల ఊఆ నాణ్యత గల వీడియోలను చూస్తూ ఎంజాయ్ చేస్తున్నట్లు వీడియో క్లిప్స్ బయటకు వచ్చాయి. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో సీఎం సిద్ధరామయ్య దర్యాప్తుకు ఆదేశించారు.విజువల్స్‌లో కనిపిస్తున్న ఖైదీలు 2023 బ్యాచ్‌కు చెందినవారు. ఈ ఖైదీలు మొబైల్ ఫోన్‌లను ఎలా పొందారు? జైలు లోపలికి ఫోన్‌లను ఎవరు తీసుకువచ్చారు? ఖైదీలకు ఎవరు అప్పగించారు? వీడియోలు ఎలా రికార్డ్ చేశారు? వాటిని మీడియాకు ఎవరు ఇచ్చారు? అనే విషయాలపై సమగ్ర విచారణ జరిపి విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన జైలు సిబ్బందిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# ఛాంబర్ ఎన్నికల కోసం కసరత్తులు

ఖమ్మం, నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

'ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఖమ్మం పట్టణ వ్యాపార వర్గాలకు సంబంధించిన ఓ సంఘం. దీని పరిధిలో 18 వ్యాపార వర్గాలు, వీటికి సంబంధించిన సభ్యులు 1305. మూడేళ్లకు ఓ సారి ఈ సంఘానికి ఎన్నికలు జరుగుతాయి. ఈ లెక్కన వీటికి సంబంధించిన ఎన్నికల తంతు నామమాత్రమే అనుకో వాలి. కానీ, దీనికోసం పోటీ పడబోయే ఆయా వర్గాల హడావిడి మినీ సార్వత్రిక ఎన్నికలను తలపిస్తున్నాయి.గెలుపు కోసం ఆయా వర్గాలు పోటీ పడుతూ, తీవ్రస్థాయిలో ప్రచారం చేస్తున్నాయి. అయితే ఇందులో ఓ వర్గం మాత్రం గెలుపే ధ్యేయం గా వింత పోకడలు పోతోంది. ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు 'మందు, విందు' అంటూ అడ్డదారులు తొక్కుతోంది. ఇందుకోసం చీకటి పడగానే ప్రత్యేక ఏర్పాట్లు చేసి భారీగానే ఖర్చు పెడుతోంది. సదరు వర్గం వ్యవహారాన్ని చూస్తున్న కొంతమంది విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 'చిన్నపాటి పదవుల కోసం ఈ స్థాయిలో దిగజారాలా?' అనే విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లకు ఓసారి జరిగే ఎన్నికల్లో ప్రధాన పానెల్ కు సంబంధించిన ఎన్నికే ముఖ్యమైనది. ఆ తరువాత దిగుమతి శాఖ కు ప్రాముఖ్యం ఉంటుంది. మిగతా శాఖలకు సంబంధించిన ఎన్నిక నామ మాత్రమే! ప్రధాన పానెల్ కు ఎన్నికల కోసం రెండు వర్గాలు ప్రధానంగా పోటీ పడుతున్నాయి. ఈ ప్యానెల్ లోనే అధ్యక్ష, ఉపాధ్యక్ష, సెక్రటరీ, ట్రెజరర్ల పదవులు ఉండటం, వీటికి ఎన్నికైన వారి చేతిలోనే ఛాంబర్ అధికారాలు ఉండటమే కాకుండా ఆయా శాఖల్లో, ముఖ్యంగా గ్రెయిన్ మార్కెట్లో పలుకుబడి ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో ప్రధాన పానెల్ ను ఎలాగైనా దక్కించుకోవాలని ఈ రెండు వర్గాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. సంఘం ఓటర్లను కలిసి తమకే ఓటు వేయాలని వేడుకోవడంతోపా టు, ప్రచార చిత్రాలను, బ్యానర్లను ప్రధాన మార్కెట్ కూడళ్లలో ఏర్పాటు చేసి గెలుపు కోసం ఆరాటపడుతున్నాయి. వీరి ప్రచారంతో త్రీ టౌన్ లోని గాంధీ చౌక్, గ్రెయిన్ మార్కెట్ ప్రాంతమంతా హడావుడిగా కనిపిస్తోంది. ప్రధాన పానెల్ కు పోటీ పడుతున్న ఓ వర్గం ఛాంబర్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని కసితో అడ్డదారుల్లో వెళ్లేందుకు ప్రయత్నిస్తోందని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. నామినేషన్ వేసిన రెండో రోజు నుంచే ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు ఎత్తులు వేసింది. మందు పార్టీలు ఏర్పాటు చేసి విందులు చేసింది. ఈ విష యం బయటకు పొక్కడంతో తమ ప్యానెల్ కు చెడ్డ పేరు వస్తోందని, దీనివల్ల తమ ఓటు బ్యాంకు కి చిల్లు పడే అవకాశం ఉందని భావించి వేరే మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. నేరుగా మందు పార్టీ అని కాకుండా జన్మదిన వేడుకల ముసుగులో మద్యం పార్టీలు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.ఇందుకోసం ఛాంబర్ ఓటర్లలో ఎవరిదైనా పుట్టినరోజు ఉందేమోనని ఆరా తీసి, వారి పేరిట సాయంత్రం మందు పార్టీకి సదరు వర్గం సన్నాహాలు చేస్తోంది. ఆ రోజు జన్మదినం జరుపుకునే వారిని తాము నిర్ణయిం చిన చోటుకి సాయంత్రం పిలిపించి, వారితో కేకు కోయించి సంబరాలు చేస్తున్నారు. ఆ తర్వాత సంబరాలకు వచ్చిన వారిని మందు, విందుల్లో ముంచి తేల్చుతున్నారు. ఈ మందు పార్టీకి ఓటర్లలో ఎవరిని ఆహ్వానించాలో ఉదయమే నిర్ణయించి, వారికి రహ స్యంగా సమాచారం అందించడమే కాకుం డా, వారంతా తామిచ్చే పార్టీకి కచ్చితంగా హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకు ప్రతిరోజు రూ. 70 వేల నుంచి రూ. లక్ష వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచా రం. దీనికి సంబంధించిన ఖర్చును సదరు వర్గం తరఫున పోటీపడే వారు వాటాలు వేసుకొని భరిస్తున్నట్లు తెలుస్తోంది. ఛాంబర్ ఎన్నికలకు పోటీ పడుతున్న వారంతా వ్యాపారులే! వీరంతా తమ పెట్టుబడి మీద 10% నష్టాన్ని కూడా భరిం చడానికి ఒప్పుకోరు. లాభం లేనిదే రూపా యి కూడా ఖర్చు చేయరు. అలాంటిది సదరు వర్గం పార్టీల పేరిట ఎన్నికల నాటికి (నవంబర్ 16) చేసే ఖర్చు దాదాపు రూ.20 నుంచి రూ.25 లక్షల మేర వస్తుందని అంచనా! కేవలం ఛాంబర్ పదవుల కోసం ఈ స్థాయిలో ఖర్చు చేస్తుండటంపై పలు సం దేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల్లో గెలి చి పదవులు దక్కితే, ఆ తర్వాత ఛాంబర్ కు వచ్చే ఆదాయం నుంచి తాము పెట్టిన ఖ ర్చును ఎలాగో ఒకలాగా రాబట్టుకోవచ్చనే భావనలో సదరు వర్గం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఛాంబర్ ను తన గుప్పెట్లో పెట్టుకొని తమ వ్యాపారాలను ఇష్టరీతిన నిర్వహించుకునేందుకే ఈ వ్యవహారమంతా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు వర్గం చేస్తున్న హడావుడి చూస్తుంటే ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ప్యానెల్ నుంచి ప్రధాన పదవులకు పోటీ పడబోతున్న వారి పైన మొదటి నుంచి విమర్శలు ఉన్నాయి. ఈ ప్యానెల్ లోని ఓ వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అక్రమాలకు పాల్పడ్డాడు అనే విమర్శలు ఉన్నాయి. ఇక దీనికి తోడు ఇతరత్రా వర్గాల్లో కాస్త మేనేజ్ చేయగలిగిన వ్యక్తులను చేరదీసి, తన వెంచర్లలో చీకటి వ్యవహారాలు చేయిస్తాడనే ప్రచారం ఉంది. సదరు వ్యక్తి గురించి తెలిసిన కొంతమంది వ్యాపారులు ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తుండడం గమనార్హం! ఇక పానెల్ మరో ప్రధాన సీటుకి పోటీ పడబోతున్న ఓ పెద్ద ఖరీదుదారు కమీషన్ వ్యాపారులను పీల్చి పిప్పి చేస్తాడనే ప్రచారం ఉంది. కటింగ్ బిల్లుల వ్యవహారంలో ఊరంతా ఓ పోకడైతే, సదరు వ్యాపారిది మరో దారి. కటింగ్ బిల్లుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాడన్న ప్రచా రం ఉంది. సదరు పెద్ద వ్యాపారి కటింగ్ బిల్లు రేటుని తగ్గిస్తే, మిగతా వ్యాపారులు కూడా తగ్గిస్తారు. దీని వల్ల కమీషన్ వ్యాపారులకు కాస్త ఊరట కలుగుతుంది. కానీ ఈ పెద్ద వ్యాపారి కటింగ్ బిల్లు వ్యవహారంలో కాస్త కూడా పట్టు విడుపు ప్రదర్శించడని సమాచారం. ఇలా అక్రమ వ్యవహారాల్లో పాలు పంచుకునే వ్యక్తి, వ్యాపారుల గురించి కనీసం ప ట్టించుకోని వ్యక్తులు ఛాంబర్ పదవులకు ఎ లా పోటీ చేస్తారని, ఒకవేళ గెలిచినా వ్యాపార వర్గాలకు ఎలా న్యాయం చేస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# చకచకా కొనసాగుతున్న మేడారం పనులు

వరంగల్,నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

మేడారం జాతరలో విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలను నివారించేందుకు తెలంగాణ విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందుకోసం రూ. 4 కోట్లతో 37 కిలోమీటర్ల మేర కవర్డ్ కండక్టర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. ఈ అత్యాధునిక సాంకేతికతతో భక్తులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా, భద్రత కల్పించనున్నారు.తెలంగాణ గిరిజనుల పండగ.. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా విద్యుత్తు సరఫరాలో తరచూ ఏర్పడే అంతరాయాలను, ప్రమాదాలను నివారించేందుకు విద్యుత్తు శాఖ ఈసారి ప్రత్యేక చర్యలు చేపట్టింది. వర్షంతో కూడిన ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్తు తీగలపై పడడం, వాటి వల్ల సరఫరాలో అంతరాయం కలగడం సర్వసాధారణం. అంతేకాక, దట్టమైన అటవీ ప్రాంతంలో జరిగే ఈ జాతర సమయంలో దుకాణదారులు నేరుగా వైర్లను తగిలించుకుని విద్యుత్తును వాడుకోవడం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉంది. ఇక నుంచి వ్యాపారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడటం కదరదు. ఈ సమస్యలను అధిగమించేందుకు విద్యుత్తు శాఖ వినూత్నంగా కవర్డ్ కండక్టర్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.కవర్డ్ కండక్టర్ అంటే అల్యూమినియం తీగ చుట్టూ ప్లాస్టిక్ తొడుగు (ఇన్సులేషన్) ఉన్న విద్యుత్తు తీగలు. ఈ ప్రత్యేక ఏర్పాటు కోసం సుమారు రూ. 4 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. తొలిసారిగా అమలు చేస్తున్న ఈ ప్రణాళికలో భాగంగా, చెట్లు ఎక్కువగా ఉండి విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయం కలిగే ప్రధాన ప్రాంతాలను గుర్తించారు. మొత్తం 37 కిలోమీటర్ల పొడవునా కవర్డ్ కండక్టర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 33 కేవీ లైన్ 21.8 కిలోమీటర్లు, 11 కేవీ లైన్ 15.45 కిలోమీటర్లు సామగ్రిని సిద్ధం చేసే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది.ఇటీవల, ఈ వ్యవస్థ సామర్థ్యాన్ని పరీక్షించడానికి తాడ్వాయి మండలం కాటాపూర్ ప్రాంతంలో 3 కిలోమీటర్ల మేర కవర్డ్ కండక్టర్ వైరును ప్రయోగాత్మకంగా వేశారు. కాగా, కవర్డ్ కండక్టర్ ఏర్పాటు ఖర్చు సాధారణ విద్యుత్తు తీగల కంటే ఎక్కువ. 33 కేవీ లైన్ కవర్డ్ కండక్టర్ మీటరుకు రూ. 563 (సాధారణ తీగ రూ. 125)11 కేవీ లైన్ కవర్డ్ కండక్టర్ మీటరుకు రూ. 274 (సాధారణ తీగ: రూ. 64) కవర్డ్ కండక్టర్ వేయాలంటే ప్రతి విద్యుత్తు లైన్‌లో మూడు వరుసలు తీగలు లాగాల్సి ఉంటుంది. దీనివల్ల సాధారణ తీగ కంటే కవర్డ్ కండక్టర్‌కు నాలుగింతలు ఖర్చు అధికంగా వస్తుంది. అయినప్పటికీ, ఈ కవర్డ్ కండక్టర్లు చెట్ల కొమ్మలు తగిలినా షార్ట్ సర్క్యూట్‌లు జరగకుండా నిరోధిస్తాయి. ఖర్చు ఎక్కువైనా, ఈ ఏర్పాటుతో విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు చాలా వరకు తగ్గుతాయి, ముఖ్యంగా జాతర సమయంలో భక్తులకు నిరంతరాయంగా విద్యుత్తు అందించడానికి, ప్రమాదాలను నివారించడానికి ఇది దోహదపడుతుంది.

# తల్లిని, తమ్ముడిని హతమార్చిన అన్న

భీమవరం నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

భీమవరం సుంకరపద్దయ్య గారి వీధి మన్నా చర్చ్ ఎదురుగా దారుణంచ జరిగింది. నిందితుడు గునుపూడి శ్రీనివాస్ తల్లిని, తమ్ముడిని కత్తితో పొడిచి చంపివేసాడు. తల్లి గునుపూడి మహాలక్ష్మి ( 60). తమ్ముడు గునుపూడి రవితేజ (33) అక్కడికక్కడే మృతి చెందారు. తరువాత గునుపూడి శ్రీనివాస్ 112 కాల్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాడు. భీమవరం వన్ టౌన్ పోలీసులు హత్యలపై సమాచారాన్ని సేకరిస్తున్నారు. జిల్లా ఎస్పీ ఆస్మీ ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

# నగ్న సత్యం

==============

రాక్షసులు లేరు అనుకోవద్దు
వీధి వీధికి ఉన్నారు
విచ్చలవిడిగా తిరుగుతున్నారు
పట్టపగలే చుక్కలు చూపిస్తున్నారు
దోపిడీలు, దొంగతనాలు చేస్తున్నారు
హత్యలు, అత్యాచారాలు లో ముందున్నారు
రావణాసురుడు సీతను మాత్రమే చెరపట్టాడు
నేడు కుప్పల కోద్ధి రావణాసురులు
వేల కొద్దీ చెరచ డాలు,చెడపట్టడాలు
నాడు నరకాసురుడే ప్రజాకంతకుడు
నేడు ఎంత మంది నరకాసురులో
అడుగుగడుగునా నయ వంచకులు,మోసగాళ్లు
గాంధీజీ ని చంపిన
ఇందిరాగాంధీని హత్య చేసిన
రాజీవ్ గాంధీని మట్టుపెట్టిన
శాంతి మంత్రం మాత్రమే పఠిస్తున్నాం
అహింసా తంత్రమే ఉపయోగిస్తున్నాం
ఇక్కడ నేరాలకు కొదవలేదు
అత్యాచారాలకు అదుపు లేదు
అడిగే నాదుడే లేదు
ప్రశ్నించిన ఫలితం రాదు
ప్రతిఘటించిన న్యాయం జరగదు
నేరస్తులే కదా చట్టసభల్లో ఉండేది
అమాత్య పదవులు వెలగబెట్టేది
ఇక అసురుల పాలనలో ప్రజలకు ఏది భద్రత? ప్రజాస్వామ్యానికి ఏది సార్ధకత?

ఆచార్య గిడ్డి.వెంకట రమణ, 9440984416

హామీ పత్రం

నగ్న సత్యం, కవిత స్వీయ రచన ని దేనికి అనువాదం, అనుకరణ కాదని ప్రసారం ప్రచురణ కాలేదని తెలియజేయుచున్నాను

ధన్యవాదాలతో
డాక్టర్ జి వి రమణ
సీనియర్ ప్రొఫెసర్
విభాగాదిపతి, సమాజ శాస్త్ర విభాగం
ఎస్. కే. యూనివర్సిటీ
అనంతపురం -515003

# టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

పరీక్ష ఫీజును చెక్కు ద్వారా జిల్లా కలెక్టర్ కు అందజేసిన బిజెపి జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

కరీంనగర్, నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

"మోదీ గిఫ్ట్" పేరుతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులందరికీ ఎగ్జామ్ ఫీజును చెల్లిస్తానని ప్రకటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ సోమవారం పరీక్ష ఫీజును చెక్కు ద్వారా రూ.5,45, 375



మొత్తాన్ని చెల్లించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, నాయకులు గుజ్జ శ్రీనివాస్ లతో కలిసి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతినీ కలిసి పరీక్షా ఫీజును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికి ఈ ఏడాది టెన్త్ పరీక్షా ఫీజును పూర్తిగా చెల్లించేందుకు ఇటీవల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్ణయం తీసుకొని, ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారని తెలిపారు. అధికార వర్గాలు తెలియజేసిన ప్రకారం కరీంనగర్ జిల్లాలో 4,847, మంది 10వ తరగతి విద్యార్థులున్నారనీ, పరీక్ష ఫీజు కోసం కరీంనగర్ ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్

తన వేతన డబ్బులు నుండి రూ.5,45, 375 ల మొత్తాన్ని చెల్లించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారేనని, . వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల పరీక్ష ఫీజుల విషయంలో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో కేంద్ర మంత్రి తన నియోజకవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు మొత్తాన్ని భరించి , వారికి చేయూతనిచ్చిన కేంద్రమంత్రి బండి సంజయ్ కి బిజెపి కరీంనగర్ జిల్లా పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

# విద్యుత్ బల్బులో వెలుగుతున్న థామస్ అల్వా ఎడిసన్"

ప్రయత్నం చేస్తే ఓటమి లేదా విజయం కలుగుతాయి. కానీ ప్రయత్నమే చేయకపోతే,ఏమి ఉండదు. పరాజయాలు,ఓటములు మన జీవితంలో భాగం. నాడు చిన్నతనంలో ఒక్క అడుగు వేయలేక కిందపడ్డ వాళ్లే, నేడు ఎవరెస్టు శిఖరాన్ని తమ కాళ్లకింద చూసుకుని ఆనందిస్తున్నారు. పరాజయాలు ఉన్నదే మనకు పాఠం నేర్పటానికి.

ప్రపంచాన్ని ప్రభావితం చేయగల వ్యక్తులు చాలామంది అలాంటి పాఠాలు నేర్చుకున్నవారే.నేటి మానవ జీవిత వికాసానికి నాటి ఎందరో మహానుభావులు కనుగొన్న రకరకాల ఆవిష్కరణలు, ఆ ఆవిష్కరణలకు చేసిన అసాధారణ కృషి ఫలితంగా ఎన్నో సాధనాలు, సూత్రాలు, మార్గాలు, సౌకర్యాలు కలిగాయి.

మానవ జీవితం సుఖమయం కావడానికి కృషి చేసిన ఎందరో శాస్త్రవేత్తలు మనకి తెలుసు కానీ వారి ప్రయోగాల వెనుక వారు గడిపిన జీవితం, సాధించిన ఫలితాల వెనుక వారు చేసిన కృషి చాలా మందికి తెలియదు. అతి ముఖ్యమైన ఆవిష్కరణలు చేసిన ప్రముఖులలో ఒకరయిన థామస్ అల్వా ఎడిసన్ గారి గూర్చి నేర్చుకుందాం.

సోమరితనం అన్నింటికీ కష్టాలు కలిగిస్తే, శ్రమ అన్నింటినీ తేలిక చేస్తుందని,విజయానికి కావలసింది పది శాతం ప్రేరణ అయితే తొంభై శాతం శ్రమ అని నమ్మి, జీవిత కాలమంతా పరిశోధనలకే కేటాయించి విద్యుత్ బల్బు, ఫోనోగ్రాఫ్ లాంటి అనేక ఉపకరణాలను రూపొందించిన ఒక గొప్ప అమెరికన్ శాస్త్రవేత్త మరియు వ్యాపారవేత్త థామస్ ఆల్వా ఎడిషన్.

ఎడిసన్ అమెరికా లోని ఓహియో రాష్ట్రానికి చెందిన మిలన్ లో 1847 ఫిబ్రవరి 11 రోజున జన్మించారు.తండ్రి శామ్యూల్ ఆగ్డెన్ ఎడిసన్, తల్లి నాన్సీ మాథ్యూస్ ఎడిసన్ . వీరికి కలిగిన ఏడవ మరియు చివరి సంతానమే ఎడిషన్.

10 ఏళ్ళ వయస్సు నాటికి సొంతంగా లాబొరేటరీని యేర్పాటు చేసుకునే స్థాయి ఆలోచనలు ఉన్నవాడు ఎడిషన్. ఆర్థికంగా నిలదొక్కుకోవటం కోసం రైళ్ళలో న్యూస్ పేపర్లు,స్వీట్లు అమ్మేవాడు. అతి చిన్నవయస్సు లోనే టెలిగ్రాఫ్ నమూనా యంత్రాన్ని తయారు చేశాడు. 1861లో ఆయనకు ప్రమాద వశాత్తు చెవుడు వచ్చింది. రైల్వే బోగీలోనే లాబొరేటరీ పెట్టి కొన్ని రోజులు ప్రయోగాలు చేశాడు. పొరపాటుగా అగ్ని ప్రమాదం జరగడంతో రైల్వే అధికారులు ఆయనను దూరంగా ఉంచివేశారు.1871 డిసెంబరు 25న, 24 సంవత్సరాల వయసులో 16 యేళ్ళ మారీ స్టిల్ వెల్ ను పెండ్లి చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు.

1862 లో ఎడిసన్ ఒక స్టేషను మాస్టర్ బిడ్డను ప్రమాదం నుంచి రక్షించినందుకు ఆయన వద్ద నుంచి టెలిగ్రఫీని నేర్చుకున్నాడు. 1868 లో టెలిగ్రాఫ్ పేటెంట్ ను పొందగలిగాడు. బతుకు తెరువు కోసం స్టాక్ ఎక్స్చేంజీ టెలిగ్రాఫ్ ఏజన్సీలో పనికి కుదిరాడు. తన టెలిగ్రాఫ్ పరికరాన్ని అమ్మడం వల్ల కొద్ది మొత్తమో లభిస్తుందని అనుకున్న ఎడిసన్ కి నలభై వేల డాలర్లు ముట్టడంతో ఆశ్చర్యపోయాడు.అప్పటి నుండి ఆయన ఆవిష్కరణలకు ఆయన పూర్తి సమయాన్ని కేటాయించాడు.

1877లో ఎడిసన్ ఫోనోగ్రాఫ్‌ను కనుగొన్నారు. ఎడిసన్ కనుగొన్న పరికరాలలో ప్రొజెక్టర్, మోషన్ పిక్చర్ కెమరా వంటి దాదాపు 1093 పరికరాలు ఉన్నాయి. 1878 లో ఎలక్ట్రిక్ బల్బ్ ను రూపొందించాడు. అది ఆర్థికంగా ఆయనకు మరింత ఎత్తుకు తీసుకుని వెళ్ళింది. థర్మో అయానిక్ ఎమిషన్ గురించి కూడా అదే సమయంలో ఎడిసన్ వెల్లడించాడు.1887-1889 మధ్య కాలంలో టైప్ రైటర్, ఎలక్ట్రిక్ పెన్, గ్రామ్ ఫోన్, మోషన్ పిక్చర్ కెమేరా, అలాగ ఎన్నింటినో రూపొందిచారు.కొన్ని కొత్త పరికరాలైతే మరికొన్ని ఉన్నవాటిని మరింత అత్యాధునికంగా తయారుచేశాడు.

కొన్ని అపజయాల వల్ల ఆశలు గల్లంతవుతాయి. పడ్డ కష్టం వృధా అవుతుంది. కానీ, వారు తిరిగి తమ కలలను నిజం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ఎన్నిసార్లయినా మొదటినుంచి ప్రారంభించడానికి గొప్ప పట్టుదలతో, అంకితభావంతో పనిచేస్తారు. అదే వారిని విజయతీరాలకు చేరుస్తుందని అనడానికి ప్రత్యక్ష ఉదాహరణ థామస్ అల్వా ఎడిషన్.

అతని ఆవిష్కరణలో ఎంతో సంచలనం సృష్టించినది విద్యుత్ బల్బు.విద్యుత్ బల్బు నుంచి వెలుతురు చూసేందుకు థామస్ ఎడిసన్ దాదాపు 3,000 ప్రయత్నాల్లో విఫలమయ్యారు. అయినా ఆయన తన ప్రయత్నాలను ఆపలేదు. ఆఖరికి అనుకున్నది సాధించారు.ఎడిషన్ కు తల్లే మొదటి గురువు. తల్లి అందించిన ప్రోత్సాహపు మాటలు,ఆయనను ప్రపంచం గర్వపడే మేధావిని తయారుచేసింది. గణిత, భౌతిక శాస్త్రాల్లో గొప్పవాడయ్యడంటే శ్రమ,ఆశయసాధనలో పోరాటం మాత్రమే.

1889లో పారిస్ లో జరిగిన గొప్ప వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించబడ్డ వస్తువుల్లో తొంభై శాతానికి పైగా థామస్ అల్వా ఎడిసన్ కు చెందినవే. ఆయన రూపొందించిన వాటిలో 1000 కి పైగా వాటికి పేటెంట్ హక్కులు కలిగి ఉన్నాడంటే ఎడిషన్ ప్రతిభ ఎంతటిదో మనం ఊహించవచ్చు.

చనిపోయే నాటి వరకు సరికొత్త ఆవిష్కరణలు కోసం అనుక్షణం ఆరాట పడ్డాడు.ఆయన అక్టోబరు 18 ,1931 న అమెరికాలోని వెస్ట్ ఆరెంజ్, న్యూ జెర్సీ లో మరణించాడు.

థామస్ అల్వా ఎడిసన్ భౌతికంగా మరణించినప్పటికీ వెలుగుతున్న బల్బు ఎల్లప్పుడూ ఆయనను మనకు గుర్తు చేస్తూనే ఉంటుంది. గొప్పవారి శ్రమ,ప్రతిభ,అపజయము తర్వాత విజయం,అలుపెరుగని పోరాటం నేటి యువతకు ఆదర్శం కావాలి.

గడప రఘుపతిరావు
రాష్ట్ర ఉత్తమఉపాధ్యాయ అవార్డు గ్రహీత
9963499282

# అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి: జాయింట్ కలెక్టర్ అధితి సింగ్

వైయస్సార్ కడవ జిల్లా, నవంబర్ 10(భారత శక్తి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ అధితి సింగ్ అధికారులను ఆదేశించారు.



సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తోపాటు డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అధితి సింగ్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు.పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలి. జిల్లా అధికారులు మీకు వచ్చిన అర్జీలను సమయం కేటాయించి రివ్యూ చేయాలన్నారు. ఎవరైనా అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు.అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు.అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు.. 1)కడపకు చెందిన అజ్మత్ అలీ మా కుమారునికి సదరం సర్టిఫికెట్ మంజూరు చేసి వికలాంగుల పింఛన్ ఇప్పించవలసిందిగా కోరుతూ సోమవారం అర్జీని సమర్పించారు.

2)కాజీపేట మండలం మూలవారిపల్లి గ్రామానికి చెందిన లింగయ్య పక్షవాతంతో కాలు చెయ్యి పడిపోయాయని ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలంటూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు.

3) పెద్దముడియం మండలం నెమళ్ళదిన్నె గ్రామానికి చెందిన సోమన్న మా గ్రామంలో 1.52 ఎకరాల వ్యవసాయ భూమిని సర్వే చేయించి ఆన్లైన్ ఎక్కించాలని కోరుతూ అర్జీని సమర్పించారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్, సిపి లకు ఎమ్మెల్యే గంగుల సన్మానం -సాధారణంగా పెళ్లి ఆహ్వాన పత్రిక అందజేత



కరీంనగర్, నవంబర్10 (భారతశక్తి ప్రతినిధి):

మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతినీ, కరీంనగర్ పోలీస్ కమిషనర్ హౌస్ అలం లను శాలువాలతో సన్మానించి పెళ్ళికి ఆహ్వానించారు. సోమవారం కలెక్టరేట్, కమిషనరేట్ లల్లో ఇద్దరు జిల్లా అధికారులను తన సోదరుడు, ప్రముఖ వ్యాపారవేత్త గంగుల సుధాకర్ కుమారుడు గంగుల సాయి మనోజ్ వివాహనికి సకుటుంబ సపరివారంగా రావాలని పెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 13వ తేదీన జరిగే పెళ్లి వేడుకలను తప్పకుండా రావాలని కోరారు.

# ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లోకి పోటెత్తాలి

(నవంబర్11 న జూబ్లీ హిల్స్ శాసనసభ ఉప ఎన్నికకు పోలింగ్ జరుగుతున్న రోజును పురస్కరించుకొని ఓటర్లను పోలింగ్లో చైతన్యంతో పాల్గొనాలనే దృష్టితో రాసిన కవిత)

నవంబర్11న పోలింగ్
రోజు హాలీడే కాధు
ప్రజాస్వామ్య హొలీడే
పోలింగ్ బూతులోకి
ఓటర్లు పోటెత్తాలి
ప్రజాస్వామ్య స్ఫూర్తిని
చాటాలి

ఓటుతో ప్రభుత్వాన్నినిర్మించాలి
మార్పు మాటల్లో కాదు
ఓటువేసి మార్పు చూడాలి
ఓటుతో మార్పు తీర్పుకు
నీవే అగ్రేసరుడివి కావాలి

ఓటుతో శాసననిర్మాతను
ఆదేశించాలి
బుల్లెట్ కంటె బ్యాలెట్
బలమైంది
ఓటు పవర్ ను చాటాలి
ఓటుతో ఐదేళ్ల అభివృద్ధిని
నిర్దేశించాలి

ఓటుతో జాతి తల రాతను మార్చు
మంచి నాయకత్వాన్నిఏర్చి కూర్చు
నయా వంచకులకు తెరదించు

దేశ రక్షణ భద్రతజాతి ఉజ్వల
భవిష్యత్తుకు ఓటెయి
ఓటుతో విద్వంస విచ్ఛిన్న
పాలనకుపాడాలి చరమ గీతం
ఓటు కావాలి ప్రగతికిదారి దీపం

ఓటుతో పంచవర్ష
ప్రగతికి బాటలు వేయాలి
ఓటు విలువైన ఆయుధం
ఓటు విలువ తెలుసుకో
దేశ ప్రగతిని మార్చుకో

ఓటేయడం మానవద్దు
ఓటరు రాజకీయ పార్టీల
ఉచితాల ఊబిలో పడక
విజ్ఞతతో ఆలోచించు
సమర్థులను గెలిపించు
ప్రచార ఆర్భాటాల మధ్య
ప్రశాంతంగా ఆలోచించు
నిర్భయం ఓటెయ్యాలి
మేలెంచి మంచి వారిని
ఎన్నుకోవాలి


రాజ్యాంగ హక్కును
వృధా చేయవద్దు
ప్రలోభాలకు లొంగకు
అనర్హులకు ఓటు వేయకు

అభ్యర్థుల కుల మతాలు
కాదువారి అభిమతాలు
ముఖ్యం
నీ చూపుడు వేలితో శాషించు
నోటుకు ఓటును అమ్ముకోకు

నీవు వేసే ఓటు
దేశ ప్రగతికి మెట్టు
విజ్ఞతతో ఆలోచించు
సమర్థులు గెలిపించు
ప్రజాసేవకులను ఎన్నుకో
అభ్యర్థి ఏ పార్టీవాడని కాదు
ఏ పాటి వాడో చూడు
ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు
ఇప్పటిదాక ఏమి చేశాడో చూడు

నీ ఓటు నేరచరితులపై
కావాలి వేటుబూతులు
మాట్లాడే నాయకులకు
పోలింగ్ బూతులోనే
ఓటుతో బుద్ది చెప్పండి
పార్టీ ఫిరాయించిన
వారిని ఓటుతో ఓడించండి
నీతి నిజాయితీ పరులకు
పట్టం కట్టండి
చట్టం చేయని పని ఓటర్లే
చేయాలిజి
పిరాయింపుల స్వామ్యాన్ని
ఓటుతో అడ్డుకోవాలి
ప్రగతి పురోగతిని కోరుకో
పల్లెల్లో పోలింగ్ జోరు
పట్నాలలో నగరాలలో
పోలింగ్ బేజారు
ఓటర్లు ఎండ వాన సెలవు
పేరునపోలింగుకు దూరం
కావద్దుఅసమర్థ అవినీతి
నాయకులను ఎన్నుకోవద్దు

ఓటర్లు నిర్లిప్తత నిరాశను
వీడాలి పోలింగ్
బూతుకు వెళ్ళాలి
ప్రజాస్వామ్య పండుగలో
ఓటుతో సందడి చేయాలి
ప్రజాస్వామ్య స్ఫూర్తిని
ప్రపంచ దేశాలకు చాటాలి
మంచి నాయకున్ని ఎన్నుకో
ప్రజాస్వామ్య విజయానికై
సాగిపో



నేదునూరి కనకయ్య
( నేదునూరి కళ్యాణ్)
రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం ' సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
కరీంనగర్9440245771

# ప్రజావాణికి 31 దరఖాస్తులు

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 10:

జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



సూచించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ పద్మజ రాణిలతో కలిసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు సమర్పించారు.ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖాధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి, పరిధిలో పరిష్కరించగలిగిన వాటిని వెంటనే పరిష్కరించాలి. పరిధికి సంబంధించినవి కాని అంశాలపై దరఖాస్తుదారు లకు సరైన సూచనలు అందించాలి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మొత్తం 31 దరఖాస్తులు స్వీకరించబడ్డాయని, వాటిని సంబంధిత శాఖలకు పంపించినట్లు కలెక్టర్ వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈ ఓ జానకి రెడ్డి, పి డి, డి ఆర్ డి ఓ జ్యోతి, రెవెన్యూ, పోలీస్,పంచాయతీ రాజ్, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సంక్షేమ శాఖల అధికారులు తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ తీర్పు చారిత్రాత్మకంగా నిలుస్తుంది

# బీఆర్ఎస్, బిజెపి కేల్ కతం దుకాణం బంద్

## కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల

కరీంనగర్, నవంబర్10(భారతశక్తి ప్రతినిధి)'

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు, దేశంలోనే చారిత్రాత్మకమైన విజయంగా నమోదు కాబోతుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. ప్రజల తీర్పుతో బిఆర్ఎస్, బిజెపి ఖేల్ కతం, దుకాణం బంద్ కాబోతుందని ఆరోపించారు. ఇరు పార్టీలను ప్రజలు తిరస్కరిస్తున్నారనీ, అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు. సోమవారం జూబ్లీహిల్స్ లోని యూసుఫ్ గూడా లో కాంగ్రెస్ పార్టీ నవీన్ యాదవ్ కుటుంబ సభ్యులను వెలిచాల రాజేందర్ రావు కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్రావును నవీన్ యాదవ్ వారి కుటుంబ సభ్యులు ఆత్మీయంగా పలకరించారు. ఇరువురు జూబ్లీహిల్స్ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించుకున్నారు. అనంతరం రాజేందర్ రావు మాట్లాడుతూ నవీన్ యాదవ్ దాదాపు 40 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా విజయం సాధించబోతున్నారని జోస్యం చెప్పారు. గెలుపు ఎప్పుడో ఖరారు అయిందని, జూబ్లీహిల్స్ ఓటర్లు ప్రజలు కాంగ్రెస్ వైపే చూస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ ఓటమి భయంతోనే జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం నిర్వహించలేదనీ, భయంతోనే దూరంగా ఉన్నారని ఆరోపించారు. కొడుకు అల్లుడిని ప్రచారానికి పంపించారని, వారు ఎంత గింజుకున్నా ప్రజల నుంచి మాత్రం స్పందన రాలేదన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధిని ఏనాడు పట్టించుకోలేదని ప్రజలే మండిపడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాదు దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిందని తెలిపారు.



10 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ హైదరాబాదు అభివృద్ధిని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. బిజెపి, బీఆర్ఎస్ కుట్రలను ఇక్కడి ప్రజలు తిప్పికొడుతున్నారనీ, కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు మద్దతు పెరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం జూబ్లీహిల్స్ ను మరింత అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు.

# 46 మైసమ్మ ఆలయాలను కూల్చివేస్తారా?

### రోడ్డుకు అడ్డంగా ఉన్న మసీదులను ఎందుకు వదిలేశారు?

### 48 గంటలు టైమిస్తున్నా.....

### జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలైపోగానే నేనే గోదావరిఖని వస్తా.... మీ సంగతి తెలుస్తా

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పెద్దపల్లి అధికారులకు హెచ్చరిక

కరీంనగర్, నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

గోదావరిఖనిలో 46 దారి మైసమ్మ ఆలయాలను అధికారులు కూల్చివేయడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుకు అడ్డుగా



ఉన్నాయనే కారణంతో ఆలయాలను కూల్చివేసిన అధికారులు మసీదులను ఎందుకు కూల్చలేదని ప్రశ్నించారు. కొద్దిసేపటి క్రితం హైదరాబాద్ నుండి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీలకు ఫోన్ చేసిన బండి సంజయ్ ఆలయాలను కూల్చివేయడంపై మండిపడ్డారు. రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని విస్తరణలో భాగంగా కూల్చివేశామంటూ అధికారులు చెప్పడంతో "రోడ్డుకు అడ్డంగా మసీదులు కూడా ఉన్నాయి కదా? మరి వాటిని ఎందుకు కూల్చివేయలేదు"అని ప్రశ్నించారు. దీనిపై అధికారులు నీళు నమలడంతో "ఏం తమాషా చేస్తున్నారా? ఎవరి మెప్పు కోసం మూకుమ్మడిగా మైసమ్మ ఆలయాలను కూల్చివేశారు? ఆటోడ్రైవర్ల అడ్డాల దగ్గర ప్రతిరోజు మైసమ్మ ఆలయం వద్ద మొక్కుకుంటారు. భక్తులు నిత్యం దర్శించుకుంటారు. రోడ్డుకు అడ్డంగా ఉన్నాయనే నెపంతో ఇష్టమొచ్చినట్లు కూల్చివేస్తారా? భక్తుల మనోభావాలు పట్టవా? పోనీ అదే రోడ్డుకు అడ్డంగా అక్కడ మసీదులు కూడా ఉన్నాయి కదా? మరి వాటినెందుకు కూల్చివేయలేదు? హిందువులంటే అంత చులకనా?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మీకు 48 గంటలు టైమిస్తున్నా. కూల్చివేసిన దారి మైసమ్మ ఆలయాలన్నింటినీ ఆలోపు పునరుద్ధరించాలి. లేకపోతే దారికి అడ్డంగా ఉన్న మసీదులన్నింటినీ కూల్చివేయాలి. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ అయిన వెంటనే గోదావరిఖని నేను వస్తా. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోసహా అధికారులందరినీ ప్రజల ముందు నిలబెడతా. జరగబోయే పరిణామాలకు అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.''అని హెచ్చరించారు. అనంతరం తదుపరి కార్యాచరణపై పెద్దపల్లి జిల్లా నేతలతోపాటు పార్టీ రాష్ట్ర నాయకులతో చర్చలు జరుపుతున్నారు.

# 42 శాతం బిసి రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చాలి : బి ఎల్ పి కామారెడ్డి జిల్లా కమిటి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 10: బిసిలకు 42శాతం విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన



కమ్యూనిస్టు)బిఎల్పిరాష్ట్ర కమిటి పిలుపు మేరకు సోమవారం బిఎల్ పి కామారెడ్డి జిల్లా కమిటి, ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు దర్నా చేసి కలెక్టర్ లేనందున జె సి, కి వినతిపత్రం అందజేసినారు, ఈ విషయం కేంద్ర ప్రభుత్వానికి వినతి పత్రాన్ని పంపించాలని విజ్ఞప్తి చేశారు. బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్పి అనంతరం బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యస్, సిద్దిరాములు, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు, నాగారపు యెల్లయ్య, జిల్లా కార్యదర్శి, వడ్ల సాయి కృష్ణ మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మార్చి 2025 లో బిసి కులాల ప్రజలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర అసెంబ్లీలో బిల్లులను ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర గవర్నర్ లకు పంపి 7 నెలల అవుతున్న కేంద్ర ప్రభుత్వం వద్ద గత 7 నెలలుగా పెండింగ్ లోనే ఉన్నదన్నారు. ఈ నేపథ్యంలో

రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బిసి బిల్లులను 9వ షెడ్యూల్ లో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని

కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్ పి రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ఈ కింద పేర్కొన్న విధంగా డిమాండ్స్ తో కూడిన వినతిపత్రాన్ని పంపాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు.

1. కేంద్ర ప్రభుత్వం వద్ద 7 నెలలుగా పెండింగ్ లో 42% బిసి కులాల ప్రజలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల బిల్లులను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చి పార్లమెంట్ లో చట్టం చేయాలి,
2. 42% బిసి కులాల రిజర్వేషన్లలో ఏ.బి.సి.డి, ఈ వర్గీకరణతో చట్టం చేయాలి,
3. కామారెడ్డి బిసి డిక్లరేషన్ ప్రకారం సంవత్సరానికి రూ 20 వేల కోట్ల బిసి కులాల ప్రజల విద్య ఉద్యోగ ఉపాధి కోసం రెండు సంవత్సరాలకుగానూ వెంటనే 40,000 వేల కోట్ల రూపాయలు విడుదల చేయాలి,
4. రాష్ట్రంలోని నిర్మాణ రంగం తోపాటు అన్ని రకాల ప్రభుత్వ కాంట్రాక్టులలో బిసి కులాల ప్రజలకు వర్గీకరణతో కూడిన 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి,
5. రాష్ట్రంలోని అన్ని నామినేటెడ్ పదవుల్లో 90% బిసి,ఎస్సీ, ఎస్టీల తోనే భర్తీ చేయాలని దండి వెంకట్ డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ జిల్లా నాయకులు స్వామి, గంగాధర్, గంగమణీ, స్వప్న, లక్ష్మి, చిన్న లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# గణితంలో డాక్టర్ స్వప్న దాచేపల్లికి పీహెచ్డీ

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 10 :

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని స్వప్న దాచేపల్లి డాక్టరేట్ కు అర్హత సాధించారు. మైక్రోపోలార్, నానో ఫ్లూయిడ్ సమస్యలపై వేడి, ద్రవ్యరాశి బదిలీ విశ్లేషణ యొక్క గణన పరిష్కారాలు అనే అంశంపై



ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.గోవర్ధన్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ స్వప్న అసాధారణ పరిశోధన గణిత శాస్త్ర రంగానికి, ముఖ్యంగా సంక్లిష్ట ద్రవ ప్రవాహ వ్యవస్థల కోసం గణన పద్ధతులను అభివృద్ధి చేయడంలో గణనీయమైన కృషిని సూచిస్తోందన్నారు. పారిశ్రామిక ప్రక్రియలు, బయోమెడికల్ ఇంజనీరింగ్, థర్మల్ మేనేజ్మెంట్ సిస్టమ్ లలో సంభావ్య అనువర్తనాలతో మైక్రోపాలార్, నానోఫ్లూయిడ్ల ప్రవర్తనపై విలువైన అంతర్దృష్టులను అందిస్తుందని తెలియజేశారు.ఈ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. గీతం విద్యా నైపుణ్యం, అత్యాధునిక పరిశోధన సంస్కృతిని పెంపొందించడమే గాక, ఈ విజయం భవిష్యత్తు పరిశోధకులను పెంపొందించడంలో విశ్వవిద్యాలయం యొక్క నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు.

# కవిత జనం బాట ఒక మోసపూరితం

## -పదేళ్లలో చేసిన తప్పులకు క్షమాపణ చెప్పాలి

## -జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అజీమ్ హెచ్చరిక

కరీంనగర్, నవంబర్10 (భారతశక్తి ప్రతినిధి):



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేస్తున్న జనం బాట ఒక మోసపూరితమని జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్ ఆరోపించారు.గత పదేళ్ళు అధికారంలో ఉంది చేసిన తప్పులను తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పకనే బాట చెయ్యాలని లేదంటే ఈ గడ్డ మీద తిరుగనియ్యమని అజీమ్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో హెచ్చరించారు. అప్పుడు ప్రజల వద్దకు రాలేదు, ప్రజల సమస్యలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. జనం బాట కేవలం, వసూళ్ల కోసమేనా అని మండిపడ్డారు. జైలుకు వెళ్లి వచ్చి మళ్లీ కొత్త తరం నాయకులను డబ్బులతో కొనుక్కొని, ప్రజల ఉనికిని చాటుకోవడానికి బీసీ వాదం పేరిట రాష్ట్రవ్యాప్తంగా జనం బాట పట్టరాని ఆరోపించారు.టిఆర్ఎస్ అధికారంలో దర్జాగా పదవులు అనుభవించిన కల్వకుంట్ల కవిత టిఆర్ఎస్ కు నాకు ఎలాంటి సంబంధం లేదనీ వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు. రాసుకున్న స్క్రిప్ట్ లో భాగం గానే ఎవరిని కలవాలో ముందే రూపొందించుకుంటూ అసలు బాధితులను, పేద ప్రజలను కలవడం లేదనీ ఎద్దేవ చేశారు. హంగు హర్భాటలు చేసే ఇళ్లలో బస చేస్తే ఎవరు నమ్ముతారు.? అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలను క్షమాపణ కోరి జనం లోకి రావాలని, లేనిపక్షంలో ఈ గడ్డమీద తిరుగనిచ్చే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

# కష్టపడి పండించిన పంటను దళారులకు అప్పగించొద్దు: టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి,నవంబర్ 10 :



కంది,సంగారెడ్డి మండలాలలో వనకాలం వడ్ల కొనుగోలు కేంద్రాలను టిజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ప్రారంభించారు,ప్రతి రైతు వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని,కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అప్పగించొద్దని,తెలంగాణ ప్రభుత్వం వడ్లకు మద్దతు ధర ఇస్తుందని,ఏ గ్రేడ్ 2389, సాధారణ రకం గ్రేడ్ 2369, సన్నవడ్లకు 2389 బోనస్ 500, మొత్తం 2889 గా ఇస్తుంది,కావున ప్రతి ఒక్క రైతు వడ్ల కొనుగోలు కేంద్రాలనుఉపయోగించుకోవాలని అన్నారు.బోనస్ కు కావలసిన పత్రాలు, కొత్త పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్ బుక్, ఆధార్ కార్డ్ ఉండాలని సూచించారు.ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్,ప్రభాకర్ రెడ్డి,తాళ్లపల్లి మాజీ సర్పంచ్ ప్రవీణ్ కుమార్,మాజీ ఉపసర్పంచ్ హషం,లక్ష్మారెడ్డి, ప్రభుత్వ అధికారులతో పాటు, రైతులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా కవి అందెశ్రీ మరణం తెలంగాణ సమాజానికి తీరనిలోటు: టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 10 :



తెలంగాణ ప్రజా కవి అందెశ్రీ మరణంపై టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ప్రజాకవి రచయితగా అందెశ్రీ తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్య పరచిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. ఆయన పాట ఎప్పటికీ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోతుందన్నారు. తెలంగాణ ఉద్యమానికి అందెశ్రీ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం తెలంగాణ యావత్ సమాజానికి తీరని లోటని అభివర్ణించారు. ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.

# ప్రజాకవి అందెశ్రీ మృతి పై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సంతాపం

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 10 :

తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ గీత



రచయిత ప్రజాకవి అందెశ్రీ మృతి పై సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సంతాపం వ్యక్తం చేశారు. తన రచనలు పాటలతో యావత్ తెలంగాణ సమాజాన్ని చైతన్యపరిచిన గొప్పకవి అందెశ్రీ అని అన్నారు. ఆయన మరణం తెలంగాణ ప్రజలను శోకసముద్రంలో ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని ఆకాంక్షించారు.

# 12 ఏళ్లుగా నష్టపరిహారం ఇవ్వకుండా అధికారుల కాలయాపన.

**-పట్టా భూములు ఉన్న కనికరం చూపడం లేదు.**

**- మాజీ పట్వారి తమ భూములను ఆగం చేశాడు.**

**- న్యాయం చేయాలని కెటిపిపి భూ నిర్వాసిత బాధితులు.**

భూపాలపల్లి (భారత శక్తి) నవంబరు 10:



భూమిని నమ్ముకొని కష్టపడి పని చేసుకుంటే కేటీపీలో భూమి తీసుకొని భూ నష్ట పరిహారం ఇవ్వకపోవడంతో బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని గణపురం మండలం చెల్పూర్

గ్రామానికి చెందిన సుమారు 15 మంది రైతులు 2012 సంవత్సరంలో కోల్డ్ హాండింగ్ ప్లాంట్ కోసం 38 ఎకరాల తీసుకున్నారు. అట్టి భూమికి నేటికీ పరిహారం అందకపోవడంతో అధికారుల చుట్టూ భారత రైతులు తిరిగి తిరిగి నానా ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా కలెక్టర్కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం పాల్త రైతులు దిడ్డి రాజయ్య, గొడుగు శంకర్ బండి తిరుపతి పోచయ్య తదితరులు విలేకరులతో మాట్లాడారు. కేటీపీపిలో తమ భూములను తీసుకొని పరిహారం అందించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చెబుతున్నారని పేర్కొన్నారు. అంతేకాక తమ భూములలో తమ తండ్రులు పట్టాదారులుగా నేటికీ దరినిలో ఉన్నప్పటికీ మాజీ పట్వారి కావాలని కొంతమంది వద్ద డబ్బులు తీసుకొని తమ భూముల పేరు మీద రెండు గుంటలు ఐదు గంటల చొప్పున కేవలము పహానిలో రాసి తమ కన్యాయం చేశారని అన్నారు ఈ విషయంలో తాము కోర్టుకు, జెన్కో సిఎండి వద్దకు వెళ్లగా తమ భూమిపై మోకా కొలతలు కొలిచి తమకే హక్కు వచ్చినప్పటికీ ఏడాదికాలంగా తాసిల్దార్, ఆర్డీవో కార్యాలయం జిల్లా కలెక్టర్కు కలిసిన గోడును తమ ఫైళ్లను ముందుకు నడవకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. అంతేగాక సదరు మాజీ పట్వారి తమ భూములను మా సర్వే నెంబర్లు ఎలాంటి భూమి లేని వారికి ఇద్దరికీ అక్రమంగా పహానీలో చేర్చడం ఎంతవరకు సమంజసమని అన్నారు. వీటన్నిటిపై విచారణ జరిపి మోకాకొలత కొలువగా, పట్టాకాలంలో సైతం నేటికీ తమ తండ్రుల పేర్లతో వస్తున్నాయని వారసత్వంగా తమకు న్యాయంగా నష్టపరిహారం అందించాలని లేనియెడల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తాము ఆందోళనకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.


# ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలి: కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి (భారత శక్తి) అక్టోబర్ 10:

సోమవారం ఐడిఓసి కార్యాలయంలో శిక్షణా సివిల్ సర్వీసెస్ అధికారులు, విద్యా, వైద్య, వ్యవసాయ, మహిళా, శిశు సంక్షేమ, వయోవృద్ధుల సంక్షేమ, డిఆర్డీఓ, ప్రణాళిక శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ శిక్షణా అధికారులు గ్రామీణ ప్రాంతాల వాస్తవ పరిస్థితులపై ప్రత్యక్ష అనుభవం అవసరమని, అందుకోసం ఫీల్డ్ లెవల్ ఫంక్షనరీలతో సమన్వయం, గ్రామాలలోని ప్రజలతో నేరుగా ఇంటరాక్షన్ జరగాలని సూచించారు. సేవలు, సంక్షేమ పథకాల అమలు, సమస్యల గుర్తింపు, తక్షణ పరిష్కారంపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. పలిమెల, మహా ముత్తారం మండలాల్లో అధికారులతో కలిసి ప్రాంతాలను సందర్శించి మహిళా సంఘాలు, రైతులు, యువతతో ఇంటరాక్షన్ కావాలని సూచించారు. పలిమెల, మహా ముత్తారం మండలాలను నీతి ఆయోగ్ యాస్పిరేషన్ బ్లాకులుగా ప్రకటించిందని, ఐదు సెక్టారులుకు సంబంధించి 49 ఇండికేటర్లు, 81 పారామీటర్లు నిర్దేశించినట్లు తెలిపారు. జిల్లాలో 76 శాతం అడవులు విస్తరించి ఉన్నాయని వివరించారు. 12 మంది అధికారులు రెండు బృందాలుగా పలిమెల, మహా ముత్తారం మండలంలో పర్యటన చేయనున్నారని, ఇట్టి పర్యటనకు సంబంధించి నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, సమస్యలు, అవసరాలను తెలుసుకుని ఆచరణలోకి తీసుకువెళ్లే విధంగా యంత్రాంగానికి సూచనలు చేయాలని సూచించారు. అధికారుల పర్యటనకు స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్వీసెస్ అధికారులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వైద్యాధికారి డా మధుసూదన్, డీఈఓ రాజేందర్, వ్యవసాయ అధికారి బాబూరావు, డిఆర్డీఓ బాల కృష్ణ, సీపీఓ బాబూరావు, సంక్షేమ అధికారి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించండి: హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



ఉమ్మడి వరంగల్ బ న్యా ంో ( బ. ా ం ్ త ్ శక్తి)నవంబర్10:ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిలకు అర్జీలను అందజేశారు. ప్రజలు వినతి పత్రాలను అందజేస్తూ సమస్యలను కలెక్టర్ కు తెలియజేయగా ఓపిగ్గా విన్నారు. వెంటనే సంబంధిత అధికారులను ప్రజలు అందించిన వినతులపై పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలు పెండింగ్ లో లేకుండా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, హౌసింగ్, ఇతర శాఖలకు సంబంధించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు 158 అర్జీలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, డి ఆర్ డి ఓ మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, సిపిఓ సత్యనారాయణరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ సీతారామారావు

సూర్యాపేట,భారత శక్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 10:

ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కే. సీతారామారావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలనుండి అర్జీలను స్వీకరించారు.



ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, తేమ శాతం 17 రాగానే కాంటా వేసి లారీల ద్వారా మిల్లులకు ఎగుమతి చేయాలని అలాగే ట్యాబ్ లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి కార్యాలయంలో ప్రజావాణిలో వచ్చే దరఖాస్తుల కొరకు ఒక రిజిస్టర్ ఏర్పాటు చేసుకొని ప్రతి దరఖాస్తును నమోదు చేయాలని అలాగే దరఖాస్తు యొక్క స్టేటస్ ని లబ్ధిదారులకు తెలియజేయాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబంధించి 26 దరఖాస్తులు, ఇరిగేషన్ శాఖ కు సంబంధించి 4, సంక్షేమ అధికారికి 3, ఎంపిడిఓ లకి 2 మిగిలిన 9 దరఖాస్తులు ఇతర శాఖలకి సంబంధించి వచ్చాయని మొత్తం 44 ధరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకి పంపించటం జరిగిందని వాటిని వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశించారు. డిఆర్ డిఎ పిడి వివి అప్పారావు, డి ఎఫ్ ఓ సతీష్ కుమార్, డి పి ఓ యాదగిరి, డి ఇ ఓ అశోక్, సి పీ ఓ కిషన్, డి డబ్ల్యూ ఓ నరసింహారావు, సంక్షేమ అధికారులు శంకర్, శ్రీనివాస్, నరసింహారావు, దయానందరాణి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, హౌజింగ్ పీడీ సిద్ధార్థ, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల్లో బరోసా నింపాలి

### -ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి
### -తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులకు అండగా ఉండాలి
### -వీడియో కాన్ఫరెన్స్ మంత్రులు ఉత్తమ్, తుమ్మల



కరీంనగర్, నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు, పంట నష్టపోయిన రైతులకు అండగా ఉంటూ, కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్లతో మంత్రులు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాలుగు నెలల పాటు ఎండనక వాననక నిద్ర హారాలు మాని పంటలు పండించిన రైతులకు ఇటీవల తుఫాను పెను విషాదం నింపిందని ఆ విషాదం నుంచి రైతులకు భరోసా కల్పించేందుకు అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. రైతులు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు పడకుండా జిల్లా కలెక్టర్లు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రులు ఆదేశించారు. కరీంనగర్ కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రులు జిల్లా కలెక్టర్లకు కీలక ఆదేశాలు ఇచ్చారు. మంత్రులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1,10,000 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని బాధలో ఇబ్బందుల్లో ఉన్న రైతులకు జిల్లా కలెక్టర్లు అధికారులు అండగా నిలవాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు వరి, పత్తి మొక్కజొన్న సోయా పంటలకు తేమ శాతాన్ని తగ్గించుకొని రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరను పొందాలని పేర్కొన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వెంటవెంటనే కొనుగోలు చేపడుతూ డబ్బులు 48 గంటల్లో అందజేయాలని ఆదేశించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు అధికారులు తరచూ కొనుగోలు కేంద్రాల సందర్శిస్తూ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. మౌలిక సౌకర్యాలు వసతులు కల్పన విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తూ కొనుగోలు సజావుగా సాగేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అత్యంత ముఖ్యంగా నవంబర్ నెలలో సజావుగా కొనుగోలు జరిగేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో టర్పొలిన్ కవర్లు గన్ని బ్యాగులు ప్యాడి క్లీనర్లు సిద్ధంగా ఉండేలా చూసుకోవాలన్నారు.

**కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాల**

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు సౌకర్యాలు సరిగా ఉండేలా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం సాయంత్రం మంత్రుల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వీటిలో అన్ని వసతులు సౌకర్యాలు ఎల్లప్పుడు ఉండేలా చూసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. టార్పాలిన్ కవర్లు గన్ని బ్యాగులు తాగునీరు ప్యాడి తేమ చూసే మిషన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఒకవేళ వర్షాలు కురిస్తే అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు నష్టం జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రజనీకాంత్ వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి డిఆర్డిఓ శ్రీధర్ సహకార అధికారి రామానుజ చార్యులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 10 (భారతశక్తి): జూలూరుపాడులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)ను సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సందర్శించారు. ఈ సందర్శనలో ఆయన విద్యార్థినులతో ఆత్మీయంగా మాట్లాడి, వారి విద్యా స్థాయి, వసతి, భోజనం మరియు రోజువారీ జీవన విధానం గురించి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, భోజనశాల, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలను పరిశీలించారు. ప్రత్యేకంగా వంటగదిలో వంట కోసం ఉపయోగించే సామాగ్రిని, వంట పాత్రలను, పదార్థాల నిల్వ పద్ధతులను, ఆహార తయారీ సమయంలో పాటిస్తున్న పరిశుభ్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజన నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, వారితో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భాగంగా కలెక్టర్ తరగతి గదిలో విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని విద్యా సదుపాయాలు కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులు ప్రశాంతమైన, భద్రమైన వాతావరణంలో చదువుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, శ్రద్ధ, పట్టుదలతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలను సాధించాలని ప్రోత్సహించారు. విద్యార్థుల అభ్యాసంలో ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టి, వారిని పోటీ ప్రపంచానికి సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని, మౌలిక సదుపాయాల పరంగా ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచే దిశగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట బోధన బోధ నేతల సిబ్బంది, విద్యార్థులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గీతా కార్మికులకు ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా చెల్లించాలి

**-స్కిల్ యూనివర్సిటీలో గీతాకర్మికులకు కోర్సులను ప్రవేశ పెట్టాలి**

**-గీతపనివారల సంఘం రాష్ట్ర కో - కన్వీనర్ నాగభూషణంగౌడ్**

కరీంనగర్, నవంబర్10(భారతశక్తి ప్రతినధి):

రాష్ట్రంలో కల్లుగీత వృత్తిపై ఆధారపడి లక్షలాదిమంది జీవిస్తున్నారని, గీత కార్మికులకు ప్రభుత్వం ఎక్స్ గ్రేసియా చెల్లించాలని గీతపనివారల సంఘం రాష్ట్ర కో.కన్వీనర్ బొమ్మగాని నాగభూషణం గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం కరీంనగర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో న్యాలపట్ల రాజుగౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత వృత్తిదారులు నిరంతరం సమస్యలతో సతమతమవుతున్నారని, చెట్లపై నుండి ప్రమాదవశాత్తు పడిపోతే,కాళ్ళు చేతులు విరిగి ప్రాణాలకే ప్రమాదం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సరైన నిధులు కేటాయించకపోవడంతో గీత పరిశ్రమ ఆధునీకరణకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గీత కార్మికులు చెట్ల పైనుండి పడి మరణిస్తే వారికి ప్రభుత్వం వెంటనే ఎక్స్ గ్రేషియా తక్షణమే విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు., గీత వృత్తి రక్షణ మృతి ధరల సంక్షేమం అధునీకరణ వన పెంపకాలకు 10 ఎకరాల భూమి ఇవ్వాలని, వృత్తి రక్షణ కోసం రక్షణ కవచాలు పంపిణీ చేయాలని కోరారు. సహకార సంఘాలకు ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీ లో గీతా కార్మికులకు ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టాలని ఏజెన్సీ జిల్లాలలో గీత వృత్తిదారులకు సొసైటీలు ఏర్పాటు చేసి టిఎఫ్టిలు ఇవ్వాల్సిన అవసరముందని అన్నారు. ఐదు లక్షల నుండి పది లక్షలకు గాయాల పాలైతే రెండు లక్షలు పెంచాలని మెడికల్ బోర్డు విధానం రద్దు చేయాలని, ప్రభుత్వ



సివిల్ అసిస్టెంట్ సర్జన్ పర్యవేక్షణలో తాత్కాలిక శాశ్వత వికలాంగుల నిర్ధారణ సర్టిఫికెట్ల పద్ధతిని తిరిగి పునరుద్ధరించాలని, కల్లుగీత సహకార సంఘాలు టిఎఫ్టిలకు శాశ్వతమైన లైసెన్సు అర్హులైన వారికి గుర్తింపు కార్డులు వృత్తి పరికరాలు అందించాలని కోరారు.ప్రతి సొసైటీకి టిఎఫ్టిలకు గ్రామాల వారీగా మన పెంపకమునకు 560 జీవో ప్రకారం ఐదు నుండి పది ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని డిమాండ్ నాగభూషణం చేశారు. కరీంనగర్ జిల్లాలో గీతా పనివారల సంఘాన్ని బలోపేతం చేయడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు గొడిసెల తిరుపతి గౌడ్, పైడిపల్లి రాజుగౌడ్, బండారుపల్లి తిరుపతిగౌడ్, నేరెళ్ల సదానందంగౌడ్, తాళ్ల పెల్లి చంద్రయ్యగౌడ్,మాదారపు రత్నాకర్ గౌడ్,బుర్ర మల్లయ్యగౌడ్,రాములుగౌడ్ బుర్ర అశోక్గౌడ్, రంగు శ్రీనివాస్ గౌడ్,కుమార్,మార్క శ్రీకాంత్ గౌడ్, అశోక్ గౌడ్,రాజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా తమ్మిడికుంట పునరుద్ధరణ

# ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్న హైడ్రా

## పనులను పరిశీలించిన కమిషనర్

హైదరాబాద్, నవంబర్ 10 (భారత శక్తి):

ఐటీ కారిడార్.. మాదాపూర్‌లో మరో ఆకర్షణ ప్రజలకు అందుబాటులోకి రానుంది. మురుగు నీటిని.. దుర్గంధాన్ని వదిలించుకుని సహజ సరస్సుగా తమ్మిడికుంట రూపొందుతోంది. ముళ్లపొదలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, మీటర్ల మేర పేరుకుపోయిన పూడికను తొలగించి చెరువుకు సహజత్వాన్ని హైడ్రా అందించింది. చెరువులో ఆక్రమణలతో పాటు.. పూడికను తొలగించి విస్తీర్ణం పెంచడంతో ఇప్పుడా పరిసరాలు ఎంతో విశాలంగా మారాయి.శిల్పారామం వైపు ప్రధాన ప్రవేశ మార్గంతో నయన మనోహరంగా మారుతోంది. ఈ అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చెరువు చుట్టూ పటిష్టమైన బండ్ నిర్మాణంతో పాటు.. ఇన్‌లెట్లు, ఔట్‌లెట్ల నిర్మాణ పనులు జరుగుతున్న తీరును తనిఖీ చేశారు.ఐటీ కారిడార్లో ఉన్న ఈ చెరువును ఓ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. శిల్పారామం వద్ద వరద నీరు నిలవకుండా ఇన్లెట్లను అభివృద్ధి చేయాలని సూచించారు. 14 ఎకరాల చెరువును 29 ఎకరాలకు విస్తరించడం జరిగిందని.. అదే విస్తీర్ణంలో నీరు నిలిచేలా చెరువు అభివృద్ధి చేయాలని సూచించారు.

సందర్శకులు సేద దీరేలా..

దేశం నలుమూలల నుంచి వచ్చిన ఐటీ నిపుణులు నడయాడే ప్రాంతం ఇది. అత్యధిక జనసాంద్రత ఉన్న ప్రాంతం కూడా ఇదే.. ఇలాంటి చోట ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని హైడ్రా కమిషనర్ సూచించారు. తమ్మిడికుంటలో స్వచ్ఛమైన నీరు



ఎంత ముఖ్యమో.. ఆ పరిసరాలు కూడా అంతే పరిశుభ్రమైన వాతావరణంలో ఉండడానికి చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు చుట్టూ దాదాపు 2 కిలోమీటర్ల మేర ఉన్న బండ్‌పై ప్రాణ (ఆక్సిజన్) వాయువు అందించడంతో పాటు.. చల్లటి నీడనిచ్చే చెట్లు పెంచాలన్నారు. చెరువు ప్రధాన ప్రవేశ మార్గంలో పార్కులను అభివృద్ధి చేయాలని సూచించారు.అన్ని వయసుల వారూ తమ్మిడికుంట పరిసరాలకు వచ్చి సేదదీరే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పిల్లలకు ఆటవిడుపుగా క్రీడా స్థలాలను తీర్చిదిద్దాలన్నారు. వృద్ధులు కూర్చునేందుకు వీలుగా చట్టూ సిమెంట్,రాతి కుర్చీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఓపెన్ జిమ్‌లు, కొద్దిమంది కూర్చొని ప్రశాంతంగా మాట్లాడుకోడానికి వీలుగా గుమ్మటాలు ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కమిషనర్ ఎన్ అశోక్ కుమార్ హైడ్రా ఏసీపీ శ్రీకాంత్ తో పాటు పలువురు అధికారులు హైడ్రా కమిషనర్ వెంట ఈ సందర్శనలో ఉన్నారు.

# మేడిపల్లిలో సిటీ ట్రైనింగ్ సెంటర్ శంకుస్థాపన చేసిన డిజిపి శివధర్ రెడ్డి, సిపి సుధీర్ బాబు..




రాచకొండ, నవంబర్ 10 (భారత శక్తి):

కొత్త సిటీ ట్రైనింగ్ సెంటర్ శంకుస్థాపన చేసిన రాచకొండ పోలీసులకు శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి. ఇక్కడ పూర్తి స్థాయి ట్రైనింగ్ బిల్డింగ్ రాచకొండ కమిషనరేట్ పరిధిలో లేకుండే..దివిస్ ల్యాబొరేటరీ వారు సోషల్ రెస్పాన్స్ తీసుకొని బిల్డింగ్ నిర్మిస్తున్నారు..సీటీసీ లో డెకాయ్, రాబరీ, క్రైమ్ లతో పాటు సైబర్ క్రైమ్ కి సంబంధించి అన్ని ఇక్కడ అందుబాటులో ఉంటాయి..ఎక్కడో కూర్చుని సెల్ ఫోన్ తో ఏదో చేయొచ్చు,ఓటీపీల ద్వారా , మోసాలు జరుగుతున్నాయి..



వేల కోట్ల సైబర్ ఫ్రాడ్ జరుగుతుంది. గత రెండు సంవత్సరాల నుండి సైబర్ సెక్యూరిటీపై అవగాహన అదనంగా అధికారులను పెట్టి భద్రత కల్పిస్తున్నాం..నైపుణ్యం కావాలి అంటే ఇలాంటి సీటీసీలు ఉండాలి అన్ని జిల్లాలో కూడా సెంటర్లు పెట్టి శిక్షణ ఇస్తాం..

రోడ్డు సేఫ్టీపై కూడా అధికారులకు శిక్షణ ఉంటుంది...రోడ్డు సేఫ్టీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు పబ్లిక్...రోడ్లపై ఇష్టానుసారంగా డ్రైవింగ్ చేస్తున్నారు..రోడ్డుపై వెళ్ళేవారు లెఫ్ట్ ఇండికేటర్ వేసి లెఫ్ట్ కి వెళ్తారు అది కరెక్ట్ కాదు, లెఫ్ట్ కి వెళ్తే రైట్ ఇండికేటర్ వెయ్యాలి..దీనిపై రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పిస్తాం...రోడ్డు అంటే రేస్ చేసే గ్రౌండ్ కాదు...

అలైవ్ అనే పేరుతో స్పెషల్ ప్రోగ్రామ్ పెట్టబోతున్నాం..సిపి సుధీర్ బాబు

రాచకొండ నూతన కమిషనరేట్ బిల్డింగ్ పక్కనే సిటీ ట్రైనింగ్ సెంటర్ ఉంటుంది...కమిషనరేట్ 56 ఎకరాల్లో కడుతున్నాం.ఇంకా పనులు జరుగుతున్నాయి..4 కోట్ల వ్యయంతో సీటీసీని శంకుస్థాపన చేశాం..కింది స్థాయి నుండి ఈ సీటీసీలో ట్రైనింగ్ ఉంటుంది..దివిస్ ల్యాబొరేటరీ వారికి, భవనం నిర్మిస్తున్నారు వారికి ధన్యవాదాలు..

# నిర్మల్ జిల్లాలో తొలి శాశ్వత డాగ్ కెన్నెల్ కు శ్రీకారం

**-నేరాల అన్వేషణలో, భద్రతా వ్యవస్థలో జాగిలాల సేవలు అమూల్యం**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 10 (భారత శక్తి):నిర్మల్ జిల్లా ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు శాశ్వత డాగ్ కెన్నెల్ (డాగ్ కెన్నెల్) లేకపోవడంతో, పోలీస్ విభాగంలో శ్వానదళం(జాగిలాల దళం) ఏర్పాటుకు అవసరమైన సదుపాయాలు లేవు. అయితే జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ప్రత్యేక శ్రద్ధతో ఉన్నతాదికారుతో మాట్లాడి నిర్మల్ జిల్లాకు శాశ్వత డాగ్ కెనల్ ఏర్పాటు చేయించే దిశగా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో, నేడు నిర్మల్ జిల్లా కొత్తగా నిర్మిస్తున్న పోలీసు ప్రధాన కార్యాలయం సమీపంలో డాగ్ కెన్నెల్ నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమం జరిగింది. జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ స్వయంగా భూమి పూజలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఏర్పడిన నాటి నుండి నిర్మల్‌లో శాశ్వత డాగ్ కెన్నెల్ లేదు. నేరాల అన్వేషణలో, పేలుడు పదార్థాల గుర్తింపులో, మరియు పోలీసు శిక్షణా కార్యక్రమాలలో జాగిలాలు కీలక పాత్ర పోషిస్తాయి.శాశ్వత డాగ్ కెన్నెల్ ఏర్పాటుతో నిర్మల్ పోలీస్ శాఖకు సాంకేతికంగా, ఆపరేషనల్‌గా బలాన్ని చేకూర్చుతుంది," అని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ తెలిపారు. లి"ఇది నిర్మల్ పోలీస్ శాఖ అభివృద్ధిలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది,"లి అని పేర్కొన్నారు.వీలయినంత తొందరగా కెన్నెల్ పూర్తి చేయాలని కాంట్రాక్టర్ మరియు ఏ.ఈ అనిల్ కి సూచించారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రధాన కార్యాలం మరియు నివాస గృహాల పనుల మీద సమీక్ష నిర్వహించారు. ఈ నెల లో నివాస గృహాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు ఇన్స్పెక్టర్ లు గోవర్ధన్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, కృష్ణ, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రామ్ నిరంజన్ రావు, శేఖర్, రమేష్, రామ కృష్ణ , ఎస్ఐ లు ఆర్.ఎస్ఐ లు ఏఈ అనిల్, కాంట్రాక్టర్, జిల్లా డాగ్ స్క్వాడ్ సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం: జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 10 (భారత శక్తి) సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.



ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు.బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.

# ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి:జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి (భారత శక్తి) అక్టోబర్ 10: సోమవారం ఐడిఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పరిష్కార నిమిత్తం ఎండార్స్మెంట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 41 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సమస్యలను విని వెంటనే పరిష్కారం చూపించడం లక్ష్యంగా ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణికి వచ్చిన 41 మంది దరఖాస్తుదారులతో కలెక్టర్, మీ సమస్య చెప్పండని అడిగి తెలుసుకుని దరఖాస్తు పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు ఎండార్స్మెంట్ చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను సమయానికి పరిష్కరించడం అన్ని శాఖల బాధ్యత అని ఆయన తెలిపారు.



ప్రతి ఫిర్యాదును జాగ్రత్తగా నమోదు చేసి, పరిష్కారం వరకు అధికారులు పర్యవేక్షించాలని, అవసరమైతే ఫీల్డ్ పరిశీలనలు కూడా చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ రవి అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం వికటించి 26 మంది విద్యార్థుల అస్వస్థత

**-జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు**

**-జిల్లా కలెక్టర్ కు ఫోన్ లో పరామర్శించిన కేంద్ర మంత్రి బండి**

కరీంనగర్, నవంబర్10(భారతశక్తి ప్రతినిధి):

జమ్మికుంట పట్టణంలోని బాలికల పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం భోజనం వికటించి 26 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఉపాధ్యాయులు హుటా హుటిన అస్వస్థతకు గురైన విద్యార్థులను జమ్మికుంటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వారికి వైద్య పరీక్షలు చేయించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితినీ కేంద్ర మంత్రి బండి సంజయ్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకొని విద్యార్థులను పరామర్శించారు.విద్యార్థులకు సరైన వైద్యం అందజేసి వారినీ కాపాడాలనీ ఆదేశించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ జిల్లా ప్రధాన ఆసుపత్రి తరలించాలని కలెక్టర్ ను కోరారు.




విద్యార్థుల పరిస్థితి తెలుసుకున్న స్థానిక బీజేపీ నాయకులు ఆకుల రాజేందర్, పొనగంటి రవికుమార్, కైలాసకోటి గణేష్, ఆకుల తిరుపతి తదితరులు జమ్మికుంట ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తీసుకున్నారు.వెంటనే వారు కోలుకోవాలని కోరారు.

# దుమ్ము, దూళి నివారణ చర్యలు చేపట్టాలి. - ప్రజల ఆరోగ్యాలను కాపాడాలి.

మణుగూరు, నవంబర్ 10 (భారతశక్తి): మణుగూరు రైల్వే బ్రిడ్జి దగ్గర నుండి బి.టి.పి.ఎస్ వరకు రోడ్డు డ్యామేజ్ అయిన దగ్గర బీటీ వేసి ప్యాచి వర్క్ లు చేయాల్సి ఉండగా అలా చేయకుండా రోడ్డు వెంబడి మట్టి, యాష్ కంకర పోయడం వలన ఆ ప్రాంతం నుండి వాహనాల రాకపోకల సందర్భంగా విపరీతమైన దుమ్ము లేస్తూ, ఆ ప్రాంతం గుండా ప్రయాణించే ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి సోమవారం ప్రకటన లో తెలిపారు. ఆ దుమ్ము, ధూళి పీల్చడం వలన దగ్గు, జలుబు, ఊపిరితిత్తులకు సంబంధించిన రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజల ఆరోగ్యాల పట్ల, ప్రాణాల పట్ల ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు స్పందించి కనీసం దుమ్ము లేవకుండా వాటర్ చల్లించి దుమ్ము నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఇదే విధంగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే పార్టీ ఆధ్వర్యంలో కలిసి వచ్చే అందర్నీ కలుపుకొని వాహనాల రాకపోకలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

# జిల్లా కేంద్రంలోని ఈవిఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 10: ప్రతీ నెల తనిఖీలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఈవియం గోదాంను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తనిఖీ చేసి సిసి కెమెరాలను పరిశీలించారు.



ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓ వీణ, తహసిల్దార్, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# తుక్కుగూడ పురపాలక సంఘానికి వండర్ లా సంస్థ నుండి విపత్తు నిర్వహణ వాహనం బహూకరణ

తుక్కుగూడ, మహేశ్వరం నవంబర్ 10 (భారత శక్తి ప్రతినిధి): తుక్కుగూడ పురపాలక సంఘం పరిధిలోని వండర్ లా అమ్యూజ్‌మెంట్ పార్క్ వారు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా సోమవారం పురపాలక సంఘానికి విపత్తు నిర్వహణ వాహనంను అందజేశారు. సందర్భంగా పురపాలక సంఘం కమిషనర్ శ్రీమతి ఏ. వాణి మాట్లాడుతూ, ఈ వాహనం విపత్తు నిర్వహణ, భారీ వర్షాల సమయంలో అత్యవసర చర్యలు, పారిశుద్ధ్య




కార్యకలాపాలు వంటి సందర్భాల్లో పురపాలక సంఘానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజా సేవల మెరుగుదలకు విలువైన సహకారం అందించిన వండర్ లా సంస్థ ప్రతినిధులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ మేనేజర్ డి. సౌమిక్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మల్లేష్, పార్క్ హెడ్ మధుసూదన్, పార్క్ హెడ్ రాంబాబు, హె. చ. హెడ్ రతీష్ మౌళి, జి.ఆర్ ఎగ్జిక్యూటివ్స్ మధు, సత్యనారాయణ చారి, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ప్రశాంత్ పాల్గొన్నారు.





# శాంతి భద్రతల సమస్య లేదు

* **బాధితులకు భరోసా ఇచ్చేందుకే కౌన్సిలింగ్ కేంద్రం**
* **రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి**

ఎల్బీనగర్, నవంబర్ 10 (భారత శక్తి): రాష్ట్రంలో ఎలాంటి శాంతి భద్రతల సమస్య లేదని, ప్రశాంత వాతావరణం నెలకొని ఉందని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సరూర్‌నగర్ డివిజన్ జింకల బావి కాలనీలోని మహిళా పోలీసు స్టేషన్ ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్, భరోసా కేంద్రాలను రాచకొండ కమిషనర్ సుధీర్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. లైంగిక వేధింపులు, అత్యాచారాలు, గృహ హింస, ర్యాగింగ్, దూషణ, వంటి వాటికి గురైన బాధితులు ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టులో కేసు నిలబడే విధంగా చేసేందుకే ఈ భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ భరోసా కేంద్రంలో న్యాయవాదులు సహా వ్యక్తిత్వ వికాస నిపుణులు, కౌన్సిలర్లు సహాయ సహకారాలు అందజేయనున్నారని



చెప్పారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషారాణి మాట్లాడుతూ, బాధితులు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయాలని, భరోసా కేంద్రం వీరికి అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీజీపీఐసీఎస్ ఎండీ ఎం.రమేష్, ఎల్బీనగర్ డీసీపీ బి.అనురాధ, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఎస్పీ షైక్ సలీమా, ఏసీపీ పి.వెంకటేశ్వర్లు, ఇన్స్పెక్టర్లు ఎం.ముని, జి.అంజయ్య తదితర రాచకొండ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చట్టం ముందు అందరూ సమానమే



* **నిరుపేదలకు కూడా న్యాయ సహాయం అందాలి**
* **జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా... ప్రముఖ న్యాయవాది... కిక్కర గోపి శంకర్ యాదవ్ .**

ఎల్బీనగర్, నవంబర్ 10 (భారత శక్తి): ప్రతీ సంవత్సరం నవంబర్ 9 వ తేదీ నాడు జాతీయ లీగల్ ఎయిడ్ డే జరుపుకుంటారని. దీని ద్వారా సమాజంలో మారు మూల ప్రాంతాలలో జీవిస్తున్న బడుగు, బలహీన వర్గాలకు న్యాయం సమానంగా అందేలా చూడటం వారి హక్కులు ఎలా వినియోగించుకోవాలి, ఎవరికి సంప్రదించాలి, సలహాలు ఏ విధంగా తీసుకోవాలి అనే అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని ప్రముఖ న్యాయవాది, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్, హయత్ నగర్ కోర్ట్ బార్ అసోసియేషన్ సభ్యుడు కిక్కర గోపీ శంకర్ యాదవ్ తెలిపారు. అనేక సంవత్సరాలు నుండి న్యాయ స్థానాల్లో మగ్గి పోతున్న ఎన్నో కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే.. ఉత్తమమైన మార్గం ఉందని, రాజీ పడటం ద్వారా ఇరువర్గాలు గెలిచినట్లే అని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రం అన్ని జిల్లాలో 400 కు పై చిలుకు ఉచిత న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు.

# గణేష్ మహారాజ్ దర్శనం కోసం పాదయాత్ర

ఎల్బీనగర్, నవంబర్ 10 (భారత శక్తి): దైవ దర్శనం కోసమే కుమారుడితో కలిసి 140 కిలోమీటర్లు పాదయాత్ర చేసి దేవుడిని దర్శించుకున్న భక్తులు. సరూర్ నగర్ డివిజన్ జింకల బావి కాలనీ నివాసి ప్రైవేట్ ఉద్యోగి సంతోష్ భాల్కి తన కుమారుడు లక్కీతో కలిసి దైవ దర్శనం కోసం జహీరాబాద్ దగ్గర ఉన్న రేజింతల్ గ్రామంలోని గణేష్ మహారాజ్ దేవాలయానికి సుమారు 140 కిలోమీటర్లు 3 రోజులు, 2 రాత్రులు నడుచుకుంటూ వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. అనంతరం నిన్న రాత్రి నగరానికి చేరుకున్న వారికి కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు ఘనంగా స్వాగతం పలికారు.



# కన్నుల పండుగగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

ఎల్బీనగర్, నవంబర్ 10 (భారత శక్తి): సరూర్ నగర్ డివిజన్ లోని వెంకటేశ్వర కాలనీ, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో 41వ బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితులు నల్లాన్ చక్రవర్తుల లక్ష్మణ చారి, వంశీదరా చార్యులు, రామకృష్ణమా చార్యులు, ఎస్.శ్యాంసుందర్ ల వేధోచ్చరణల మధ్య స్వామి వారి కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమంలో హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి విచ్చేసి అనుగ్రహ భాషణతో అనుగ్రహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేశారు. దేవాలయ ప్రాంగణం మొత్తం భగవన్నామ స్మరణతో మారుమ్రోగింది. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. అంతకుముందు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టు



వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరుపోలు భాస్కర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు, ఆలయ మాజీ చైర్మన్ గండు ధనం రెడ్డి, ఆలయ ప్రధాన కార్యదర్శి మడకశిర శాంతిప్రసాద్, కోశాధికారి మురళీ కౌండిన్య, కమిటీ సభ్యులు విజయ్ కుమార్, శ్రీమన్నారాయణ, భోగేశ్వర్ రావు, సుబ్బారావు, సత్యనారాయణ మూర్తి, శ్రీనివాస్ రావు, ప్రతాప్ రెడ్డి, ఆలయ సభ్యులు రవీందర్ రావు, వీరేందర్ రెడ్డి, సుధాకర చారి, నరేష్ , యాదగిరి రెడ్డి, ఎం.ఎన్.రావు, పివిఎస్ ప్రసాద్, సాయి కృష్ణ, కాలనీ ప్రధాన కార్యదర్శి కనకరావు, ఉపాధ్యక్షుడు మారోజు శ్రీనివాస చారి, కోశాధికారి సాయికిరణ్, కృష్ణ మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

# పార్కుల నామరూపాలు మార్చేస్తున్నారు

* **ఫెన్సింగ్ వేసి కాపాడాలంటూ విన్నపాలు**
* **హైడ్రా ప్రజావాణికి 47 ఫిర్యాదులు**

హైదరాబాద్, నవంబర్ 10, భారత శక్తి : పార్కుల నామరూపాలు లేకుండా చేస్తున్నారు. పార్కుల్లో ఆలయాలు నిర్మించేసి.. ఆ పక్కనే చిన్న మళ్లీలు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. లే ఔట్‌లలో పార్కులకోసం కేటాయించిన స్థలాలన్నిటికీ ఫెన్సింగ్‌లు వేసి కాపాడాలంటూ పలువురు సోమవారం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే ప్రభుత్వ స్థలాలకు కూడా కాపాడాలని కోరారు. అమీన్‌పూర్ పెద్దచెరువు, రావిర్యాల చెరువుల విస్తీర్ణం ఏటా పెరుగుతూ.. ఎగువ భాగంలో ఉన్న నివాసాలను ముంచెత్తుతున్నాయని ఆయా ప్రాంతాల వారు ఫిర్యాదు చేశారు. మూసేసిన తూములు తెరిపించడంతో పాటు.. అలుగు ఎత్తును కూడా తగ్గించాలని పలువురు కోరుతున్నారు. గతంలో వ్యవసాయ వినియోగం వల్ల నీటి నిలువలు తగ్గేవని.. ఇప్పుడు మురుగు నీటితో నిండి ఎగువన ఉన్న ప్రాంతాలు మునుగుతున్నాయని వాపోయారు. ఓల్డ్ అల్వాల్ సర్వే నంబరు 576లో క్వారీకోసం తవ్విన గుంతల్లో మురుగు నీరు చేరి పరిసరాలన్నీ దుర్గంధభరితంగా మారాయని గంగ అవెన్యూ రెసిడెంట్స్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ గుంతలను మట్టితో పూడ్చి పార్కులుగా అభివృద్ధి చేయాలని కోరారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 47 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా అదనపు కమిషనర్ శ్రీ ఎన్ అశోక్ కుమార్‌గారు పరిశీలించి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.



* **ఫిర్యాదులు ఇలా..**

>>మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం మచ్చబొల్లారం గ్రామం సర్వే నంబరు 188లో 30 గుంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురౌతోందని బాలాజీ ఎన్‌క్లేవ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. 60 కాలనీలలో 60 వేలకు పైగా ఇళ్లున్న ఈ ప్రాంతంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మించేందుకు ఈ భూమిని కేటాయించేలా సిఫారసు చేయాలని కోరారు. ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూడాలని కోరారు.

>>సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పెద్ద చెరువు విస్తీర్ణం ఏటా పెరిగిపోయి ఎగువన ఉన్న తమ ప్లాట్లు మునిగిపోయాయని పలువురు ఫిర్యాదు చేశారు. గతంలో తూముల ద్వారా కిందకు నీరు వెళ్లేదని.. ఇప్పుడు వాటిని పూర్తిగా బంద్ చేయడంతో మురుగు, వర్షం నీరంతా చెరువులోకి చేరుతోందని పేర్కొన్నారు. అలుగు ఎత్తును కూడా పెంచేయడంతో మరింత ఇబ్బంది తలెత్తిందని వాపోయారు. అలుగు ఎత్తు తగ్గించినా తమకు ప్రయోజనం కలుగుతుందని చెరువు పైభాగంలో ఉన్న పలు లే ఔట్‌లలోని ప్లాట్ యజమానులు తెలిపారు. గతంలో వేసిన రహదారులు, విద్యుత్ స్తంభాలు నీట మునిగినట్టు స్పష్టంగా కనబడుతున్నాయని ఈ విషయంలో ప్రభుత్వం సరైన విధానాన్ని పాటించి చెరువు వాస్తవ విస్తీర్ణం నిర్ణయించాలని 7 కోరారు. ఇదే పరిస్థితి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని రావిర్యాల విలేజ్‌లో కూడా ఉందని అక్కడ నివాసితులు ఫిర్యాదు చేశారు.

>>రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల విలేజ్‌లో తెలంగాణ హౌసింగ్ బోర్డు కాలనీలో ఖాళీ స్థలాలు మాయమౌతున్నాయని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. 545 ప్లాట్లతో ఉన్న ఈ లే ఔట్‌లో ఉన్న ఖాళీ స్థలాలు కబ్జాలకు గురి అవుతున్నాయి. పార్కుల్లో మందిరాలు కడుతున్నారు. షెడ్డులు వేసి అద్దెలకు ఇస్తున్నారు. రోడ్లు బ్లాక్ చేసి ఇష్టానుసారం ఖాళీ స్థలాలు కాజేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

>>ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని బాగ్‌లింగంపల్లి డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీలో పిల్లల పార్కు కబ్జాకు గురైంది. 1300ల గజాల స్థలంలో స్టీల్, ఐరన్ దుకాణాలు, సర్వీసింగ్ సెంటర్లు పెట్టి వ్యాపారం చేసుకుంటున్నారని.. ఈ కబ్జాలను తొలగించాలని హౌసింగ్ బోర్డు, జీహెచ్ ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని అక్కడి నివాసితులు వాపోయారు. వ్యాపార దందాలు ఆపి.. పార్కును కాపాడాలని హైడ్రాకు విన్నవించారు.

# అనాథ గృహ విద్యార్థులకు రూ.55 వేల రేషన్ విరాళం

ఎల్బీనగర్, నవంబర్ 10 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతి అసెంబ్లీలో జాయింట్ సెక్రటరిగా పనిచేస్తున్న పివి సుబ్బారెడ్డి సోమవారం ఎల్బీనగర్ లోని అనాథ గృహ విద్యార్థులకు నవంబర్ నెల రేషన్ కు రూ.55 వేల రేషన్ ను విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా ప్రతి నెలా కొంత



డబ్బును, అనాథ విద్యార్థి గృహానికి ఒక నెల రేషన్ కోసం రూ. 50 వేల ఇస్తున్నానని, గృహ విద్యార్థులు చాలా కష్టపడి చదువుతూ ఉన్నతస్థాయిలకు చేరుకోవాలని, ఈ సంవత్సరం కూడా గృహ కమిటీకి సహకరించాలని రూ. 55 వేల రేషన్ బియ్యం, పప్పులు, ఆయిల్స్, షుగర్, శానిటరీ ఐటమ్స్ ఇంకా అవసరమైన సరుకులను నవంబర్ నెల కోసం పంపించామని తెలిపారు. గృహ విద్యార్థుల అత్యవసరమైన రేషన్ కొరకు రూ.55 వేల రూపాయల రేషన్ ను విరాళంగా ఇచ్చిన పివి సుబ్బారెడ్డికి, గృహ అధ్యక్షులు మార్గం రాజేష్, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# కేసీఆర్ బాధతో కుమిలిపోతున్నారు... ఆయనను చూస్తుంటే సానుభూతి కలుగుతోంది

హైదరాబాద్, నవంబర్ 10 (భారత శక్తి): బీఆర్ఎస్ కాలగర్భంలో కలిసిపోతున్న పార్టీ అని, దాని వ్యాలిడిటీ పీరియడ్ అయిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను రాజకీయ విమర్శల కోసం ఈ మాటలు చెప్పడం లేదని, ఒకప్పుడు తెలంగాణలో బలంగా ఉన్న తెలుగుదేశం పార్టీ ఇప్పుడు ఎలా కనుమరుగైందో బీఆర్ఎస్ పరిస్థితి కూడా అలాగే మారుతుందని జోస్యం చెప్పారు. కేసీఆర్‌తోనే ఆ పార్టీ ప్రస్థానం ముగిసిపోతుందని అన్నారు. కేసీఆర్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదని, ఆ బాధతోనే ఆయన ఇంటి నుంచి బయటకు రావడం లేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని ఆ పార్టీ అధినేతగా కేసీఆర్ ఇప్పటివరకు ప్రజలను కోరకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. "ఆరోగ్య సమస్యల వల్ల ఆయన ప్రచారానికి రాలేకపోవచ్చు. కానీ, కనీసం పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఒక ప్రకటన కూడా ఇవ్వడం లేదు. దీన్నిబట్టి కేటీఆర్, హరీశ్‌రావుపై ఆయనకు ఎలాంటి అభిప్రాయం ఉందో అర్థం చేసుకోవచ్చు" అని వ్యాఖ్యానించారు. తన కళ్ల ముందే పార్టీ కూలిపోతుంటే కేసీఆర్ దుఃఖంతో కుమిలిపోతున్నారని, ఆయన్ను ప్రత్యర్థిగా కాకుండా సానుభూతితో చూడాల్సిన పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆత్మహత్య చేసుకుని బీజేపీకి అవయవదానం చేసిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ సహకారం వల్లే బీజేపీ 8 సీట్లు గెలుచుకుందని, ఆ సీట్లే నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడానికి ఉపయోగపడ్డాయని అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీన ప్రక్రియ మొదలైందని కేసీఆర్ కుమార్తె కవితే స్వయంగా చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. 2004 నుంచి 2014 వరకు కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీయే రైతుల సంక్షేమానికి, హైదరాబాద్ అభివృద్ధికి బాటలు వేసిందని రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు గోదావరి జలాలు రావడానికి నాటి సీఎల్పీ నేత పీజేఆర్ చేసిన పోరాటమే కారణమని గుర్తుచేశారు. ఐటీ, ఫార్మా హబ్‌గా హైదరాబాద్ మారడానికి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే పునాది వేశాయన్నారు. ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలతో సంక్షేమం, అభివృద్ధిని కాంగ్రెస్ సమన్వయం చేసిందని పేర్కొన్నారు. ఈ చరిత్ర కేసీఆర్ చెరిపేస్తే చెరిగిపోయేది కాదన్నారు. ఆనాటి పదేళ్ల కాంగ్రెస్ పాలనను, కేసీఆర్ పదేళ్ల పాలనను బేరీజు వేసుకోవాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## అందెశ్రీ మృతిపై
# ప్రధాని నరేంద్ర మోదీ స్పందన

ఢిల్లీ, నవంబర్ 10 (భారత శక్తి): ప్రముఖ కవి, జన వాగ్గేయకారుడు అందె శ్రీ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం మన సాంస్కృతిక, మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు అని అభివర్ణించారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం ఆయన సంతాప సందేశాన్ని విడుదల చేసింది. అందె శ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయని మోదీ కొనియాడారు. "అందె శ్రీ మరణం మన సాంస్కృతిక, మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు. ఆయన ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయి. ఒక గొప్ప కవి, మేధావి అయిన ఆయన, ప్రజల పోరాటాలకు, ఆకాంక్షలకు, అకుంఠిత స్ఫూర్తికి గొంతుకగా నిలిచారు. ఆయన పదాలకు హృదయాలను కదిలించే శక్తి, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను ఏకం చేసే శక్తి, ప్రజల సామూహిక హృదయస్పందనకి రూపం ఇచ్చే శక్తి ఉన్నాయి. ఆయన సామాజిక స్పృహను, సాహితీ సౌందర్యంతో మిళితం చేసిన విధానం అద్వితీయం. వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఓం శాంతి" అంటూ మోదీ తన ప్రకటనలో పేర్కొన్నారు.

# మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్

హైదరాబాద్, నవంబర్ 10 (భారత శక్తి): టీమిండియా మాజీ కెప్టెన్, తెలంగాణ మంత్రి అజారుద్దీన్ ఈరోజు తన శాఖల బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో, ముస్లిం మత పెద్దల ప్రార్థనల మధ్య ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కేటాయించిన మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల మంత్రిగా అధికారికంగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ గురుతర బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్‌కు పలువురు అధికారులు, నేతలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. గత నెల 31వ తేదీన అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. రాజ్‌భవన్‌లో ఆయన చేత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. అనంతరం నవంబర్ 4వ తేదీన అజారుద్దీన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైనార్టీ సంక్షేమ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలను అప్పగించారు. తాజాగా ఆయన ఈ శాఖల బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

హైదరాబాద్, నవంబర్ 10 (భారత శక్తి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం ప్రారంభం కానున్న పోలింగ్ కోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. యూసఫ్‌గూడలోని డీఆర్‌సీ సెంటర్‌లో ఈసీ అధికారులు సిబ్బందికి ఈవీఎంలను, పోలింగ్ స్టేషన్లను కేటాయించారు. ఎన్నికల సిబ్బంది సాయంత్రం లోగా పోలింగ్ స్టేషన్లకు చేరుకుంటారు. జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈసారి డ్రోన్ల ద్వారా సెక్యూరిటీ మానిటరింగ్ ఉంటుందని కర్ణన్ తెలిపారు. ప్రతి అభ్యర్థికి ఒక్కో పోలింగ్ ఏజెంట్ పాస్‌ను అందించినట్లు ఆయన పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై తెలంగాణ రాష్ట్రం మొత్తం ఆసక్తిగా ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఓటర్లు ఎవరికి పట్టం కడతారో ఈ నెల 14న తేలనుంది.

## ఢిల్లీలో భారీ పేలుడు...
# పలు నగరాల్లో హై అలర్ట్ ప్రకటించిన కేంద్ర హోంశాఖ

ఢిల్లీ, నవంబర్ 10 (భారత శక్తి): దేశ రాజధాని ఢిల్లీ భారీ పేలుడుతో దద్దరిల్లింది. ఎర్రకోట సమీపంలోని రద్దీ ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఓ కారులో శక్తివంతమైన పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో 8 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 24 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో మహారాష్ట్ర రాజధాని ముంబైతో పాటు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. దేశంలోని పలు నగరాల్లో కేంద్ర హోంశాఖ హై అలర్ట్ ప్రకటించింది. వివరాల్లోకి వెళితే.. చాందినీ చౌక్ మెట్రో స్టేషన్ సమీపంలో ఈ పేలుడు జరిగినట్లు డిప్యూటీ చీఫ్ ఫైర్ ఆఫీసర్ ఏకే మాలిక్ తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే సుమారు 20 ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. రాత్రి 7:29 గంటల సమయానికి మంటలను అదుపులోకి తెచ్చినట్లు ఆయన వెల్లడించారు. పేలుడు తీవ్రతకు సమీపంలోని మూడు, నాలుగు వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన సమీపంలోని లోక్‌నాయక్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే 8 మంది మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. పేలుడు చాలా పెద్ద శబ్దంతో సంభవించిందని, భారీ అగ్నిగోళం ఎగిసిపడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనా స్థలంలోని దృశ్యాలు పేలుడు తీవ్రతను తెలియజేస్తున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే ఉగ్రవాద నిరోధక దళం (యాంటీటెర్రర్ స్క్వాడ్), ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ బృందాలు రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించాయి. పర్యాటకులు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనతో ముంబై, ఉత్తర ప్రదేశ్ అప్రమత్తమయ్యాయి. ముంబైలోని కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు భద్రతా వర్గాలు తెలిపాయి. అదేవిధంగా, యూపీలోని అన్ని జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. సున్నితమైన ప్రాంతాల్లో గస్తీ, తనిఖీలను పెంచాలని లక్నో నుంచి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.



## ముమ్మరంగా తమ్మిడికుంట పునరుద్ధరణ
# ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్న హైడ్రా

*** పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్**

హైదరాబాద్, నవంబర్ 10: భారత శక్తి : ఐటీ కారిడార్.. మాధాపూర్‌లో మరో ఆకర్షణ ప్రజలకు అందుబాటులోకి రానుంది. మురుగు నీటిని.. దుర్గంధాన్ని వదిలించుకుని సహజ సరస్సుగా తమ్మిడికుంట రూపొందుతోంది. ముళ్లపొదలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, మీటర్ల మేర పేరుకుపోయిన పూడికను తొలగించి చెరువుకు సహజత్వాన్ని హైడ్రా అందించింది. చెరువులో ఆక్రమణలతో పాటు.. పూడికను తొలగించి విస్తీర్ణం పెంచడంతో ఇప్పుడా పరిసరాలు ఎంతో విశాలంగా మారాయి. శిల్పారామం వైపు ప్రధాన ప్రవేశ మార్గంతో నయనమనోహరంగా మారుతోంది. ఈ అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చెరువు చుట్టూ పటిష్టమైన బండ్ నిర్మాణంతో పాటు.. ఇన్‌లెట్లు, ఔట్‌లెట్ల నిర్మాణ పనులు జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. ఐటీ కారిడార్లో ఉన్న ఈ చెరువును ఓ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలను హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. శిల్పారామం వద్ద వరద నీరు నిలవకుండా ఇన్లెట్లను అభివృద్ధి చేయాలని సూచించారు. 14 ఎకరాల చెరువును 29 ఎకరాలకు విస్తరించడం జరిగిందని.. అదే విస్తీర్ణంలో నీరు నిలిచేలా చెరువు అభివృద్ధి చేయాలని సూచించారు.

*** సందర్శకులు సేదదీరేలా..**


దేశం నలుమూలల నుంచి వచ్చిన ఐటీ నిపుణులు నడియాడే ప్రాంతం ఇది. అత్యధిక జనసాంద్రత ఉన్న ప్రాంతం కూడా ఇదే.. ఇలాంటి చోట ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని హైడ్రా కమిషనర్ సూచించారు. తమ్మిడికుంటలో స్వచ్ఛమైన నీరు ఎంత ముఖ్యమో.. ఆ పరిసరాలు కూడా అంతే పరిశుభ్రమైన వాతావరణంలో ఉండడానికి చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు చుట్టూ దాదాపు 2 కిలోమీటర్ల మేర ఉన్న బండ్‌పై ప్రాణ (ఆక్సిజన్) వాయువు అందించడంతో పాటు.. చల్లటి నీడనిచ్చే చెట్లు పెంచాలన్నారు. చెరువు ప్రధాన ప్రవేశమార్గంలో పార్కులను అభివృద్ధి చేయాలని సూచించారు. అన్ని వయసుల వారూ తమ్మిడికుంట పరిసరాలకు వచ్చి సేద దీరేవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పిల్లలకు ఆటవిడుపుగా క్రీడా స్థలాలను తీర్చిదిద్దాలన్నారు. వృద్ధులు కూర్చునేందుకు వీలుగా చట్టూ సిమ్మెంట్, రాతి కుర్చీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఓపెన్ జిమ్‌లు, కొద్దిమంది కూర్చొని ప్రశాంతంగా మాట్లాడుకోడానికి వీలుగా గుమ్మటాలు ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కమిషనర్ శ్రీ ఎన్ అశోక్ కుమార్ గారు, హైడ్రా ఏసీపీ శ్రీకాంత్ గారితో పాటు పలువురు అధికారులు హైడ్రా కమిషనర్ వెంట ఈ సందర్శనలో ఉన్నారు.

# మళ్లీ పరుగులు పెడుతున్న బంగారం, వెండి ధరలు..
## రూ.1.22 లక్షలు దాటిన 10 గ్రాముల పసిడి

ఢిల్లీ, నవంబర్ 10 (భారత శక్తి): బంగారం, వెండి ధరలు ఇవాళ భారీగా పెరిగాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, వచ్చే నెలలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలు బులియన్ మార్కెట్‌కు కొత్త ఊపునిచ్చాయి. దేశీయ మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (MCX)లో ఉదయం 10 గంటల సమయంలో బంగారం ధర 1.16 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,22,468కి చేరింది. అదేవిధంగా వెండి ధర 1.99 శాతం వృద్ధితో కిలోకు రూ.1,50,666 వద్ద ట్రేడ్ అయింది. అక్టోబర్‌లో రికార్డు స్థాయికి చేరిన తర్వాత కొంత తగ్గుముఖం పట్టిన పసిడి ధరలు, మళ్లీ పుంజుకున్నాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ పనితీరుపై పెరుగుతున్న ఆందోళనలు, వచ్చే నెలలో వడ్డీ రేట్ల కోత ఉండొచ్చన్న అంచనాలు పసిడికి డిమాండ్ పెంచుతున్నాయి. మెహతా ఈక్విటీస్‌కు చెందిన కమొడిటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రీ ప్రకారం గత వారం మొత్తం ధరలలో తీవ్ర ఒడుదొడుకులు కనిపించినా, అమెరికాలో వినియోగదారుల సెంటిమెంట్ బలహీనపడటం, ప్రభుత్వ షట్‌డౌన్‌పై నెలకొన్న అనిశ్చితి కారణంగా ధరలు తిరిగి కోలుకున్నాయి. అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ రికార్డు స్థాయికి చేరడం ఆర్థిక వ్యవస్థపై ఆందోళనలను మరింత పెంచిందని, దీంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు పెట్టుబడిదారులు మళ్లుతున్నారని ఆయన వివరించారు. మరోవైపు డాలర్ ఇండెక్స్ బలహీనపడటం కూడా బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణమైంది. ఇదిలా ఉంటే.. ముడి చమురు ధరలు కూడా ఈరోజు పుంజుకున్నాయి. బ్యారెల్ డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 60 డాలర్ల మార్కును దాటింది. ఒపెక్, ఐఈఏ నుంచి వెలువడనున్న నివేదికల కోసం ట్రేడర్లు ఎదురుచూస్తున్నారు. అయితే, ఒపెక్ దేశాలు ఉత్పత్తి పరిమితులను సడలించడం, అమెరికా ఉత్పత్తిని పెంచడం వంటి కారణాలతో సరఫరా మిగులుపై అంచనాలు మార్కెట్‌ను మిశ్రమంగా ఉంచుతున్నాయి.

# పుట్టపర్తికి ప్రధాని మోదీ రాక నేపథ్యంలో పటిష్ఠ ఏర్పాట్లు..

అమరావతి, నవంబర్ 10 (భారత శక్తి): పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. ఈ ఉత్సవాలకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ నెల 19న ప్రధానమంత్రి, 22న రాష్ట్రపతి పుట్టపర్తి పర్యటన ఖరారైనందున భద్రతాపరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) విజయానంద్, ఇతర ఉన్నతాధికారులతో సత్యసాయి శత జయంతి వేడుకల నిర్వహణపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని పనిచేయాలన్నారు. ప్రధాని, రాష్ట్రపతి సహా ఇతర ప్రముఖుల పర్యటనలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు మంత్రుల కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. పుట్టపర్తి పట్టణాన్ని సుందరంగా అలంకరించాలని,



పారిశుద్ధ్య నిర్వహణలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

**భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు**

సత్యసాయి మహాసమాధి దర్శనం కోసం దేశ, విదేశాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటం అధికారుల ప్రథమ కర్తవ్యమని సీఎం అన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించి, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా చూడాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భక్తుల కోసం అవసరమైనన్ని ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. ముందుజాగ్రత్త చర్యగా వైద్య సేవలను సిద్ధం చేయాలని, పుట్టపర్తి వ్యాప్తంగా 10 వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు.

*** రవాణా, ఇతర ఏర్పాట్లపై అధికారుల నివేదిక**

సీఎం ఆదేశాల మేరకు ఇప్పటికే చేపట్టిన చర్యలను అధికారులు సమావేశంలో వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేకంగా 250 మంది సిబ్బందిని నియమించామని, భక్తులకు తాగునీరు, ఆహారం, మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని, ఈ నెల 13 నుంచి డిసెంబర్ 1 వరకు 65 ప్రత్యేక రైళ్లతో సహా మొత్తం 682 రైళ్లను పుట్టపర్తికి నడుపుతున్నట్లు వివరించారు. పుట్టపర్తి రైల్వే స్టేషన్ నుంచి బస్ స్టేషన్‌కు భక్తుల సౌకర్యార్థం రోజుకు 20 బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు సవిత, సత్యకుమార్ యాదవ్, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రేవంత్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందా..?

**రాజకీయ దురంధరుడు కేసీఆర్ ని మట్టికరిపించి, తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీని గద్దె నెక్కించిన డైనమిక్ లీడర్ రేవంత్ రెడ్డి.. ఎలాంటి కష్టం లేకుండానే తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారు అన్నది పలువురి వాదన.. కానీ ఆయన ఈ స్థాయికి ఎదగడానికి ఎంతో కృషి చేశారు అన్నది వాస్తవం.. తొలుత ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తగా ఆయన వేసిన అడుగు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి చేరింది.. విషయం పరిజ్ఞానం, వాగ్ధాటి కలిగిన యువనాయకుడైన రేవంత్ రెడ్డి, ఏ మంత్రి పదవి చేపట్టకున్నా.. ఉంటున్న పార్టీని వదిలి కాంగ్రెస్ లోకి వచ్చి, అనతి కాలంలోనే ఆ పార్టీని అధికారంలోకి తీసుకునివచ్చి, ముఖ్యమంత్రి కాగలిగాడు.. ముఖ్యమంత్రి కాగానే ఎన్నో పథకాలు రూపకల్పన చేశాడు.. తాను ప్రచారంలో చెప్పినట్టుగా పలు పథకాలు మొదలుపెట్టారు కూడా..? అయితే ఆరంభ శూరత్వం అన్నట్టుగా.. ఆరంభింతురు నీచమానవులు అనికూడా అన్నట్టు.. పథకాలైతే ఎంతో ఘనంగా మొదలైయ్యాయి.. కానీ అవి సక్రమంగా సాగుతున్నాయా..? అన్నది అనుమానాస్పదమే.. అంతే కాకుండా మొదటినుంచి రేవంత్ రెడ్డి అంటే గిట్టని స్వపక్ష నాయకులు ఆయనపై గుర్రుగా ఉన్నారన్నది నిర్వివాదాంశం.. ఆయనపై తిరగబడటానికి కూడా పథక రచనలు కూడా చేస్తున్నారన్న వార్తలు వస్తున్నాయి.. అయితే తమతో కానీ పనిని రేవంత్ చేశాడు కదా..? అన్న ఆలోచన కూడా ఆ నాయకుల్లో లేకపోలేదు.. ఇక విపక్షాలు రేవంత్ పై విరుచుకు పడుతున్నాయి.. అర్హతలేని వ్యక్తిని సీఎం ని చేశారని, అనుభవం లేకుండా పరిపాలన చేస్తున్నాడని, కోతి చేతికి కొబ్బరిచిప్ప ఇచ్చారని, అవినీతి ఏరులై పారుతోందని, రేవంత్ సోదరులు పరిపాలనలో జోక్యం చేసుకుంటున్నారని, అలాగే డబ్బు పెట్టెలు ఢిల్లీకి పంపించి తొలుత పీసీసీ ఆ తరువాత సీఎం పదవిని కొనుక్కున్నాడని విమర్శిస్తున్నారు.. ఇందులో ఎంత వాస్తవం ఉందన్నది ఇప్పటికిప్పుడు చెప్పలేము కానీ, జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రేవంత్ కు సవాల్ గా మారిందని చెప్పవచ్చు..**






- **ఎవరూ చేయనటువంటి అభివృద్ధి చేశాడంటున్న కాంగ్రెస్ నాయకులు..**
- **అనుభవా రాహిత్యంతో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తున్నాడంటున్న విపక్షాలు..**
- **డివైడ్ టాక్ సొంతం చేసుకున్న రేవంత్ పరిపాలన..**
- **ఒకవైపు దూసుకుపోతూనే అవినీతికి కొమ్ముకాస్తున్నాడంటూ విమర్శలు..**
- **స్వపక్షంలోనే విపరీతమైన వ్యతిరేకత ఉందంటున్న విశ్లేషకులు..**
- **ఏది ఏమైనా స్వర్గీయ వై.ఎస్. తరువాత కాంగ్రెస్ ను నిలబెట్టింది రేవంతే..**
- **అదే అభిప్రాయం అధిష్టానంలో స్థిరస్థాయిగా నిలిచిపోయిందా..?**
- **సోనియా అల్లుడు రాబర్ట్ వధేరా కోసం రేవంత్ ఓ ప్రాజెక్టు చేస్తున్నాడా..?**
- **విపక్షాల విమర్శల్లో వాస్తవం ఎంత..? ఇది కేవలం ఊహాగానాలేనా..?**
- **మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో రేవంత్ దోపిడీకి తెరలేపాడా..?**
- **నేడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరుగుతున్న సందర్భంగా " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " అందిస్తున్న స్పెషల్ స్టోరీ..**

**(స్పెషల్ కరస్పాండెంట్)**

**హైదరాబాద్, నవంబర్ 10 (భారత శక్తి) :** రేవంత్ ప్రభుత్వంలో పాజిటివ్ అంశాలను ఒకసారి గమనిస్తే.. ప్రభుత్వం రాష్ట్రంలో "ఇంటింటి కుటుంబ సర్వే అంటూ పెద్ద సామాజిక గణన కార్యక్రమాన్ని పూర్తిచేసినట్టు ప్రకటించింది. సుమారు 1.16 కోట్ల కుటుంబాల వివరాలు సేకరించి విజయవంతంగా ఇంటింటి సమగ్ర సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు.. ఇదొక అనుకూల అంశంగా నిలిచింది.. ఇక ఉద్యోగుల కోసం పెద్ద స్థాయిలో బీమా/పెంచన్ వంటి సంక్షేమ నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.. ఇది కూడా మరో అనుకూల అంశమే..

*** ఇక విపక్షాల విమర్శలు.. నెగటివ్ అంశాలు ఒకసారి చూద్దాం :**

ప్రత్యక్షంగా "ప్రభుత్వం పూర్తిగా సక్సెస్ అయింది" అన్న విషయం మాత్రం ఎక్కడా కనిపించడం లేదు.. వినిపించడం లేదు.. ఎవరు కూడా ఎలాంటి అభిప్రాయం వెలువడలేదు.. దీనిపై మిశ్రమ అభిప్రాయాలు మాత్రం వెలువడుతున్నాయి.. ఏ తీర్మానమూ సరిగా లేదని, చేసిన వాగ్ధానాలు నెరవేర్చడంలో కాలయాపన చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. "ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ సర్కార్ దగా చేస్తున్నదని" అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించడం చూసాం..

ఎన్నికలకు సమీపించే చోట "ప్రచారంలో మధ్యంతర ఆఫర్లు, వాగ్దానాలు హైప్ అవుతుండగా, కానీ అమలు తీరుపై ఆందోళనలు నెలకొంటుండం" లాంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి.. మొత్తానికి చెప్పుకోవాలనిఉంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మిక్స్‌డ్ రివ్యూ ఉంది.. కొన్ని సంక్షేమ విధానాలు ప్రజల్లో సానుకూల భావనలు కలిగిస్తున్నా, ఇంకా కొన్నికీలక అంశాల్లో ఆశించిన స్థాయికి చేరలేదని భావించే వర్గాలు ఉన్నాయి. దీనితో రేవంత్ రెడ్డి విజయం వైపు ఇంకా తప్పటడుగులు వేస్తున్నాడని చెప్పవచ్చు..

**జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పరిస్థితి :**

నేడు ఎన్నిక జాగుతుండగా లెక్కింపు నవంబర్ 14న జరుగుతుంది.. అన్ని పార్టీలు ప్రచార సమయంలో బిజీగా ఎవరి ప్రచారం వారు చేసుకున్నారు.. ఓట్లు శాతం.. ధోరణులపై సర్వేలు కూడా విడుదలయ్యాయి. అయితే కొందరు ఈ ఎన్నిక రేవంత్ రెడ్డి పాలనకు రెఫరాండం అని వాదిస్తుండగా ఇది కేవలం సాధారణ ఉపఎన్నిక మాత్రమే దీని ఫలితాన్ని రేవంత్ పరిపాలనకు రేవరాండం గా చూడలేము అని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కొన్ని క్లియర్ చిహ్నాలు ఉన్నాయి - పెద్ద సామాజిక సర్వేలు, సంక్షేమ నిర్ణయాలు మొదలైనవి. కానీ ఇంకా "పూర్తిగా విజయవంతం" అన్న విశ్లేషణ మాత్రం బలంగా వినిపించడం లేదన్నది స్పష్టంగా తెలుస్తుంది..

రేవంత్ రెడ్డికి కలిసొచ్చే అంశాలు కూడా కొన్ని వున్నాయి.. యువతలో పాజిటివ్ ఇమేజ్.. ధైర్యంగా మాట్లాడే స్టైల్.. ప్రత్యేకంగా IT/స్టార్టప్ లలో యాక్టివ్ గా ఉండటం.. హైదరాబాద్ పై అటెన్షన్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ట్రాఫిక్ రీఫార్మ్స్) ఇవి యువతలో సపోర్ట్ పెంచుతున్న అంశాలు..

అలాగే మధ్యతరగతి, సమీక్షాత్మక దృక్కోణం కూడా ప్లస్ అయ్యింది..

అయితే విద్యుత్, ధరలు, పన్నులపై స్పష్టత లాంటి వ్యవహారాల్లో మిక్సుడు టాక్ వినిపిస్తోంది.. ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్‌లపై సరైన తీరు కనిపించడం లేదని, వేగం తక్కువగా ఉందని కొంతమంది నిరాశచెందుతున్నారు.. అయితే "ఓపెన్ గవర్నెన్స్", "ట్రాన్స్‌పరెన్సీ" దిశగా అడుగులు వేస్తున్నారనే భావన కూడా ఉంది..

ఇక రైతుల విషయానికొస్తే, ఇక్కడ కూడా భిన్నాభిప్రాయాలు వెలువడుతున్నాయి..నీటి ప్రాజెక్టులు, సాగునీటి పంపకాలలో క్రమబద్ధత కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తుందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.. రైతు ఆర్థిక పరిస్థితి స్థిరపడడానికి ఇంకా కొన్ని చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు ఉన్నాయి..

ఇక ప్రభుత్వ ఉద్యోగులపై కొన్ని మంచినిర్ణయాలు తీసుకుంటున్నా.. పీ.ఆర్.సి., ఐ.ఆర్.., పెన్షన్ తదితర అంశాలపై ఇంకా క్లారిటీ లేదన్నది నిర్వివాదాంశం.. ఇకపోతే బిఆర్ఎస్‌కు బలంగా ఉన్న ప్రాంతాల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది.. బీఆర్ఎస్ కేడర్ హై ఎమోషనల్‌గా ఉన్న ప్రాంతాల్లో ప్రతికూల స్పందన కనిపిస్తోంది..



**మొత్తం మీద ప్రజాభిప్రాయం ఏమిటి..?**

చురుకైన ముఖ్యమంత్రి గా తిరుగులేని ఇమేజ్.. అవినీతి వ్యతిరేక అటిట్యూడ్.. అడ్మినిస్ట్రేషన్‌పై కంట్రోల్ చూపించే ప్రయత్నం.. హైదరాబాద్ డెవలప్మెంట్‌కు ప్రాధాన్యం.. కొత్త విధానాలు అంటే ఏ 1, స్టార్టప్, ఐటీ విధానాలపై దృష్టి..

**ఇక నెగెటివ్ అభిప్రాయాలు :**

పథకాల అమలులో వేగం పెంచాల్సిన అవసరం ఎంతైనా వుంది.. చేసిన వాగ్ధానాలు సంపూర్తిగా అమలు చేయాల్సిన బాధ్యత వుంది.. బీసీ/ఇతర కేటగిరీల క్షేత్రస్థాయి సంక్షేమం అనుకున్నంత స్థాయిలో లేదు.. పోలీసింగ్, రెవెన్యూ వ్యవస్థల్లో మార్పు ఇంకా ప్రారంభ దశలోనే ఉంది..

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ప్రభుత్వానికి ఎదురయ్యే ప్రధాన ఛాలెంజ్‌లు ఒకసారి చూసినట్లయితే.. ప్రజలు జాతీయ మీడియా లెవెల్‌లో అటెన్షన్ ఇస్తే, పనులపై కూడా అదే అంచనాలు పెరుగుతాయి. ఇక ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ లో భాగంగా ఋణభారం,

రెవెన్యూ రికవరీ, ఖర్చు క్రమబద్ధత రేవంత్ కు పెను సవాళ్లుగా మారిపోయాయి.. కాగా ఎప్పటికప్పుడు బీఆర్ఎస్, బీజేపీల కంటే కాంగ్రెస్ లో అంతర్గత రాజకీయాలు టెన్షన్ క్రియేట్ చేస్తుంటాయి.

"రేవంత్ ప్రభుత్వం సక్సెస్ అవుతుందా?" అంటే సక్సెస్సు దిశగా అడుగులు వేస్తోంది.. కానీ పూర్తి విజయాన్ని అందుకునే సమయం ఇంకా రాలేదని చెప్పవచ్చు.. అయితే 100 రోజులు, 6 నెలలు, 1 సంవత్సరం అనే మైలు రాళ్లపై ఆధారపడి ప్రజలు అభిప్రాయం మార్చుకుంటారు.

**ప్రస్తుతం ప్రజా భావన ఎలా ఉంది..? :**

కొంత ఇంప్రెషన్ ఉంది, కానీ రిజల్ట్స్ సరిగా కనిపించడం లేదు.. యూజ్ జూబ్లీహిల్స్ ఎన్నిక ప్రభుత్వానికి మూడ్ ఇండికేటరా? అంటే అవుననే చెప్పవచ్చు.. ఎలా అంటే.. ఇది ఒక అర్బన్, హై ప్రొఫైల్ ఎక్కువగా ఉన్న నియోజకవర్గం.. ఇక్కడ ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీకి అర్బన్ సపోర్ట్ ఇండికేషన్ లభిస్తుంది.. ప్రభుత్వానికి వున్నా పాపులారిటీ ఏమిటో అర్థమవుతుంది కానీ పూర్తిగా రెఫరెండం కాదు. ఏదేమైనా రేవంత్ ఖాతాలో జూబ్లీహిల్స్ విజయం చేరుతుందా లేదా అన్నది మరో మూడు రోజుల్లో తేలిపోతుంది.. మొత్తం మీద తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రేవంత్ రెడ్డి పరిపాలనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతుండటం గమనార్హం..

---

- **ప్రముఖ కవి అందెశ్రీ కన్నుమూత..**
- **అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన మహనీయుడు..**
- **అందెశ్రీ మరణంతో ఒక యోధుడిని కోల్పోయిన తెలంగాణ సాహితీ లోకం..**

# మూగబోయిన తెలంగాణ విప్లవగీతిక..

ఆయన గళం విప్లవ గరళం మింగినట్లుగా కర కర లాడుతుంది.. కానీ కరుణను పంచుతుంది.. ఆయన కళ్ళల్లో నిప్పుల వర్షం కురుస్తూ ఉంటుంది.. అది తెలంగాణకు పట్టిన చీకటి భూతాలను ఎప్పటికప్పుడు తరిమేసే పనిలో ఉంటుంది.. తెలంగాణ గడ్డమీద వెలసిన సాహిత్య చెందురుడు ఆయన.. అందెశ్రీ.. ఈయన అసలు పేరు అందె ఎల్లయ్య.. తెలంగాణ ప్రజాహిత, సాంస్కృతిక విశ్వాసాలకు ప్రతిరూపంగా నిలిచిన ప్రఖ్యాత కవి.. గేయకారుడు, సామాజిక ఉద్యమాలతో ముడిపడ్డ గొప్ప వ్యక్తిత్వం కలిగిన రచయిత.. ఆయన జీవితగాథ.సమకాలీన తెలంగాణ సాహిత్యం, చైతన్యానికి ఒక చుక్కానిలా నిలిచిపోతుంది..

**జీవన ప్రయాణం :**

అందెశ్రీ 1961 జూలై 18న సిద్ధిపేట జిల్లా రేబర్తి గ్రామంలో జన్మించాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన ఆయన అనాథగా





పెరిగారు. విద్య అర్థం లేని స్థితిలోనే గొల్లపల్లె గడ్డపై గొర్రెల కాపరి పనులూ చేసి జీవనాన్ని సాగించారు. ఇలాంటి వెనుకబడిన నేపథ్యం నుంచి జీవితాన్ని మొదలుపెట్టిన ఆయన, సొంతంగా తనకు తాను అభ్యసించుకుంటూ సాహిత్యబద్ధమైన దారిలోకి వచ్చారు..

*** రచనా శైలి, సాంఘిక స్ఫూర్తి :**

అందెశ్రీ రచనా భాష ఎంతో సాధారణంగా, గ్రామీణ తెలంగాణ తెలుగు మాండలికంలో ప్రతిధ్వనిస్తుంటుంది. అభాగ్యులు, హక్కు కోల్పోయిన వారు, రైతులు, శ్రమ జీవులకు ఆయన స్వరభావజాలం మద్దతు పలికింది. తెలంగాణ ఉద్యమంలో ఆయన రచనలు ప్రజల్లో బలమైన చైతన్యం నింపాయి. "జయ జయహే తెలంగాణ" అనే రాష్ట్ర గీతాన్ని రచించడం ద్వారా ఆయన ప్రయాణం మిలియన్ల తెలంగాణ హృదయాలలో కొలువుదీరింది.

*** తెలుగు చలన చిత్రాలలో కూడా ఆయనకు ప్రాధాన్యం :**

తన రచనల్లోని సామాజిక సందేశాన్ని ప్రేక్షకులకి చేరదీయడంలో ఆయన తెలుగు సినీ ప్రపంచాన్ని వేదికగా చేసుకున్నారు. "ఎర్ర సముద్రం" చిత్రంలో, "మాయమాయిపోతున్నదమ్మ మనిషన్నవాడు" వంటి పాటలు మాత్రమే కాదు, ఇతర ఎన్నో ప్రజాదరణ పొందిన గేయాలు ఆయన ఖాతాలో ఉన్నాయి. ఆయన రచన తెలుగు యూనివర్శిటీ సిలబస్‌లోకి కూడా చేర్చబడింది.

*** ఉద్యమ ప్రభావం :**

తెలంగాణ ఉద్యమం సమయంలో ఆయన పాటలు, పద్యాలు ఉద్యమకారులకు శక్తి, స్ఫూర్తి పురివేపాయి. ఆయన రచనలు తెలంగాణ జాతికి గర్వంగా నిలిచాయి. ప్రజా స్వాతంత్ర్యాన్ని, మారుమూల వర్గాలకు ఆదర్శాన్ని పంచే కవిత్వాన్ని ప్రత్యక్షంగా ప్రపంచానికి పరిచయం చేశారు.

*** ఎన్నెన్నో పురస్కారాలు, గౌరవాలు :**

నంది అవార్డుతో పాటు మరెన్నో సాహిత్య, క్రియాత్మక పురస్కారాలు అందుకున్నారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. "జయ జయహే తెలంగాణ" రాష్ట్ర గీత రచనకు రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు..

*** సాహిత్య, సామాజిక వైఖరి :**

అందెశ్రీ ఆధునిక తెలంగాణ ప్రజలకు ఆటవిక స్పందన, గ్రామీణ బతుకుజీవిత చిత్రణ, ఉద్యమ స్ఫూర్తి, తీర్పరి పదాలు అందచేత సాంఘికానికి మార్గదర్శకుడయ్యారు. ఆయన కవిత్వం గ్రామీణ ప్రజల వెదురుపుట్టు మాట్లాడే తెలుగు గొంతుల్లో నిరంతరం వినిపిస్తుంది. ఆయన లేకపోవడం సమాజమంతా ఒక అనిర్వచనీయ లోటుగా భావిస్తోంది..

**వ్యాసకర్త :**
**జస్టిస్ జస్టిస్ చంద్రకుమార్**
**8978385151..**

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.